www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
26-08-2024
సంపుటి : 01 । సంచిక : 114 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## విడిచిపెట్టే ప్రసక్తే లేదు

### మహిళలపై నేరాలు క్షమించరానివి



- నేరస్థులు ఎవ్వరైనా సరే.. కఠినంగా శిక్షపడేలా చేస్తాం
- చట్టాలను మరింత పటిష్ఠపరుస్తున్నాం
- అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపుదిద్దుకోవడంలో వారిది కీలక పాత్ర
- లఖ్పతి దీదీ భవిష్యత్ తరాలను శక్తివంతం చేసేందుకు ఉద్దేశించింది: ప్రధాని మోదీ

## నిండు కుండలా నాగార్జునసాగర్

### క్రస్టు గేట్లపై నుంచి దూకుతున్న కృష్ణమ్మ



**విశ్వంభర, నాగార్జునసాగర్:** అనుకున్నదాని కంటే ముందే వరద రావడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చిచేరడంతో నిండుకుండను

మిగతా5లో...

### ప్రజల శక్తి ప్రధాని అహంకారంపై

## విజయం సాధించింది

- ఈ నియంతృత్వ ప్రభుత్వం నుంచి 140 కోట్ల మందిని కాపాడుతున్నాం
- ప్రభుత్వంలో జవాబుదారీతనాన్ని తీసుకొచ్చా
- యూపీఎస్‌లో యూ అంటే మోదీ సర్కార్ యూటర్న్
- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కీలక వ్యాఖ్యలు



2

## ఎమ్మెల్యేలు పార్టీ మారితే పదవిని రద్దు చేయాలి

- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చొద్దు
- కాంగ్రెస్ తో ఐక్యత ఉన్నా సమస్యలపై పోరాటం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



2

### క్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా

## తెలంగాణ

- వచ్చే ఏడాది నుంచే స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభం
- 2028 ఒలింపిక్స్ లో అత్యధిక మెడల్స్ తెలంగాణ నుంచి సాధించేలా కార్యాచరణ
- 2036 ఒలింపిక్స్ బిడ్ ఇండియాకు దక్కితే హైదరాబాద్ ప్రధాన వేదికగా ఉండేలా ప్రయత్నం
- హైదరాబాద్ మారథాన్ 2024 ముగింపు వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** క్రీడలు, క్రీడల నిర్వహణకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్నారు. 2036 ఒలింపిక్స్ నిర్వహణ అవకాశం ఇండియాకు దక్కితే గనుక హైదరాబాద్‌ను ప్రధాన వేదికగా ఉంచేలా ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కూడా అభ్యర్థించినట్లు వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ ముగింపు వేడుకలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మారథాన్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హైదరాబాద్ మారథాన్ నిర్వాహకులను, స్పాన్సర్లను ఈ సందర్భంగా సీఎం అభినందించారు.రాబోయే ఖేలో ఇండియా యువ క్రీడల నిర్వహణకు

మిగతా5లో...






# హడలెత్తిస్తున్న హైడ్రా



## 18 ప్రాంతాలు.. 166 ఆక్రమణల తొలగింపు

### మొత్తం 43.94 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

### కబ్జాలపై చర్యల నివేదిక విడుదల

### త్వరలో మరిన్ని బడాబాబుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపేందుకు సమాయత్తం

**విశ్వంభర, హైదరాబాద్:**

రాష్ట్ర రాజధానిలో సంచలనంగా మారిన హైడ్రా.. అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కు స్థలాలను కబ్జా చేసిన వారిపై కన్నెర్ర చేస్తూ అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. ఈక్రమంలో జూన్ 27 నుంచి ఆగస్టు 24 వరకు కూల్చివేతలకు సంబంధించిన నివేదికను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వానికి సమర్పించారు. ఇప్పటి వరకు 18 ప్రాంతాల్లో 166 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్టు హైడ్రా వెల్లడించింది.

మిగతా5లో...

హైడ్రా హడలెత్తిస్తోంది. అక్రమ కట్టడాల అంతుచూస్తోంది. సామాన్యుడైనా, వీఐపీ అయినా... అందరికి ఒకే రూల్.. రూల్ ఫర్ ఆల్ అంటూ దూకుడు మీదుంది. శనివారం సినీనటుడు నాగార్జునకి సంబంధించిన ఎన్ కన్వెన్షన్‌ను నేలమట్టం చేసిన హైడ్రా.. ఆదివారం కూడా అదే దూకుడు కొనసాగించింది. అక్రమ నిర్మాణాలను గుర్తించడం... ఆ వెంటనే కూల్చివేయడం చకచకా జరిగిపోతున్నాయి.ఇక హైడ్రా కూల్చివేతలకు సంబంధించిన నివేదికను ఆదివారం జారీ చేసింది.ఇప్పటి వరకు 18 ప్రాంతాల్లో 166 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్టు హైడ్రా వెల్లడించింది. తద్వారా కబ్జాదారుల నుంచి 43 ఎకరాల 94 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వివరించింది.

### హైడ్రా విషయంలో ఒత్తిళ్ళను పట్టించుకోం..

## ఎంతటివారినైనా వదలం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## చేగూరు చౌరస్తాలో లారీ బీభత్సం

- మద్యం మత్తులో ఇద్దరిని బలిగొన్న డ్రైవర్
- స్టీరింగ్ పై నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం



2

## ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఇంటిపై సీబీఐ దాడులు..!

2

## కులగణన పూర్తిచేస్తాం



- తెలంగాణ ఏర్పాటులో బీసీల పాత్ర మరువలేనిది
- మన హక్కులు మనం అడగాలి
- గల్లీ నుంచి ఢిల్లీ దాకా బలహీనవర్గాల న్యాయవాదులు ఏకం కావాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

2

## సంజయ్ రాయ్‌కి ముగిసిన పాలీగ్రాఫ్ పరీక్షలు

- వివరాలను గోప్యంగా ఉంచిన అధికారులు
- సీఎఫ్ఎస్ఎల్ బృందం ఆధ్వర్యంలో లై-డిటెక్టర్ టెస్ట్

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 109 | ₹ 131 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 190 | ₹ 216 |



## వాల్మీకి కుంభకోణంతో టీ కాంగ్రెస్ నేతలకు లింక్

- హైదరాబాద్‌లోని 9 మంది బ్యాంకు ఖాతాలకు
- రూ.45 కోట్లు బదిలీ చేశారు
- పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ ఆ డబ్బులనే ఖర్చు చేసినట్లు అనిపిస్తోంది
- ఎక్స్‌లో కేటీఆర్ సంచలన వీడియో

2

## అక్రమ నిర్మాణాలు కూల్చడం సంతోషమే

### సామాన్యులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోం

- ప్రజల్ని డైవర్ట్ చేయడానికే హైడ్రా
- దమ్ముంటే ప్రభుత్వమే పూడ్చిన చెరువుల మీద చర్యలు తీసుకోండి
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో అక్రమంగా కట్టుకున్న పెద్దల కట్టడాలు కూల్చడం సంతోషమే కానీ, సామాన్యులను ఇబ్బంది పెడితే మాత్రం చూస్తూ ఊరుకోం అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. 1956లో రాష్ట్రం ఏర్పడితే 40 ఏళ్లు కాంగ్రెస్ పార్టీయే

మిగతా2లో...

# ఎమ్మెల్యేలు పార్టీ మారితే పదవిని రద్దు చేయాలి

**విశ్వంభర, హనుమకొండ:**

ఒక పార్టీ నుండి గెలిచి మరో పార్టీలోకి మారే ఎమ్మెల్యేల పదవిని తక్షణమే రద్దు చేసే విధానం రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలు పార్టీ మారితే చట్టంలో ఉన్న లొసుగులతో అనర్హత విషయం ఏళ్ల తరబడి నానుతున్నదని, పార్టీ మారితే వెంటనే పదవి రద్దు చేయాలన్నారు. అలాగే నియోజకవర్గ ప్రజలను మోసం చేసినందుకు క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అస్థిత్వ పోరాటం చేస్తున్నదని, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపుల వల్ల గతంలో నష్ట పోయినందున కాంగ్రెస్ పార్టీ కూడా వాటిని ప్రోత్సాహించవద్దన్నారు. ఇటీవల అసెంబ్లీలో సరైన విధంగా చర్చలు జరుగడం లేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం వాగ్వివాదానికే సమయం సరిపోతున్నదని అన్నారు. రెండు పార్టీలు నిర్మాణ పద్దతులలో మాట్లాడకుండా గందరగోళం సృష్టించి సమయం వృదా చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పై వ్యతిరేకత కారణంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని సకాలంలో నెరవేర్చే దిశగా సాగాలన్నారు. నేటికి ఫీజు రీఎంబర్స్ మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలు, గ్రామ పంచాయతీలలో పనులకు పెండింగు బిల్లులు తదితర సుమారు 70వేల కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని, అలాగే సాకులు చెప్పకుండా అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని, ప్రభుత్వం రూ. 31వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి మూడు విడతలలో రూ. 18,540 కోట్లు మాత్రమే మాఫీ చేశారని అన్నారు. రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

**హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చొద్దు**

హైదరాబాద్ లో హైడ్రా పేరుతో సామాన్యుల ఇండ్లు కూలగొట్టడం సరికాదని, దశాబ్దాల నుండి నివసిస్తున్న వారికి అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, హైడ్రా వలన పేదలకు నష్టం జరుగకుండా చూడాలని కోరారు. కాగా హనుమకొండలో మూడు రోజుల పాటు జరిగిన పార్టీ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలలో నిర్మాణ పరంగా చర్చలు జరిగాయని,ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై చర్చించామన్నారు.

**కాంగ్రెస్ పార్టీతో ఒకవైపు ఐక్యంగా ఉంటూనే మరోవైపు సమస్యలపై పోరాటం..**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో ఒకవైపు ఐక్యంగా ఉంటూనే మరోవైపు సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. తాము స్వతహాగా బలపడుతూనే అవసరం అయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిసి ముందుకు సాగుతామని చెప్పారు. ఇటీవల కాలంలో కమ్యూనిస్టులు లేని లోటును ప్రజలు గుర్తిస్తున్నారని, అసెంబ్లీలో ఒక్కరం ఉన్నా సమస్యలపై గళం ఎత్తుతున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పనిచేస్తామన్నారు.




అలాగే సెప్టెంబర్ 2న అధిక ధరలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగే ధర్నాలలో పాల్గొంటామన్నారు. సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్. బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. విజయ సారథి, జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, మేకల రవి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్,రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, షేక్ బాష్ మియా,ఎన్. అశోక్ స్టాలిన్,మండ సదాలక్ష్మి, నాయకులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి,కె.వెంకటరమణ,యేషబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విడిచిపెట్టే ప్రసక్తే లేదు

**ఢిల్లీ:** దేశంలో మహిళలపై అఘాయిత్యాలు ఆందోళన కలిగిస్తోన్న వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. అటువంటి నేరాలకు పాల్పడే వారిని విడిచిపెట్టబోమని హెచ్చరించారు. మహారాష్ట్రలోని లఖ్పతి దీదీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన మోదీ.. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా శిక్షపడేలా చేస్తామని అన్నారు. ఇందుకోసం కఠిన చట్టాలను మరింత పటిష్ఠపరుస్తున్నామని చెప్పారు. కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారం, బద్లాపుర్ పాఠశాలలో లైంగిక వేధింపుల ఘటనలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు కొనసాగుతున్న వేళ ప్రధానమంత్రి ఇలా స్పందించారు. "మహిళల భద్రత ఎంతో ముఖ్యమైనది. మహిళలపై నేరాలు క్షమించరానివని ప్రతి రాష్ట్రానికి చెబుతున్నా. నేరస్థులు ఎవ్వరైనా సరే.. వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా శిక్షించేందుకు చట్టాలను మరింత పటిష్ఠపరుస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "2014 వరకు స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.25వేల కోట్ల కంటే తక్కువే ఇచ్చారు. కానీ, గత పదేళ్లలో రూ.9లక్షల కోట్లు ఇచ్చాం. లఖ్పతి దీదీ కార్యక్రమం కేవలం మహిళల ఆదాయాన్ని పెంచడమే కాకుండా భవిష్యత్ తరాలను శక్తివంతం చేసేందుకు ఉద్దేశించింది" అని మోదీ పేర్కొన్నారు. 4.3లక్షల స్వయంసహాయక సంఘాల్లోని 48లక్షల మంది లబ్ధిదారుల కోసం రూ.2500 కోట్ల నిధులను ప్రధాన మంత్రి విడుదల చేశారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపుదిద్దుకోవడంలో మహిళలది కీలక పాత్ర అని మోదీ వెల్లడించారు. కుటుంబ శ్రేయస్సు కోసం మహిళగా ఎంతో తోడ్పాటును అందించినా వారికి తగిన సహాయం లభించదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనే మహిళల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం ఏటా ప్రయత్నాలు చేస్తోందని, ఈ క్రమంలో 3 కోట్ల మంది సోదరీమణులను లక్షాధికారులను చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చామన్నారు. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల్లో పనిచేసే వారి వార్షిక ఆదాయం రూ.లక్ష దాటుతుందన్నారు.

## ప్రజల శక్తి ప్రధాని అహంకారంపై విజయం సాధించింది

**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీఎస్‌లో యూ అంటే మోదీ సర్కార్ యూటర్న్‌లని ఖర్గే అభివర్ణించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం మోదీ సర్కార్ తీసుకున్న పలు కీలక నిర్ణయాలను మళ్లీ వెనక్కితీసుకోవడం వెనుక విపక్షాల విమర్శల దాడి ఉందని పేర్కొన్నారు.జూన్ 4 తర్వాత ప్రజల శక్తి ప్రధాని అహంకారంపై విజయం సాధించిందని చెప్పారు. లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్‌పై వెనక్కితగ్గడం, వక్ఫ్ బిల్లును జేపీసీకి పంపడం, బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు ముసాయిదా ఉపసంహరణ, అధికార యంత్రాంగంలో లేటరల్ ఎంట్రీ రద్దు వంటి ఎన్నో నిర్ణయాలను మోదీ ప్రభుత్వం ఇటీవల వెనక్కితీసుకుందని ఖర్గే గుర్తుచేశారు. ఈ నియంతృత్వ ప్రభుత్వం నుంచి తాము 140 కోట్ల మందిని కాపాడుతున్నామని, ప్రభుత్వంలో జవాబుదారీతనాన్ని తీసుకొచ్చామని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్‌కు భరోసా ఇచ్చే యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కు కేంద్ర క్యాబినెట్ శనివారం ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. యుపిఎస్‌ని ఎంచుకునే ఉద్యోగులు 25 సంవత్సరాల కనీస సర్వీసుతో సూపర్‌యాన్యుయేషన్‌కు ముందు గత 12 నెలల్లో డ్రా చేసిన సగటు ప్రాథమిక వేతనంలో 50 శాతం హామీ ఇవ్వబడిన పెన్షన్ పొందేందుకు అర్హులు.

## చేగూరు చౌరస్తాలో లారీ బీభత్సం..

**విశ్వంభర, కొత్తూరు:** మద్యం సేవించిన లారీ డ్రైవర్ జాతీయ రహదారిపై బీభత్సం సృష్టించాడు. పలు వాహనాలను ఢీకొట్టి తల్లీబిడ్డ మృతికి కారణమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని హుబ్లీ నుంచి హైదరాబాద్ కు లోడుతో వస్తున్న లారీ రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం చేగూరు చౌరస్తా వద్దకు రాగానే అదుపు తప్పింది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ షేక్ మహమ్మద్ స్టీరింగ్ పై నియంత్రణ కోల్పోవడంతో.. లారీ ముందు వెళ్తున్న టెంపో, ఆటో, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తాన్న షాద్నగర్ పట్టణానికి చెందిన కావ్య (24), అనన్య (1) అక్కడికక్కడే మృతి చెందారు. సాయికృష్ణ, నిహారిక (4) గాయాలతో బయటపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు లారీ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించారు.

## ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ ఇంటిపై సీబీఐ దాడులు..!



**కోల్‌కతా:** కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ ఆస్తులపై ఆదివారం కేంద్ర దర్యాప్తు సంస్థ దాడులు మొదలుపెట్టింది. మొత్తం 15 చోట్ల ఏకకాలంలో సీబీఐ బృందాలు తనిఖీలు మొదలుపెట్టాయి. ఆర్జీ కర్ మెడికల్ కళాశాలలో జరిగిన ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ఈ చర్యలు చేపట్టారు. ఇప్పటికే అవకతవకలకు పాల్పడినట్లు సీబీఐ ఘోష్పై కేసులు నమోదు చేసింది. ఆగస్టు 9వ తేదీ ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రెయినీ పీజీ డాక్టర్ హత్యాచారానికి గురికావడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై దర్యాప్తు తీరు దారుణంగా ఉందనే విమర్శలు రావడంతో హైకోర్టు కేసును సీబీఐకి బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో ఆర్జీ కర్ ఆస్పత్రిలో గతంలో పనిచేసిన డిప్యూటీ సూపరింటెండెంట్ అక్తర్ అలీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్పా తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. ఈ కేసును కూడా న్యాయస్థానం సీబీఐకి బదిలీ చేసింది. మూడు వారాల్లోగా దర్యాప్తు స్టేటస్ రిపోర్టును సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సందీప్ ఘోష్ మరో నలుగురికి శనివారం లైడిటెక్టర్ పరీక్షలు చేశారు. దీనికోసం ఢిల్లీ నుంచి సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబోరేటరీ నుంచి ప్రత్యేక బృందాలు వచ్చాయి.

## హైడ్రా విషయంలో ఒత్తిళ్లను పట్టించుకోం..

# ఎంతటివారినైనా వదలం

- జనహితం, భవిష్యత్ తరాల మేలు కోసం ఆక్రమణలపై యుద్ధం తప్పదు
- ధర్మరక్షణ లాంటిదే చెరువుల పరిరక్షణ
- ప్రభుత్వ అస్పత్రుల్లో భోజనానికీ హరే కృష్ణ సంస్థ సహకారం తీసుకుంటాం
- భగవద్గీత స్ఫూర్తి.. శ్రీకృష్ణుడే మార్గదర్శి
- హరేకృష్ణ హెరిటేజ్ టవర్ శంకుస్థాపన మహోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** జనహితం కోసం, భవిష్యత్ తరాల మేలు కోసం హైడ్రా ద్వారా చెరువుల పరిరక్షణను బృహత్తర బాధ్యతలా చేపట్టామని, ఇందులో రాజకీయ ఒత్తిళ్లకు తావు లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. లేక్ సిటీగా వర్ధిల్లిన హైదరాబాద్ నగరానికి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. ప్రకృతి వనరులను కాపాడుకోకుంటే అనర్థాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకం కావొద్దంటే వర్తమానంలో కఠిన చర్యలు తప్పవన్నారు. భగవద్గీత స్ఫూర్తిగా శ్రీకృష్ణుడే మార్గదర్శిగా చెరువుల పరిరక్షణను ధర్మ రక్షణగా భావిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. "శతాబ్దాల కిందటే హైదరాబాద్ ను చెరువుల నగరం(లేక్ సిటీ)గా నాటి పాలకులు అభివృద్ధి చేశారు. కోట్లాది మందికి దాహార్తిని తీర్చిన చెరువుల పరిధిలో ఇవాళ కొందరు వ్యక్తులు విలాసాల కోసం ఫామ్ హౌస్ లు కట్టి వ్యర్థజలాలను వదులుతున్నారు. వీటిని విస్మరిస్తే మేము ప్రజా ప్రతినిధులుగా ఉండి కూడా వ్యర్థమే అవుతుంది. అందుకే చెరువుల పరిరక్షణకు పూనుకున్నాం.

కురుక్షేత్ర యుద్ధ సందర్భంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధనల స్ఫూర్తితో చెరువుల ఆక్రమణలపై మా ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. ఇది రాజకీయ కక్షల కోసం కానేకాదు. భవిష్యత్ తరాలు బాగుండాలనే సంకల్పంతో ముందుకు పోతున్నాం. హైడ్రా విషయంలో ఎవరు ఎన్ని ఒత్తిడులు తెచ్చినా పట్టించుకోం. చెరువుల ఆక్రమణదారులు ఎంతటివారైనా భరతం పడతాం. ధర్మాన్ని కాపాడాలన్న శ్రీకృష్ణుడి బోధనల స్ఫూర్తిగా మా ప్రభుత్వం ధర్మంవైపు నిలబడుతుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. కోకాపేటలో 430 అడుగుల ఎత్తుతో వైభవోపేతంగా నిర్మితం కానున్న హరే కృష్ణ హెరిటేజ్ టవర్ భవనానికి ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు. అనంతశేష స్థాపన పూజలో ముఖ్యమంత్రి తో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పలువురు ప్రజాప్రతినిధులు, హరే కృష్ణ ఉద్యమ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. కాంక్రీట్ జంగల్ గా మారిన కోకాపేట ప్రాంతంలో హరే కృష్ణ హెరిటేజ్ భవనం ద్వారా యావత్ ప్రపంచానికి ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందని, ఇలాంటి మహోత్తమ కార్యక్రమంలో పాల్గొనడం జన్మ సుకృతమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉస్మానియా, గాంధీ, నిమ్స్ తదితర ప్రభుత్వ ఆస్పత్రులల్లో భోజనం అందించేందుకు హరే కృష్ణ ఫౌండేషన్ సహకారం తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు.

## కులగణన పూర్తిచేస్తాం

**విశ్వంభర, హైదరాబాద్:** బీసీలు హక్కులను సాధించుకోవాలని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మాసబ్ ట్యాంక్ లోని జవహర్లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓబీసీ అడ్వకేట్స్ కన్వెన్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు."తెలంగాణ ఏర్పాటులో బీసీల పాత్ర మరువలేనిది. ఈ విషయంలో అందరినీ అభినందిస్తున్నా. మన హక్కులు మనం అడగాలి. ఈ సమావేశంలో చెప్పిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజు చెప్పా. మళ్లీ చెప్తున్నా.. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్రంలో కులగణన పూర్తిచేస్తాం. గల్లీ నుంచి ఢిల్లీ దాకా బలహీనవర్గాల న్యాయవాదులు ఏకం కావాలి. జీవితం సార్థకం కావాలంటే మనం మన హక్కుల కోసం పోరాడాలి" అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

## సంజయ్ రాయ్‌కి ముగిసిన పాలీగ్రాఫ్ పరీక్షలు

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కి పాలీగ్రాఫ్ పరీక్షలు ముగిశాయి. ఈ మేరకు ఆదివారం అధికారులు వెల్లడించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం అతడు కోల్‌కతా జైల్లో ఉండగా అక్కడే లై డిటెక్టర్ పరీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఢిల్లీలోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (సీఎఫ్ఎస్ఎల్)కు చెందిన పాలిగ్రాఫ్ నిపుణుల బృందం ఆధ్వర్యంలో నిందితుడు సంజయ్ రాయ్‌కు లై-డిటెక్టర్ టెస్ట్ నిర్వహించారు. అయితే పాలిగ్రాఫ్ టెస్ట్‌కు ముందు తాను నిర్దోషినని జైలు అధికారులతో అతడు అన్నాడు. వైద్యురాలి హత్యాచారం గురించి తనకు తెలియదని, ఈ కేసులో తనను ఇరికించినట్లు సంజయ్ రాయ్ ఆరోపించాడు.ఇదే కేసుకు సంబంధించి మరో ఇద్దరు నిందితులకు సీబీఐ కార్యాలయంలో పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. అయితే, నిందితులు ఏం చెప్పారన్న వివరాలను మాత్రం గోప్యంగా ఉంచారు. మరోవైపు ఈ కేసులో ఆరీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, బాధితురాలిపై హత్యాచార ఘటన చోటుచేసుకున్న రోజు డ్యూటీలో ఉన్న మరో నలుగురు వైద్యులు, మరో సివిల్ వాలంటీర్కు శనివారం లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించారు. ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా చేరుకున్న సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ బృందం ఈ పరీక్షలు నిర్వహించింది. ఆ వివరాలు కూడా బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చడం సంతోషమే



(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉంది. చెరువుల చుట్టూ ఉన్న పట్టా భూముల్లో పేదలు కట్టుకున్న ఇళ్లు కూలుస్తామని సాహెబ్ నగర్, సరూర్ నగర్, ఫాక్స్ నగర్ లో ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నారు. సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం కరెక్టేనా అని సీఎం రేవంత్ రెడ్డిని అడుగుతున్నా.కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా అయ్యప్ప సొసైటీలో భవనాలను కూల్చే ప్రయత్నం చేసి మళ్లీ తోక ముడిచారు. ఆ తరువాత ఏం జరిగిందో చూశాం. ప్రజా సమస్యలను పరిష్కరించే నమ్మకం లేక, వాటిపై చర్చించే వెసులుబాటు లేక ప్రజల్ని డైవర్ట్ చేయడానికి హైడ్రాను ముందు పెట్టారు. తప్పకుండా ప్రజలు దీనిపై ఆలోచన చేస్తున్నారు. దమ్ముంటే ప్రభుత్వమే పూడ్చిన చెరువుల మీద చర్యలు తీసుకోండి. బతుకమ్మ కుంటను పూడ్చింది ప్రభుత్వం కాదా? ప్రభుత్వం పూడ్చి వేసిన చెరువులు ఎన్ని? లెక్క తేల్చాలి. సామాన్యుడిని నష్టపోనివ్వం" అని ఈటల తెలిపారు.

## వాల్మీకి కుంభకోణంతో టీ కాంగ్రెస్ నేతలకు లింక్

- హైదరాబాద్‌లోని 9 మంది బ్యాంకు ఖాతాలకు
- రూ.45 కోట్లు బదిలీ చేశారు
- పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్
- ఆ డబ్బులనే ఖర్చు చేసినట్లు అనిపిస్తోంది
- ఎక్స్‌లో కేటీఆర్ సంచలన వీడియో



**విశ్వంభర, హైదరాబాద్:** కర్ణాటకలో జరిగిన భారీ వాల్మీకి కుంభకోణంతో తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు లింక్ ఉందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని 9 మంది బ్యాంకు ఖాతాలకు వాల్మీకి కార్పొరేషన్ డబ్బు రూ.45 కోట్లు బదిలీ చేశారని, అవి ఎవరి ఖాతాలని ఎక్స్‌లో ఆయన ప్రశ్నించారు. తీగ లాగితే తెలంగాణ కాంగ్రెస్ డొంక మొత్తం కదులుతుందని విమర్శలు చేశారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ ఆ డబ్బులనే ఖర్చు చేసినట్లు అనిపిస్తోందని కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. 'వీ6 బిజినెస్ యజమాని ఎవరు, ఆ ఖాతాకు రూ.4.5 కోట్లు ఎందుకు బదిలీ చేశారు..? లోక్‌సభ ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో నగదు విత్‌డ్రా చేసిన బార్‌లు, బంగారం దుకాణాలు ఎవరివి..? కాంగ్రెస్ పార్టీతో వారికి సంబంధం ఏమిటి..? కుంభకోణంతో హైదరాబాద్‌కు ఇన్ని లింకులు కనపడుతున్నా తెలంగాణ కాంగ్రెస్ నాయకులను ఎవరు కాపాడుతున్నారు..?' అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. సిద్ధరామయ్యను తొలగిస్తే పక్కన ఉన్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని కర్ణాటక మంత్రి సతీష్ జార్ఖిహోలీ అంటున్నారని, కర్ణాటక కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీతో పెనవేసుకున్న బంధం వాల్మీకి స్కామేనా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ఈ స్కాంపై నోరు విప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# కృష్ణస్వామి స్ఫూర్తితో ముదిరాజ్ సమాజం ముందుకు సాగాలి



**హరీశ్ రావు**

**విశ్వంభర, సిద్దిపేట :** హైదరాబాద్ తొలి మేయర్‌గా కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ నగరానికి ఎంతో సేవలు అందించారు. వారి అడుగుజాడల్లో ముదిరాజ్ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ రోడ్డులో దివంగత కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్ సమాజానికి సిద్దిపేటలో సర్పంచులుగా, మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్లుగా అనేక పదవుల్లో వారిని నియమించి గౌరవించామన్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ముదిరాజ్ ఆత్మగౌరవ భవనాన్ని సిద్దిపేటలో నిర్మించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో ముదిరాజ్ ఆత్మ గౌరవ భవనాలు ఉన్న నియోజకవర్గం సిద్దిపేట ఒక్కటేనని పేర్కొన్నారు. ముదిరాజ్ రిజర్వేషన్‌కు బీఆర్ఎస్ పార్టీ సహకరిస్తుందని స్పష్టం చేశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కొత్త సభ్యత్వ కార్డులను మంజూరు చేసిందని తెలిపారు. ఈ చౌరస్తాని కృష్ణస్వామి జంక్షన్‌గా మారుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ముదిరాజ్ సమాజ్ సభ్యులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# అన్నదానం మహాదానం : కాచం సుష్మా



**విశ్వంభర, ఎల్బీనగర్:** అన్నదానం మహాదానం అని ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగ్ ప్రధాన కార్యదర్శి కాచం సుష్మా అన్నారు. ఆదివారం బంజారా హిల్స్ లోని బసవ తారక హాస్పిటల్ వద్ద సర్వ్ ఫౌండేషన్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తతో కాచం సుష్మా కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అన్నదానానికి మించిన సేవా మరొకటి లేదు అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత బాగం సేవకు వినియోగించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓజోన్ హాస్పిటల్ డైరెక్టర్ మధుసుధన్ రెడ్డి, వామ్ ఎన్ఆర్ఐ చైర్మన్ ఎంఎంఅర్ గుప్త, సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ శంకర్, సెక్రటరీ ప్రవీణ్ గుప్త, రాఘవేంద్ర రెడ్డి, చైతన్య, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ప్రజలకు పోలీసుల అవగాహన సదస్సు

**విశ్వంభర, చైతన్యపురి :** చైతన్యపురిలో స్థానిక ప్రజలకు ఎస్ఐ భద్రయ్య ఆధ్వర్యంలో పోలీసులు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ లక్ష్మీనారణ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. టెక్నాలజీని వాడుకొని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారని సూచించారు. వాట్సాప్, ఫేస్బుక్, ఇతర యాప్లు, లింకులు, ఈ మెయిల్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అనవసర లింక్లను క్లిక్ చేయడంతో కలిగే అనర్థాలు, నష్టాలపై వివరించారు. గుర్తుతెలియని, అపరిచిత వ్యక్తులతో ఫో స్ కాల్స్, వాట్సాప్, ఫేస్బుక్, చాటింగ్కు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం. గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు. 1930 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు.

అనంతరం డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరం కృషి చేయాలని ఎస్ఐ భద్రయ్య అన్నారు. డ్రగ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ సప్లై చేసినా, వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ సప్లైపై ఎటువంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలని చెప్పారు. సమాచారం అందిచిన వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ కు అలవాటు పడి ఎందరో తమ బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ కారణంగా వారి జీవితాలనే కాకుండా వారి కుటుంబాలను కూడా ఇబ్బందుల పాలు చేస్తున్నారని చెప్పారు. యాంటి డ్రగ్స్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందన్నారు. అందరి సహకారంతో ఇది సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో చైత్యన్యపురి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శేఖర్, హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, ఉమెన్ పీసీ భవాణి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ లక్ష్మీనారయణ

## రంగారెడ్డి, మేడ్చల్, నాగోల్, ఎల్బీనగర్‌లలో

# హైడ్రా కూల్చివేతలు జరగాలి

**- సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాంధీ నాయక్ విజ్ఞప్తి**

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ తరహా బఫర్ జోన్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఆస్పత్రులు ఫంక్షన్ హాల్స్ అపార్ట్మెంట్లు ఇండ్లు అక్రమ కట్టడాలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, నాగోల్, ఎల్బీనగర్ లో సైతం హైడ్రా కూల్చి వేయాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మన్ గాంధీ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గాంధీ నాయక్ మాట్లాడుతూ బఫర్ జోన్, ఎఫ్ టీ ఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్ )లో భూములు ఆక్రమించుకున్న వారి కట్టడాలను కూల్చి వేయాలని కోరారు. ప్రభుత్వ భూములు కాపాడాలని అక్రమ నిర్మాణం చేపట్టిన ఆస్తులను ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని చట్ట ప్రకారం ముందుకు వెళుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. బఫర్ జోన్, ఎఫ్ టీ ఎల్ భూముల్లో అక్రమ నిర్మాణాలు సిటీ లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని, గతంలో కొంతమంది ప్రభుత్వ అధికారులు అనుమతులు ఇచ్చారని అలాంటి అధికారులపై సైతం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిటీ ప్రాంతంలో మునిసిపాలిటీలో బఫర్ జోన్లలో నిర్మాణాలు చేసిన వివరాలను సేకరించి త్వరలో జిల్లా కలెక్టర్ కు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సేవాలాల్ బంజారా సంఘం ఫిర్యాదు అందజేస్తుందని గాంధీ నాయక్ అన్నారు. ముక్కుసూటిగా ప్రజాపాలన చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలు, పెద్దలు అని చూడకుండా అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు హైడ్రాకు అధికారం ఇవ్వడం అక్కడ నిజాయితీగల అధికారి రంగనాథ్‌ని నియమించడం అభినందనీయమని, నాగార్జునని, కేటీఆర్ ని, మాజీ తెరాస ప్రజాప్రతినిధులను కానీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అని చూడకుండా హైడ్రా అధికారులు తెల్లవారుజామునే కూల్చివేతలకు పాల్పడడం చెరువులను కాపాడడం అభినందనీయమని టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ కే.గాంధీ నాయక్ అన్నారు. గత 35 సంవత్సరాల నుంచి హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలో దాదాపు 200 చెరువులు, చిన్న చిన్న కుంటలు, మూసి ప్రాంతాన్ని ఇటుపక్క అటుపక్క అక్రమంగా కబ్జాలకు గురయ్యాయని. కబ్జాలకు గురి అవడానికి కారణం గత ప్రభుత్వాలు, అధికారులు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్, జ్యూడీషిల్ ఇవన్నీ కారణమని గాంధీ నాయక్ పేర్కొన్నారు. ఈ చెరువులను ఇప్పుడు కాపాడకపోతే వచ్చే జనరేషన్ కి చాలా ఇబ్బందులు అవుతాయని. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం, అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని కబ్జా నుండి కాపాడి చెరువులను మూసిని పునరుద్ధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కొంతమంది తూములను కూడా కబ్జా పెట్టి తూములపై కూడా బిల్డింగులు కట్టడం జరిగిందన్నారు. ఇవన్నీ ప్రభుత్వం కాపాడడానికి ముందుకు వచ్చినందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు అధికారులు ప్రజలు అందరూ సహకరించి చెరువులను కబ్జా దారుల బారి నుండి కాపాడాలని, దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మన్ గాంధీ నాయక్ విజ్ఞప్తి చేశారు.







# అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



**విశ్వంభర, షాద్‌నగర్ :** అత్యంత మధుర గానాలతో కూచిపూడి నృత్యం అభిమానించే కళాకారులకు కనువిందు చేసింది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ అబిడ్స్ తెలంగాణ సారస్వత పరిషత్ లో శ్రీ వైష్ణవి ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా నంద నందనా గోపాల సంగీత నృత్య నిరాజనం నాట్యాచారులకు గురు సత్కారం లో భాగంగా ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి రంజు ప్రవీణ ప్రబోదయ డాన్స్ & మ్యూజిక్ శిష్య బృందం చిన్నారి అక్షయ కూచిపూడి నృత్యం పలుకే బంగారమాయే ప్రదర్శన అభినయం, హావభావాలతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసింది. అనంతరం ప్రదర్శించిన పలు కీర్తనలు సిద్ధి వినాయక, పుష్పాంజలి, రామ రామ, చే యశోద కూచిపూడి నృత్య కళాకారులను ఎంతగానో అలరించాయి.

అనంతరం శ్రీ వైష్ణవి ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ కూచిపూడి నాట్య గురువు డాక్టర్ సజని వల్లభనేని చేతిలో మీదుగా నాట్య కళాకారిణి రంజు ప్రవీణను శాలువాతో సత్కరించి నృత్య కరీనులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.

# ఎస్వీకే మోటార్స్ ప్రారంభం

**విశ్వంభర, వనస్థలిపురం :** వనస్థలిపురంలోని కమలానగర్‌లో ఘనంగా ఎస్వీకే ఆధ్వర్యంలో టీవీఎస్ షోరూంను ముక్య అతిథిగా హాజరైన చందగౌని రామస్వామి గౌడ్ ప్రారంభించారు. టీవీఎస్ మోటార్ కంపెనీ, మోపెడ్, స్కూటీ పెప్ స్కూటీ స్ట్రీక్, హీరో హోండా బజాజ్ యమహా లాంటి వాహనాలు అందుబాటులో ఉంటాయని నూతన ఆధునికరమైన వాహనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పటానికి సంతోషించుతున్నామని యాజమాన్యం ఈ సందర్భంగా తెలియజేశారు. రామస్వామి మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో వినియోగదారులకు సేవలందించడం అభినందనీయమని యాజమాన్యాన్ని ప్రశంషించారు. ఈ కార్యక్రమంలో కుందారపు శ్రీకాంత్ మోహన్ రావు కళ్యాణ్ స్వామినాథ్ గౌడ్ కిషోర్ శేషా రెడ్డి రాజేష్ మధు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





# సన్మార్గ మార్గదర్శి కృష్ణ పరమాత్మ

### శ్రీ కృష్ణాష్టమి ప్రత్యేకం

"వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనమ్ దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్"... శ్రావణ బహుళ అష్టమి "కృష్ణాష్టమి పర్వదినం. కృష్ణుని జన్మదినోత్సవ సందర్భ పర్వమగుటచే దీనిని "జన్మాష్టమి" అని, కృష్ణుడు బాల్యంలో గోకులమున పెరిగినం దున "గోకులాష్టమి"అని, "కృష్ణ జయంతి", "శ్రీ జయంతి"అని ఈ పర్వదినానికి పేర్లు ఉన్నాయి. ఈనాడు జరిపే పూజా పునస్కా రాలను కృష్ణాష్టమి వ్రతం, కృష్ణ జయంతీ వ్రతం, కృష్ణ జన్మాష్టమి వ్రతము అని పిలుస్తారు. భక్తుల కోర్కెలు తీర్చే క్రమంలో భగవంతు డు రెండు రకాల విధానాలను అనుసరిస్తాడు. సర్వం తానే స్వయంగా నిర్వహించి, తనపై మనకున్న నమ్మకాన్ని పెంచు కోవడం మొదటి పద్ధతి. మన ప్రయత్నంలో రహస్యంగా సహకరించి, మనపై మనకు నమ్మకాన్ని పెంచి విజేతలుగా తీర్చిదిద్దడం రెండో పద్ధతి. ఇందులో మొదటి దాన్ని దైవికం అని, రెండోదాన్ని పౌరుషం అని శాస్త్రం నిర్వచించింది. పరమాత్మ ప్రతి అవతారంలో ఏదో ఒక మార్గాన్నే ఎంచుకున్నాడు. కానీ కృష్ణావతారంలో మాత్రం రెండు విధాలుగానూ మనకు ఆయన దర్శనమిస్తాడు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణల్లో భాగవతంలోని కృష్ణుడు ఎవరి సహాయాన్నీ కోరలేదు. స్వయంగా తానే అవతార లక్ష్యం దిశగా సాగి పోయాడు. భారతం లోని కృష్ణుడు మాత్రం రెండో పద్ధతి అనుసరించాడు. చేసిందంతా తానే అయినా ఘనతను మాత్రం పూర్తిగా పాండవుల పరం చేశాడు. వారిని విజేతలుగా నిలబెట్టాడు. శ్రీకృష్ణ భగవానుడు ద్వాపర కలియుగ సంధికాలంలో శ్రీముఖ నామ సంవత్సరంలో శ్రావణ మాసంలో బహుళ పక్షంలో రోహిణి నక్షత్రంతో కూడిన అష్టమినాడు రెండు యామముల రాత్రి సమయాన కంసుని కారాగారంలో, దేవకికి 8వ గర్భంగా మేనమామ గండాన జన్మించాడు. కృష్ణాష్టమి ఒక గొప్ప పవిత్ర దినంగా పరిగణించ బడుతుంది. ఉపవాస పూజా జాగరణల ముఖ్య దినాలలో ఒకటి. బాలింత రాళ్ళకు తినిపించే కాయం, నైవేద్యం పెట్టడం అనగానే తల్లులకు ప్రియమై, మాతృ హృదయాలలో మమతను పాంపొందించే పండుగ, కృష్ణుని బాల్యచేష్టలను జ్ఞప్తికి తెస్తుంది. పాపపుణ్యాల వాసనే లేని బ్రహ్మ స్వరూపపు బాలలలో ద్యోతకమయ్యే దివ్యత్వాన్ని తేట పరిచే పర్వం కృష్ణాష్టమి. ఈనాడు బాలకృష్ణుడు పూజలందుకుం టాడు. యోగీశ్వరుడు, లీలా మానుష విగ్రహుడు, రాజకీయ దురంధరుడు, పరమాత్ముడు, గీతా ప్రవక్తయైన కృష్ణుడు నిర్యాణం చెందిన దినమే కలియుగ ప్రారంభ దినంగా పేర్కొంటారు. వర్తమాన కలియుగం క్రీస్తుపూర్వం 3102 ఫిబ్రవరి 20 వ తేదీ 2 గంటల 27 నిమిషాల 30 సెకండ్ల కాల మున ప్రారంభమైనదని నిర్ధారించి, ప్రపంచ శాస్త్రజ్ఞుల కన్నా మేధావులమని నిరూపించారు భారత ఖగోళ శాస్త్రవేత్తలు. అంటే 5,124 ఏళ్ల క్రితం కలియుగం ప్రారంభమైనట్టు చెబుతారు. కలియుగం ప్రారంభమైన సమయం నుండి కృష్ణుని జన్మదినోత్సవం ప్రతి ఇంట జరుప బడుతున్నది. మహా విష్ణువు బ్రహ్మాండాన్ని ఉద్ధరించ దానికి శ్రీకృష్ణుడిగా జన్మించిన ఉట్ల పండుగ అని కూడా పిలువబడే శ్రీకృష్ణ జన్మాష్టమిని గురించి తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు... "పైకొని చూడరె వుట్ల పండుగ నేడు ఆకడ గొల్లెతకు ననందము నేడు.. అదర శ్రావణ బహుళాష్టమి నేడితడు.. నడిరేయి జనియించి నాడు చూడ గదరే" అని వర్ణించాడు. కృష్ణ చరిత్రకు 8వ సంఖ్య సన్నిహిత సంబంధముంది. ఆయన పుట్టింది 8వ తిథి. దశావతారాలలో 8వ అవతారం. ఆయన వసుదేవుని 8వ సంతానం. ఆయనకు 8మంది పట్టపు రాణి 8, చే గుణింపబడే పదహారు వేల గోపికల మనోహరుడు. అలాగే అష్ట భార్యల వల్ల ఆయనకు కలిగిన సంతాన 80 మంది. కృష్ణాష్టమి భక్తులకు ఉపవాస దినం. కృష్ణాష్టమి పూజలో భాగంగా గుమ్మం దగ్గరి నుంచి.. పూజ మంటపం వరకు శ్రీ కృష్ణ పాదాలను వేస్తుంటారు. ఇలా చేయడం వల్ల తమ ఇంట్లోకి సుఖ సంతోషాలు ప్రవేశిస్తాయని నమ్ముతారు. బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ, పళ్ళు స్వామికి నివేదించినఉయ్యాల కట్టి అందులో కృష్ణ మూర్తిని పరుండ బెట్టి ఊపుతూ వైవిధ్య భరిత



పాటలు, కీర్తనలుపాడుతారు. శ్రీకృష్ణ జయంతి వ్రతాచరణ ద్వారా గోదానం చేసిన, కురుక్షేత్రంలో సువర్ణ దానం చేసిన ఫలాలు దక్కగలవని, పుణ్యప్రద మని బ్రహ్మాండ పురాణం వివరిస్తున్నది. మహా భారత యుద్ధాన్ని ముందుండి నడిపిన మార్గదర్శి, దుష్ట శిక్షణ..శిష్ట రక్షణ అన్న గీతోపదేశంతో మానవాళికి దిశా నిర్దేశం చేసింది కృష్ణ భగవానుడే. శ్రీమత్ మహా భాగవతం జీవిత విలువలను బోధిస్తూ, ఇప్పటికీ మార్గదర్శనంచేయడం ద్వారా శ్రీకృష్ణ మహోన్నత వ్యక్తిత్వానికి దర్పణం పడుతుంది. ద్వాపర యుగంలో ఉద్భవించిన కృష్ణ పరమాత్మ నేటికీ ఆదర్శంగా నిలుస్తుండడం, ఇష్టదైవంగా కొలువు తీరడం విశేషం. కృష్ణాష్టమి నాడు కేవలం భగవానుని పూజించడమే కాదు, అయనలోని కొన్ని అయినా మంచి లక్షణాలని అలవర్చుకోవాలి. ప్రతి విషయం లోనూ స్వార్థం, ఈర్ష్య, అసూయ లను కొంతైన విడనాడి.. మానవ జన్మకు సార్థకతను ఏర్పరచు కోవాలి. శ్రీకృష్ణుడు తన లీలల ద్వారా భక్తులకు జ్ఞానోపదేశం చేశాడు. ఆయన చేసిన అన్ని పనులలోను అర్థం పరమార్థం కనిపిస్తాయి. శ్రీకృష్ణుడు జగద్గురువు."కృష్ణస్తు భగవాన్ స్వయమ్'... కృష్ణుడే పరమ తత్త్వం... చరమ లక్ష్యం... ఆయన గురించి చదవడం, చెప్పడం, పాడడం, వినడం... అన్నీ అపురూపమైన అనుభవాలే. 'నీలో లేని చోద్యాలు ఈ ప్రపంచంలో ఏం ఉంటాయి?' అని అక్రూరుడన్నా... 'అటువైపు కృష్ణుడున్నాడు... ఇటువైపు ఎవరున్నారు' అని సంజయుడు హెచ్చరించినా... అవన్నీ పరమాత్మ విరాట్ రూపాన్ని విశదీకరించే ఉదాహరణలే... క్రియ, బోధ కలగలిసిన అద్భుత తత్త్వం ఆయనది. యుగా వసరాలకు అన్వయించుకో తగ్గ మహాగాథ శ్రీకృష్ణుడిది. శ్రీకృష్ణుడు అల్లరి బాలుడు.. తన చిలిపి చేష్టలతో జీవిత పరమార్థాన్ని చెప్పాడు. వెన్న దొంగగా అందరి మనసులను దోచుకున్నాడు. గోప బాలకుడిగా, సోదరునిగా, అసుర సంహారిగా, ధర్మ సంరక్షకుడిగా ఎన్నో రకాల పాత్రలు పోషించాడు. ఎన్ని రకాల పాత్రలు పోషించినా అదంతా లోక కల్యాణం కోసమే. భారతదేశంలో ఎన్ని కృష్ణ ఆలయాలు ఉన్నా ముఖ్యమైనవి మాత్రం ఐదు ఉన్నాయి. ఇవి పంచ దివ్య ధామాలుగా కీర్తించబడు తున్నాయి. శ్రీకృష్ణుడు జన్మించిన ప్రదేశం ఉత్తరప్రదేశ్ లోని మథుర. ఇక్కడి కేశవ్దేవ్ దేవాలయం హిందువులకు అత్యంత పవిత్రం. ఈ ఆలయాన్ని శ్రీకృష్ణుడి ముని మనుమడైన వజ్రనాభుడు ఐదువేల ఏళ్ళ కిందట నిర్మించాడని స్థలపురాణం. ద్వారక, గుజరాత్ గోమతీ నదీ తీరంలో ఉంది. సంస్కృతంలో ద్వారక అంటే 'స్వర్గానికి ద్వారం' అని అర్థం. కృష్ణుడు పరిపాలించిన ప్రాంతం ద్వారక. ఇక్కడ దాదాపు 2500 సంవత్సరాల కిందట నిర్మించిన ద్వారకాధీశుడి దేవాలయం ప్రధానమైనది. కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి క్షేత్రంలో కొలువైన చిన్ని కృష్ణుని ఆలయం హిందువులకు పరమ పవిత్రమైన ప్రాంతం. మఠాధిపతులు తప్ప ఇతరులెవరికీ మూలమూర్తిని తాకే అవకాశం లేదు. కేరళ రాష్ట్రం గురువాయూర్ లోని శ్రీకృష్ణ దేవాలయాన్ని 'భూలోక వైకుంఠం' గా పేర్కొంటారు. ఈ దేవాలయంలో స్వామి నాలుగు చేతులతో, పాంచజన్యం, సుదర్శన చక్రం, కౌమోదకి, తామర పువ్వును ధరించి దర్శనమివ్వడం విశేషం. ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా గంపల గూడెం మండలం నెమలి గ్రామం లోని వేణుగోపాల స్వామి ఆలయం ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒకటి. అలాగే పూరీ, ఒడిషా - జగన్నాథ మందిరం; నాథద్వార, గుజరాత్ - శ్రీనాథ్ జీ మందిరం; మన్నార్ గుడి - తమిళనాడు - రాజగోపాల మందిరం. ఇవేగాక హరేకృష్ణ మందిరాలు... మాయా పూర్, బెంగళూరు, ముంబై, తిరుపతి, నార్కెట్ పల్లి - నల్గొండ - తెలంగాణ - వారిజాల వేణుగోపాల స్వామి మొదలుగునవి ఉన్నాయి. 1వ శతాబ్దం పూర్వం నుండే తిరుమల ఆలయంలో శ్రీనివాసుని పక్కన శ్రీకృష్ణ రజతమూర్తి పూజలందు కుంటున్న క్రీ.శ 1485లో తాళ్ళపాక అన్నమయ్య ఉట్టి ఉత్సవాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వాడుకలో ఉంది. యాదవులు అధికంగా గల ప్రాంతాలలో కృష్ణా సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించే సాంప్రదాయాచరణ కొనసాగుతున్నది. కృష్ణుడిని యాదవులు కులదైవంగా భావిస్తారు. కృష్ణ జన్మ సంబంధ పర్వమైనందున బాల్యక్రీడలైన ఉట్ల మీది వెన్న, పెరుగు, పాలు దొంగిలించడం అనుకరించే, జ్ఞప్తికి తెచ్చే ఉత్సవాలు చేయడం సాంప్రదాయం. అందుకే వీధులలో ఉట్లు పెట్టి, ప్రజలచే కొట్టించే వేడుకలు నేటికీ కొనసాగు తున్నాయి.

# బహుముఖ ప్రజ్ఞాశాలి ఏల్చూరి

> ఏల్చూరి సుబ్రహ్మణ్యం ( ఆగష్టు 26, 1920 - ఫిబ్రవరి 25, 1995) ప్రసిద్ధ కవి, రచయిత, పాత్రి కేయులు. సహజ కవిగా, గొప్ప వక్తగా, ఉద్యమ ప్రవక్తగా, ప్రగతి శీల భావుకునిగా, తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులు. ఆయన తెలుగు సాహిత్యంలో ప్రాముఖ్యత వహించిన అభ్యుదయ కవిత్వోద్యమ ఆద్యుల్లో ఒకరు. అభ్యుద య కవితా యుగంలో ప్రగతి శీల భావ దురంధరులైన బెల్లం కొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయు లుతో కూడి, ఏల్చూరి సుబ్రహ్మ ణ్యం వెలువరించిన తొలి కావ్యం నయా గరా కవితల సంపుటి. అలా ముగ్గురు అభ్యు దయ నయాగరా కవులలో ఏల్చూరి ఒకరుగా నిలిచారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు.

**నేడు ఏల్చూరి సుబ్రహ్మణ్యం జయంతి**



ఏల్చూరి సుబ్రహ్మణ్యం ఆగష్టు 25, 1920న రామయ్య. సుబ్బాయమ్మ దంపతులకు జన్మించారు. మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ, భాగవతుల వెంకట సుబ్బారావు, అక్కిరాజు రామాపతి రావు, నాయని సుబ్బారావు తదితరుల వద్ద చిన్ననాడు విద్యా బుద్ధులు నేర్చారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఇంట్లోనే ఉండి, విజయవాడ యస్.ఆర్.ఆర్ కళాశాలలో బి.ఎ. డిగ్రీ చేశారు. కవి సామ్రాట్ శిష్యుడు అయిన నందమూరి తారక రామారావు తో చిన్ననాటి నుండి స్నేహం ఉంది. అలాగే కొంగర జగ్గయ్య, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ప్రాణ స్నేహితుల్లా మెదిలారు. కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామ దాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురు విద్యార్థి దశలో చదువుతున్న రోజులలో పరిచయస్తులై, తరువాతి కాలంలో "నయాగరా" కవితా సంకలనం సమ కూర్పుకు కారకులు అయినారు.

'త్రివేణి' ఆంగ్లపత్రిక సంపాదకులు కోలవెన్ను రామకోటేశ్వరరావు, దేశిరాజు కృష్ణశర్మ, బెల్లంకొండ రాఘవరావు, గుడిపాటి వెంకట చలం, గుఱ్ఱం జాషువాల స్ఫూర్తిని పొంది, పులుపుల శివయ్య, కొల్లా వెంకయ్యల వల్ల కమ్యూనిస్టు ఉద్య మంలో కాలూనారు. 1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అన్న పత్రికను స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, దండమూడి కేశవరావు, బెల్లంకొండ రామదాసు, దేవరకొండ బాలగంగాధర తిలక్ మొదలైన కవుల తొలి రచనలను ఆ పత్రికలో ప్రచురించారు. అదే సంవత్సరంలో 'చిత్ర' అనే పత్రికను ప్రారంభిం చారు. 1941 లో నవ్యకళా పరి షత్తును స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామదాసు, సముద్రాల రామానుజాచార్య, దేవరకొండ బాల గంగాధర తిలక్, రెంటాల గోపాలకృష్ణ మొదలైన అభ్యుదయ కవులు సభ్యులుగా కొనసాగారు. అలా ఆయా కవుల రచనలతో 1943 లో 'మాఘ్యమాల' కవితా సంపుటాన్ని వెలువరించారు. శ్రీశ్రీ కవిత్వ ప్రభావ స్ఫూర్తితో 1944 ఆగస్టులో బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురి కృషితో కవితా సంకలనం 'నయాగరా' వెలువడి అభ్యుదయ సాహిత్యోద్య మంలో అచ్చయిన తొలి కవితా సంపుటంగా నిలిచి పోయింది. అనిసెట్టి సుబ్బారావు, లక్ష్మీదేవిల పెళ్ళి కానుకగా గుంటూరులో విశ్వనాథ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కృతం అయింది.

నయాగర కవితా సంకలనంలో బెల్లంకొండ, ఏల్చూరి, కుందుర్తి ఒక్కొక్కరూ మూడేసి ఖండ కావ్యాలను రచించి 9 ఖండ కావ్యాల సంకలనంగా ప్రచురిం చారు. ఈ సంకలనంలో ...కుందుర్తి ఆంజనేయులు మూడు రచనలు... జయిస్తుంది, తరువాత, మన్యంలో; బెల్లంకొండ రామదాసువి... చెరసాల, నా గీతం, ఈ రోజున; అలాగే ఏల్చూరి సుబ్రహ్మణ్యం సంబంధిత....ప్రజాశక్తి, ఠాగూర్ చంద్ర సింగ్, విజయ ముద్ర ఖండ కావ్యాలు చేర్చ బడ్డాయి.

1956 లో తెలుగు సాహిత్యంలో ఏల్చూరి తొలి దీర్ఘ కవిత 'నవంబరు 7' విశాలాంధ్ర పత్రికలో వెలువడింది. తల్లావఝుల శివశంకర శాస్త్రి తో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఏల్చూరి నవ్య సాహిత్య పరిషత్తు సభ్యునిగా చేరి, సమావే శాలకు హాజరయ్యారు. ప్రగతిశీల ఉద్యమాలలో పాల్గొ న్నారు. వందలాది రష్యన్ కవితలను ఆంగ్ల మాధ్యమం ద్వారా అనువదించారు. నృసింహ స్వామి పై శతకం కూడా రాశారు. శ్రీరంగం శ్రీనివాసరావు, ఆరుద్ర, అబ్బూరి వరదరాజేశ్వర రావు సంయుక్తంగా రాసిన "మేమే" కావ్యాన్ని సుబ్రహ్మణ్యంకు అంకితం ఇవ్వడం విశేషం. ఆంగ్లంలో వచ్చిన వందలాది రష్యన్ కవితలను తెలుగులోకి అనువదించారు. సోవియట్ భూమి పత్రికలో సుమారు 40వేల పేజీల అనువాద రచన చేశారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతుంది. అభ్యు దయ కవిగా, అంతకు మించి కృషి పాత్రికేయుడిగా ఆయన చేసిన కృషి సాటిలేనిది.

1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అనే పత్రికను స్థాపించి, ప్రముఖ కవుల రచనలు ప్రచురిం చారు. పొగాకు లోకం' (గుంటూరు) పత్రిక సంపాదకులుగా, 1941 - 42లో ఆంధ్ర సర్వస్వము సహాయ సంపాదకునిగా, 1954-56లో ఆకాశ వాణిలో స్క్రిప్టు రైటరుగా... రాయప్రోలు రాజశేఖర్, జలసూత్రం రుక్మిణనాథశాస్త్రి లతో కలిసి ఆకాశవాణికి ఎన్నో స్క్రిప్ట్ లందించారు. మద్రాస్లో సినిమా లకు పాటలు కూడా రాశారు. 1952లో సోషలిస్టు పత్రికలో, 1956లోనేత' పత్రిక సంపాద కులుగా, 1961-1988లో సోవియ ట్ భూమి పత్రిక సంపాదక వర్గంలో, తర్వాత మద్రాసులో అభ్యుదయ పత్రిక నిర్వాహకసభ్యునిగా పని చేశారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# సాహితీ వట వృక్షం జువ్వాడి గౌతమరావు

ఆయన ఒక సాహితీ పట వృక్షం. స్వయంగా కవి మాత్రమే కాకుండా, ఎందరో సాహితీ వేత్తలకు ఆశ్రయ దాత. దివంగత ప్రధాని పి.వి. నరసింహా రావు, కాళోజీ నారాయణరావు, కోవెల సుప్రసన్న, సంపత్ కుమార ఆచార్య, సామల సదాశివ లాంటి సాహితీ దురంధరులతో సాన్నిహిత్యం కలిగి ఉన్నవారు. ప్రధానంగా కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో ఆయనకు గల అనుబంధం, విశ్వనాథను కరీంనగర్ రప్పించి, అక్కడి డిగ్రీ కళాశాల ప్రాచార్యునిగా విధులు నిర్వహించేలా చేసింది. తద్వారా ఉత్తర తెలంగాణకు చెందిన సాహితీ వేత్తల సంగమానికి వేదికను ఏర్పరచి, సాహిత్య సుసంపన్నానికి కార్య క్షేత్రాన్ని సిద్ధం చేసింది. ఇలా కరీంనగర్ లో సాహితీ సౌరభాలు గుబాళించ డానికి అహరహం శ్రమించిన సాహితీ ప్రియుడు జువ్వాడి గౌతమరావు. గౌతమ రావు సాహితీ వేత్తనే కాకుండా, స్వాతంత్ర్య పోరాటంలో యోధుడు. సోషలిస్టు భావాలను జీర్ణించుకున్న వ్యక్తి. ఔరంగాబాద్ జైలు గోడలను ఛేదించుకొని వచ్చిన ధైర్యశాలి. జువ్వాడి గౌతమరావు (ఫిబ్రవరి 1, 1929 - ఆగస్టు 24, 2012) కరీంనగర్ మండలం ఇరుకుళ్ళ గ్రామంలో 1929, ఫిబ్రవరి 1న జువ్వాడి గౌతమరావు జన్మించాడు. కరీంనగర్లో విద్యాభ్యాసం సాగించాడు. ఉస్మానియా విశ్వ విద్యాల యంలో బీఏ ఎల్ఎల్బీ పట్టా పుచ్చు కున్నాడు. పీవీ నరసింహా రావు, కోవెల సుప్రసన్నా చార్య, కోవెల సంపత్కుమారా చార్య వంటి సాహితీ మిత్రులతో ఆయనకు చాలా సాన్నిహిత్యం ఉన్నది. కరీంనగర్ సాహిత్య చైతన్య కేంద్రంగా భాసిల్లడంలో గౌతంరావు పాత్ర అసామాన్యం, అద్వితీయం. కరీంనగర్లో తెనుగు ఉనికిని కాపాడుతూ, అనేక కవితా గోష్టులలో పాల్గొంటూ నిరంతర సాహిత్య సేవ చేసిన భాషాభిమాని జువ్వాడి. ఆధునిక కాలంలో అడుగంటి పోతున్న సంప్రదాయ కవితా పరిరక్షణ కోసం పాటు పడ్డాడు. వరంగల్ లో కాళోజీ, ఆదిలాబాదులో సామల సదాశివ మాదిరిగా కరీంనగర్లో జువ్వాడి గౌతంరావు సాహితీ వటవృక్షంగా వేలాది మంది సాహితీ కారులకు ఆశ్రయ మిచ్చాడు. ప్రగతి గామిగా ఉంటూనే విశ్వనాథ రామాయణ కల్పవృక్షానికి, విశ్వనాథకు భక్తుడిగా మారాడు. ప్రేమతో విశ్వనాథుని తన హృదయంలో దాచు కొన్నాడు.



కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు జువ్వాడి అత్యంత ఆత్మీయుడు. విశ్వనాథ రచించిన రామాయణ కల్పవృక్షాన్ని శ్రావ్యమైన కంఠంతో తమదైన శైలిలో అంతరార్థాలను విశదీకరిస్తూ రసికులకు వినిపించ గలిగి, అయన మూర్తి తత్వాన్ని ఆవిష్కరించాడు. తానే రచించాడా అన్నంతగా ప్రజల్లోకి రామాయణ కల్పవృక్షాన్ని తీసుకెళ్లాడు. జువ్వాడి ప్రోద్బలం తోనే విశ్వనాథ సత్య నారాయణ కరీంనగర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గా పని చేశారు. విశ్వనాథ 'భక్తియోగ' అనే పద్యకావ్య సంపుటిని జువ్వాడి కోసం రాసి అంకితం ఇచ్చారు. "కల్పవృక్షంలో కైకేయి', 'వేయి పడగలలో విశ్వనాథ జీవితం' వంటి జువ్వాడి సాహిత్య వ్యాసాలు సాహిత్యలోకంలో సంచలనాలు సృష్టించాయి. నవ్య సాహిత్యోద్యమ కాలంలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ కొంతకాలం పాటు "జయంతి" అనే సాహిత్య పత్రిక నడిపాడు. తర్వాత దానికి జువ్వాడి సారథ్యం వహించాడు. వివిధ పత్రికల్లో జువ్వాడి రాసిన వ్యాసాల న్నింటినీ సంకలనం చేసి తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ వెలిచాల కొండలరావు 'సాహిత్య ధార' పేరుతో ఒక పుస్తకాన్ని ముద్రించాడు. జువ్వాడి సాహిత్య కృషికి గాని, సంపాదకత్వం వహించినప్పటి జయంతి పత్రికకు గాని రావాల్సిన కీర్తి ప్రతిష్ఠలు రాలేదు. అయినా జయంతి సంపాదకుడిగా ఆయన సంపాదకత్వం పత్రికా రంగానికే వన్నె తెచ్చింది. నాడు ఇంటర్ చివరి సంవత్సరం చదువు తున్న సి. నారాయణ రెడ్డి తొలి కవిత అచ్చయింది ఆ పత్రిక లోనే. జీవితమంతా సాహితీ అధ్యయనం తోను, విశ్వనాథ కల్పవృక్ష గానం తోను గడిపాడు. జనతా పార్టీ పక్షాన 1977లో పోటీ చేసి ఓటమి చెందాడు. ఇటీవలే విశ్వనాథ ప్రత్యేక సంచికను సాహిత్య పీఠం ఆయనకు అంకితం చేసింది.

# హడలెత్తిస్తున్న హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

తద్వారా కబ్జాదారుల నుంచి 43 ఎకరాల 94 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వివరించింది. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లతో పాటు పార్కు స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిలో పలువురు రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు ఉన్నట్టు హైడ్రా ప్రభుత్వానికి నివేదించింది. చింతల్ చెరువులో స్థానిక భారాస నాయకుడు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను కూల్చివేసి 3 ఎకరాల 5 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. అలాగే నందగిరి హిల్స్కు సంబంధించి ఎమ్మెల్యే దానం నాగేందర్ మద్దతుతో ఆక్రమించిన పార్క్ స్థలంలోని 18 గుంటల భూమిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది. బహదూర్ పురా ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, ఎంఐఎం ఎమ్మెల్సీ మిరాజ్ రెహమత్ బేగ్ రాజేంద్రనగర్ లోని బుమురౌఖ్ దౌలా చెరువులో అక్రమంగా నిర్మించిన రెండు ఐదంతస్తుల భవనాలు, ఒకటి రెండంతస్తుల భవనంతోపాటు మరో భవనాన్ని కూల్చివేశామని స్పష్టం చేసింది. ఇక్కడ మొత్తం 45 అక్రమ నిర్మాణాలు కూల్చివేసి 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడినట్లు తెలిపింది. గండిపేట ఎఫ్టీఎల్ పరిధిలోని ఖానాపూర్, చిలుకూరు వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ యజమాని జీవీ భాస్కర్ రావు, మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సునీల్ రెడ్డి, ప్రోకబడ్డి యజమాని అనుపమ ఆక్రమంగా నిర్మించిన 8 భవనాలు, 14 తాత్కాలిక షెడ్లు, 4 ప్రహరీలను కూల్చివేసినట్లు వివరించింది. ఖానాపూర్, చిలుకూరు వద్ద గండిపేట ఎఫ్టీఎల్లోని 14 ఎకరాల 80 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. మాదాపూర్లోని తుమ్మిడికుంట చెరువులో అక్రమంగా నిర్మించిన అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్కు సంబంధించిన రెండు నిర్మాణాలను కూల్చివేసినట్టు హైడ్రా తెలిపింది. ఇక్కడ 4 ఎకరాల 9 గుంటల భూమి స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హైడ్రా పేర్కొంది. ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీ ప్రాంతంలో పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేసి 16 గుంటలు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. మన్సూరాబాద్లో 2 గుంటలు, ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో 6 గుంటలు, బంజారాహిల్స్ మిథిలా నగర్ లో ఎకరా 4 గుంటలు, ఫిల్మ్ నగర్ లోని బీజేఆర్ నగర్లో నాలాపై అక్రమంగా నిర్మించిన స్లాబ్ ను



కూల్చి వేసి 5 ఎకరాలు, గాజులరామారం మహాదేవపురం వద్ద ఒక గుంట, గాజుల రామారావు భూదేవిహిల్స్‌లో ఎకరం ఒక గుంట, అమీర్పేటలో గుంట, చందానగర్ ఈర్ల చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న మూడంతస్తుల భవనం ఒకటి, నాలుగు అంతస్తుల భవనం రెండింటిని కూల్చివేసి 16 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వివరించింది. బాచుపల్లి ఎర్రకుంటలో 29 గుంటలు, బోడుప్పల్ రెవెన్యూ భూమిలో 3 గుంటలు స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

**ఎలాంటి అడ్డంకులైన అధిగమిస్తూ..**

సీఎం రేవంత్ రెడ్డి చెరువుల పరిరక్షణ విషయంలో ఫ్రీ హ్యాండ్ ఇవ్వటంతో తగ్గేదేలే!అంటూ కబ్జాలపై హైడ్రా విరుచుకుపడుతుంది హైడ్రా యాక్షన్ ప్రారంభించిన కొత్తలోనే శివరాంపల్లిలో ఎంఐఎం పార్టీ చెందిన ఓ ఎమ్మెల్యే అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. బంజారాహిల్స్ లో ఓ ప్రహరీ గోడ కూల్చివేత విషయంలో అధికారిక పార్టీకి చెందిన మరో మరో ఎమ్మెల్యే పై హైడ్రా కేసు నమోదు చేస్తూ ఎలాంటి పొలిటికల్, మనీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ముందుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. శుక్రవారం ఎన్కన్వెన్షన్ కూల్చివేతకు సంబంధించి కోర్టు ఆశ్రయించిన సినీ నటుడు నాగార్జునకు ఊరట లభించడం కూల్చివేతలపై కోర్టు స్టే విధించడం వంటి పరిణామం హైడ్రాను ఎటువైపు తీసుకెళ్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

**తదుపరి లక్ష్యం ఇదేనా?**

మాదాపూర్ లోని 29 ఎకరాలలో ఉన్న తమ్మిడి కుంట చెరువు లోని మూడున్నర ఎకరాలను కబ్జా చేస్తూ నిర్మించిన ఎన్ కన్వెన్షన్ ను శుక్రవారం నేలమట్టం చేసిన హైడ్రా త్వరలోనే ఓ మాజీ మంత్రి మరో ఎమ్మెల్సీ చెరువులు ఆక్రమించి నిర్మించిన ఓ యూనివర్సిటీ ని కూడా నిలబట్టంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తరువాత హైదరాబాద్ కోర్సిటీ పరిధిలోని హుస్సేన్ సాగర్, బతుకమ్మ కుంట తదితర చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించే అవకాశం ఉంది.

**గండిపేట లో 120 విల్లాలకు నోటీసులు**

హైదరాబాద్ లోని ప్రభుత్వ ఆస్తులైన చెరువులు కుంటలు భూములను కాపాడేందుకు ఏర్పాటైన హైడ్రా తాజాగా గండిపేటలోని బఫర్ జోన్ లో అక్రమంగా నిర్మితమైన 120 విల్లాలకు నోటీసులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో స్థానిక గ్రామపంచాయతీ నుంచి 175 చదరపు అడుగుల విస్తీర్ణంతో 12 విల్లాల నిర్మాణాలకు అనుమతి తీసుకుని ఏకంగా 107 విల్లాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినట్లు హైడ్రా గుర్తించి శనివారం నోటీసులు జారీ చేసింది. రెండు మూడు రోజుల్లోఈ విల్లాలపై కూడా హైడ్రా ఉక్కు పాదం మోపేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.



## క్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు అవకాశం ఇవ్వాలని కేంద్ర మంత్రిని కలిసి కోరిన విషయాన్ని ఆయన వివరించారు. దేశంలో ఏ క్రీడలు జరిగినా తెలంగాణలో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించాల్సిన సందర్భాల్లో గత ప్రభుత్వాల ఫోకస్ తప్పడం వల్లే ఈ దేశానికే క్రీడల్లో ఆదర్శంగా నిలబడాల్సిన హైదరాబాద్ నగరం ఆ ప్రాధాన్యత నుంచి పక్కకు జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. క్రీడలకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. 2028 ఒలంపిక్స్‌లో తెలంగాణ నుంచి అత్యధిక మెడల్స్ సాధించాలన్న లక్ష్యంతో కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీని వచ్చే ఏడాది నుంచే ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీకి దక్షిణ కొరియా స్పోర్ట్స్ వర్సిటీ సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు. హైదరాబాద్ లోని స్టేడియాలను ఒలింపిక్స్ స్థాయికి అప్ గ్రేడ్ చేస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని క్రీడాప్రాంగణాల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

## నిండు కుండలా నాగార్జునసాగర్..

(మొదటి పేజీ తరువాయి)

తలపిస్తున్నది. పూర్తిస్థాయి నీటి మట్టం ఉండటంతో అధికారులు రెండు గేట్లు ఎత్తి కిందికి వదులుతున్నారు. అయితే అలల తాకిడికి ప్రాజెక్టు క్రస్టు గేట్లపై నుంచి కృష్ణమ్మ కిందికి దూకుతున్నది. దీంతో అన్ని గేట్లను ఎత్తారా అనేట్లుగా నీరు కిందికి వస్తున్నది.కాగా, సాగర్ ప్రస్తుత, పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. ప్రాజెక్టులోకి 64,699 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అంతే మొత్తంలో దిగువకు వెళ్తున్నది. జలాశయంలో గరిష్ట నీటి నిల్వ అంటే 312.50 టీఎంసీలు ఉన్నాయి. రెండు గేట్ల ద్వారా 16,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇక విద్యుదుత్పత్తి, కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు.

## నేరాలను సమాజం నుంచి నిర్మూలించడం సమిష్టి బాధ్యత

### అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ

**గౌహతి:** రాష్ట్రంలో అత్యాచార ఘటనలను నిర్మూలించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ఏడాదికి 3వేల చొప్పున అత్యాచార కేసులు నమోదయ్యాయని ఆయన అన్నారు. ఇలాంటి దారుణ ఘటనలను తమ రాష్ట్రం నుంచి నిర్మూలించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి ఘటననూ ఖండించాలన్న ఆయన.. ఈ నేరాలను సమాజం నుంచి నిర్మూలించడం సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2020 నుంచి ఈ కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతోందని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు.రాష్ట్రంలో అత్యాచార ఘటనలకు సంబంధించిన సమాచారాన్ని అస్సాం సీఎం సామాజిక మాధ్యమాల్లో ప్రస్తావించారు. దాని ప్రకారం.. 2016-2021 మధ్య కాలంలో ఏటా సుమారు 3 వేల అత్యాచార కేసులు నమోదయ్యాయి. 2017లో 3544 కేసులు, 2018లో 3296, 2019లో అత్యధికంగా 3546 అత్యాచార కేసులు నమోదయ్యాయి. 2001- 2024 మధ్య కాలంలో మొత్తంగా 40వేల రేప్ కేసులు నమోదయ్యాయి. అస్సాంలో 2020లో 1657, 2021లో 1733, 2022లో 1113, ఈ ఏడాది జులై వరకు 580 కేసులు నమోదయ్యాయి. ప్రతీ అత్యాచార ఘటనను ఖండించాల్సిందేనని అస్సాం ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలను నిర్మూలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్న హిమంత బిశ్వశర్మ.. ఈ క్రూరమైన నేరాన్ని సమాజం నుంచి నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని... ఇందులో భాగంగా 2020 నుంచి ఈ కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతోందని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు.

### 'మలయాళ 'చిత్రపరిశ్రమ'లో వేధింపులు..

## ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు



**తిరువనంతపురం:** మలయాళ చిత్రసీమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే పలువురు ప్రముఖుల నుంచి ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయంటూ నటీమణులు ఆరోపించడం సంచలనం రేపుతోంది. దీంతో స్పందించిన కేరళ ప్రభుత్వం.. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఏడుగురు పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. మలయాళీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సిద్ధిఖీ నుంచి ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కొన్నానంటూ నటి రేవతి సంపత్ ఆరోపించారు. ఇదే సమయంలో ప్రముఖ దర్శకుడు, కేరళ స్టేట్ చలచిత్ర అకాడమీ అధ్యక్షుడు రంజిత్ బాలకృష్ణన్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని బెంగాలీ నటి శ్రీలేఖ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీ, రంజిత్లు వారి పదవులకు రాజీనామా చేశారు. ఈ పరిణామాలపై స్పందించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్.. పోలీసు అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. తాజాగా వస్తోన్న ఫిర్యాదులు, ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఐజీ స్పర్జన్ కుమార్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు.



## బలమైన ప్రజాస్వామ్యం కోసం యువత ప్రజా జీవితంలోకి రావాలి: మోదీ

**ఢిల్లీ:** వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశ పునాదులను పటిష్ఠం చేసే ఎన్నో విషయాలు 21వ శతాబ్దంలో జరుగుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అన్నారు. ఎలాంటి నేపథ్యం లేని లక్ష మంది యువత రాజకీయాల్లోకి రావాలని స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఇచ్చిన పిలుపునకు విస్తృత స్పందన వచ్చిందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత్, బలమైన ప్రజాస్వామ్యం కోసం యువత ప్రజా జీవితంలోకి రావాలని పునరుద్ఘాటించారు. ఆదివారం ప్రసారమైన 113వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్లో లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయ నేపథ్యం లేకపోయినా అన్ని వర్గాల ప్రజలు స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్నారని మోదీ గుర్తుచేశారు. దేశం కోసం వారు తమని తాము పూర్తిగా అంకితం చేసుకున్నారన్నారు. నేడు వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి మనం మరోసారి అదే స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద సంఖ్యలో యువత రాజకీయాల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వారికి సరైన అవకాశం, మార్గదర్శకత్వం కావాల్సి ఉందన్నారు. కుటుంబ రాజకీయాలు నూతన ప్రతిభను అణచివేస్తాయని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా అంతరిక్ష రంగంలో కృషి చేస్తున్న పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో మోదీ ముచ్చటించారు. అంతరిక్ష రంగంలో భారత్ దూసుకెళ్తోందని గుర్తుచేశారు. చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా స్పేస్ డే నిర్వహించుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాదే తొలి అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకొన్నామని పేర్కొన్నారు. ఈ రంగంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలతో యువత పెద్ద ఎత్తున లబ్ధి పొందినట్లు చెప్పారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ నిలిచిందని గుర్తుచేశారు. అంతరిక్ష రంగం యువతను ఆకర్షిస్తోందని తెలిపారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం పెద్ద ఎత్తున చేపట్టామని మోదీ తెలిపారు. ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాల వద్ద జాతీయ జెండాలు ఆవిష్కరించారని పేర్కొన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సామాజిక వేడుకగా మారిందని తెలిపారు. తన పిలుపు మేరకు దాదాపు ఐదు కోట్లకు పైగా మంది జాతీయ జెండాతో ఫొటోలు దిగి వెబ్సైట్లో అప్లోడ్ చేసినట్లు వెల్లడించారు.

## రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు రెండేళ్లలో సొంత భవనాలు

### మంత్రి పొంగులేటి



**విశ్వంభర, హైదరాబాద్:** ఇందిరమ్మ రాజ్యంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్యోగులు నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ఎంసీహెచ్ఆర్డీలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులతో మంత్రి పొంగులేటి సమావేశమయ్యారు. కార్యాలయాల అద్దెలు, విద్యుత్ ఛార్జీలు, అద్దె వాహనాల ఛార్జీలు మొదలైన వాటికి అవసరమైన బిల్లులు త్వరలోనే క్లియర్ చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖకు శాశ్వత ప్రభుత్వ భవనాల ఆవశ్యకతను మంత్రి ప్రస్తావిస్తూ.. త్రిముఖ వ్యూహాన్ని రూపొందిస్తున్నామన్నారు. అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రెండేళ్లలో ప్రభుత్వ భవనాల్లో పనిచేయడం ప్రారంభిస్తాయన్నారు. ఇతర రాష్ట్రాల్లోని రిజిస్ట్రేషన్ శాఖల్లో ఉన్న బెస్ట్ ప్రాక్టీసులను మన రాష్ట్రంలో కూడా పాటించేలా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేందుకు వీలుగా కొత్త టెక్నాలజీలను అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో రూ.2,746 కోట్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గతేడాది రూ.14,588 కోట్లకు చేరుకుందని ప్రభుత్వ కార్యదర్శి, స్టాంపులు రిజిస్ట్రేషన్ల కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి వివరించారు. రిజిస్ట్రేషన్ శాఖ పనితీరుపై ఆయన సంక్షిప్త వివరణ ఇచ్చారు.

## నా కార్యాచరణను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు

### సీఎం రేవంత్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ మార్గంలోనే బ్రహ్మకుమారీస్ నడుస్తున్నారని, డ్రగ్స్ నిర్మూలనకు వారు కృషి చేయడం సంతోషకరమని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలో నిర్వహించిన బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ద్విదశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శాంతి సరోవర్ హైదరాబాద్లో ఉండటం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో చార్మినార్, గోల్కొండ, శంషాబాద్ ఎయిర్ పోర్ట్ ఉన్నట్లు బ్రహ్మకుమారీస్ ఉన్నారని చెప్పుకోవాలన్నారు. రైతులను రుణ విముక్తుల్ని చేసేందుకు, డ్రగ్నుంచి విముక్తి కలిగించి యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని కృషి చేస్తున్నామని చెప్పారు. తన కార్యాచరణను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. "ఒకే విడతలో రైతులకు రూ. 31వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తున్నాం. దేశంలో ఒకేసారి ఇంత మొత్తంలో రైతులకు రుణమాఫీ చేసిన రాష్ట్రం మరొకటి లేదు. డ్రగ్స్, మత్తుకు అలవాటు పడి యువత తమ జీవితం నాశనం చేసుకుంటున్నారు. అందుకే, డ్రగ్స్ నుంచి యువతను రక్షించేందుకు ఎంతో కృషి చేస్తున్నాం. తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేసిన డ్రగ్స్ మూలాలు ఏరివేస్తున్నాం. త్వరలో ప్రారంభించబోయే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతలో నైపుణ్యాలను పెంచుతాం" అని సీఎం రేవంత్ అన్నారు.

# చిత్రకళలో రాణిస్తున్న చిన్నారి



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓ చిన్నారి చిత్రకళలో అద్భుత ప్రతిభను కనబరుస్తోంది. ఎల్కేజీ నుంచే చిత్రలేఖనం పై ఆసక్తి పెంచుకుంటూ ఆలోచనలకు సృజనాత్మకత జోడించి చక్కటి చిత్రాలు గీస్తోంది. భూపాలపల్లి పట్టణంలోని ఎల్బీనగర్‌కు చెందిన కౌటం సుమాంజలి, కృష్ణ దంపతుల పెద్ద కూతురు ఆద్య చిత్రకళలో అద్భుతంగా రాణిస్తుంది. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న ఆద్య చిత్రలేఖనంపై అమితమైన ఆసక్తి కనబరుస్తోంది. ఓనమాలు నేర్వకముందు నుంచే కాగితాలపై బొమ్మలు గీయడం అలవర్చుకుంది. తల్లి దండ్రులు అందిస్తున్న ప్రోత్సాహంతో తన మదిలో కలిగే ఆలోచనలకు మరింత పదును పెడుతూ చక్కటి సృజనాత్మకతను వెలిసితీస్తూ చక్కటి చిత్రాలు గీస్తుంది. సోమవారం శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం సెలవు దినంతో రాధాకృష్ణుల చిత్రాలనువేసి రంగులు దిద్ది అందర్నీ అబ్బుర పరుస్తూ ఔరా.. అనేలా రాధా కృష్ణుల చిత్రపటం వేసింది.

# సెప్టెంబర్ 1 నుండి పశుగణన



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 21వ జాతీయ పశుగణన ఈ సంవత్సరం సెప్టెంబర్ 01 నుండి డిసెంబర్ 31వరకు అన్నిగ్రామాలు, మండలాల్లో పశుగణన చేపట్టడం జరుగు తుందని జిల్లా పశుసంవర్ధక శాఖఅధికారి గోపాలకృష్ణ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నుమరేటర్లు ఇంటింటికి వెళ్లి పశువులు, గొర్రెలు, మేకలు, పెంపుడు కుక్కలు, ఇతర పశువుల వివరాలు సేకరిస్తారని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం తేది 27 ఆగస్టు 2024 మంగళవారం ఉదయం 10.00లకు కలెక్టరేట్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో సూపర్‌వైజర్లకు, ఎన్యూమరేటర్లకు శిక్షణాకార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఇట్టి శిక్షణా కార్యక్రమానికి సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

# చేపల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించిన చైర్మన్



**విశ్వంభర, మెదక్:** మెదక్ పట్టణంలోని చేపల ఉత్పత్తి కేంద్రాన్ని తెలంగాణ ఫిషరీస్ కో-ఆపరేటివ్ సోసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆదివారం సందర్శించారు.ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి కేంద్రంలో 46 ఫాండ్స్ వాడుకంలో ఉన్నాయని తెలిపారు. మిగితా 60 ఫాండ్స్‌ని కూడా త్వరలోనే వాడుకలోకి తీసుకొచ్చి పునరుద్దరణ పరుస్తామని ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ హామీ ఇచ్చారు. జిల్లా మత్స్యశాఖఅధికారి మల్లేశం, జిల్లామత్స్యకార సహకార సంఘాల ఉపఅధ్యక్షులు దుర్గేష్, ప్రధాన కార్యదర్శి దేవేందర్, సభ్యులు పాల్గొన్నారు.

# సేవా సంఘాల సభ్యుల ప్రమాణస్వీకారం



**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణ పరిధిలో అయ్యప్ప ఫంక్షన్ హాల్ లో అయ్యప్ప సేవా సంఘం, అయ్యప్ప అన్నప్రసాద సేవా సంఘాలకు ఆదివారం మూడు సంవత్సరాల కాలపరిమితికి సభ్యుల ప్రమాణస్వీకారం జరిగింది. ముఖ్యఅతిథిగా నిజామాబాద్‌కు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ యాదగిరి, వ్యవహరించారు. అతిథులుగా వాసవి క్లబ్ మాజీ ఇంటర్నేషనల్ గవర్నర్ యాద నాగేశ్వరరావు, కైలాస శ్రీనివాసరావు, గౌరీ శంకర్ విచ్చేసి అయ్యప్ప అన్న ప్రసాద కమిటీ, అయ్యప్ప సేవా సమితి కమిటీ రెండు కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్నం రమేష్, కార్యదర్శిగా గోని శ్రీనివాస్, కోశాధికారిగా నారాయణ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఓంకారం, అడ్మిషన్ సెక్రటరీగా లక్ష్మీకాంతం, అన్నప్రసాద్, సేవాసంకిఅధ్యక్షునిగా రాజేందర్, కార్యదర్శిగా రఘుకుమార్, కోశాధికారిగా మోత్కూరు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జాయింట్‌సెక్రెటరీ ప్రమాణస్వీకారం చేశారు.

# రక్తదాన కార్యక్రమానికి ఆహ్వానం




**విశ్వంభర, హైద్రాబాద్:** ప్రముఖ సామాజిక కార్యకర్త మదర్ థెరిసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకరయ్య ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మెగా రక్తదాన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో- కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాను ఆయన నివాసంలో చేపూరి శంకరయ్య కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాలు చేసే ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని, ఇలాంటి గొప్ప సేవా కార్యక్రమాలు చేస్తున్న మదర్ థెరిసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకరయ్యను ఉప్పల శ్రీనివాస్ గుప్తా అభినందించారు.

# జిట్టా బాలకృష్ణ రెడ్డిని పరామర్శించిన హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్:** అనారోగ్యం కారణంగా గత కొన్ని రోజుల నుంచి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జిట్టా బాలకృష్ణ రెడ్డిని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం యశోద ఆస్పత్రి వైద్యులతో హరీశ్‌రావు మాట్లాడారు. వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిట్టా బాలకృష్ణారెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అదేవిధంగా వారి కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. హరీశ్‌రావు తో పాటు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు

## 250 గజాల స్థలం కేటాయించాలి: డాక్టర్ పిడమర్తి రవి



**విశ్వంభర,హైదరాబాద్:** తెలంగాణరాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరికి 250గజాల ఇంటిస్థలం ప్రభుత్వం కేటాయించాలని ఎస్సీకార్పొరేషన్ మాజీ చైర్మన్ తెలంగాణ విద్యార్థి జేఏసీ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ న్యూసెమినార్ హాల్లో నిర్వహించిన మలిదశ తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. పిడమర్తిరవి ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో సముచితస్థానం లభించాలని, ప్రాణాన్ని సైతం లెక్కచే యకుండా రాష్ట్రం కోసం కొట్లాడిన ఉద్యమకారులకుప్రభుత్వంలోత్వరలో నిర్వహించబోయే నామినేటెడ్ వివిధ పార్టీ పదవులు కల్పించాలని ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇంటి స్థలాన్ని ఉద్యమకారులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. బట్టుశ్రీహరి, లోకేష్ యాదవ్, చరణ్, కౌశిక్ యాదవ్, శ్రీధర్ గౌడ్, దరువు ఎల్లయ్య, వరంగల్ రవి, కోటశ్రీనివాస్‌గౌడ్, దుర్గంభాస్కర్, బోరెల్లిసురేష్, రెడ్డి శ్రీనివాస్, జాన్,నోములవంశీయాదవ్,బుర్రసురేష్,కృష్ణ, పాల్గొన్నారు.

# బోనాల సంబరాలు



**విశ్వంభర,రామన్నపేట:** రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం, కొత్తగూడెం గ్రామాలలో మల్లన్న, పెద్దమ్మ దేవతలకు బోనాలను గ్రామ ప్రజలు ఊరేగింపుగా తీసుకెళ్ళి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు ఉప్పు ప్రకాష్, చిల్లర కైలాసం, గ్రామ ప్రముఖులు బత్తుల కృష్ణ, బత్తుల శంకరయ్య, నీల నర్సింహ, నీల ఐలయ్య, చిల్ల వెంకటయ్య, జవ్వాజి వెంకటేశం, జవ్వాజి కిషోర్, ఇతర ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కే పురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్డు నెంబర్ 1లో కాలనీ అసోసియేషన్ భవనానికి నిధులు కేటాయించాలి అని మహేశ్వరం నియోజకవర్గము బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. అరవింద్ శర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంత్రి హొదాలో సబితా ఇంద్రారెడ్డి భవనానికి దాదాపు రూ. 35 లక్షలు కేటాయించడం జరిగిందని, నిధులు సరిపోక పనులు ఆగిపోయాయని ఆవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి భవన నిర్మాణం కోసం అధిక నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులను వెంటనే కేటాయించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికే సరస్వతి దేవాలయం రోడ్డు నీట మునిగి దేవాలయంలోకి, ఇండ్లలోకి నీరు చేరుతుండడంతో ఆ సమస్యను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా రూ.44 లక్షలు శాంక్షన్ చేయించారు. అంతలోనే ఎన్నికల నియామావళి రావడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగి పోయాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను కాలనీ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, నాయకులు జగన్మోహన్ రెడ్డి, శ్యాంగుప్త, కపిల్‌తో కలిసి పరిశీలించారు. రోడ్డు ను త్వరగతి పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందిని పరిష్కారించినందుకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో ఏ సమస్య అయినా ఎమ్మెల్యేదృష్టికి తీసుకవెళ్లిపరిష్కారం అయ్యేందుకుకృషి చేస్తానని అరవింద్‌శర్మ తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**విశ్వంభర, నారాయణపూర్:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిటి వరం అని నారాయణపూర్ మండల నాయకులు అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫార్సుతో సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన చిలువేరు గాలయ్య కు 50 వేల రూపాయలు, జక్కిడి శ్రీధర్ రెడ్డికి 60 వేల రూపాయలు, కోనేటి. వెంకటమ్మ 60 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబాలకు సంస్థాన్ నారాయణపూర్ మండల కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి, మండల పార్టీ అధ్యక్షులు ఏపూరి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, జక్కడి బాల్ రెడ్డి, బాలు నాయక్, అందే యాదయ్య, జక్కల యాదయ్య, ఉప్పల కృష్ణ, రాచకొండ రమేష్ బాబు, చిలుకూరి శీను, గుదే మల్లేష్, అంతటి ఇస్తారి, బుషి, బల్గురి శివ, నవీన్, మారగోని శంకర్, హేమెంధర్, బాకారం శీను, పాల్గొన్నారు.

# విపక్షాల దుష్ప్రచారం

## ఆరు గ్యారెంటీలను పక్కగా అమలు చేస్తాం: దేప భాస్కర్ రెడ్డి

**విశ్వంభర,ఎల్బీనగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆర్కేపురం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంట్, రూ.500 సిలెండర్లు ఆడపడుచులకు, రైతులకు రుణ మాఫీ ఇవ్వటం ఇష్టం లేక దిగజారుడు రాజకీయాలకు బీజేపీ, బీఆర్ఎస్ పాల్పడుతున్నాయని దేప ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోల్పోయిన బాధలో మాజీమంత్రి కేటీఆర్ ఆడపడుచులపై నోరు పారేసుకుని మహిళ కమిషన్ ముందు క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పిట్ట హరినాథ్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, రమేష్, మహేందర్, లింగస్వామి గౌడ్, యాదవ రెడ్డి, దుబ్బాక శేఖర్, జ్ఞానేశ్వర్ యాదవ్, అక్బర్, శ్రీశైలం, ఇస్మాయిల్, నబీ, ఢిల్లీ, కృష్ణ, నగేష్, పటేల్, పాషా పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు




**విశ్వంభర, కామారెడ్డి:** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కామారెడ్డి బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ చేయడం జరిగింది. డాక్టర్ వీ. మురళీధర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలం చిన రాజులు రావడం జరిగింది. సభాధ్యక్షులుగా పట్టణ బీజేపీ అధ్యక్షులు ఆకుల భరత్ మాట్లాడుతూ భవిష్యత్తులో సభ్యత నమోదు కార్యక్రమం ప్రతి బూత్‌లో చేయాలని, ప్రతి బూతులో కార్యకర్తల సభ్యత్వం పెంచాలని తెలియచేస్తూ పట్టణ బీజేపీ కార్యకర్తలకు దిశనిర్దేశం చేశారు. పార్లమెంట్ కోకన్వీనర్ కాసర్ల శ్రీనివాస్, పట్టణప్రధాన కార్యదర్శిలు ప్రతాప్ నేత, ముదాం శ్రీకాంత్ కౌన్సిలర్, పట్టణ వివిధ మోర్చాల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లను

## విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



**విశ్వంభర, బషీర్ బాగ్:** సావిత్రిబాయి పూలే ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కంప్యూటర్ సంబంధిత మూడు రకాల కోర్సుల్లో డాటా బేస్ అడ్మినీస్ట్రేటర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, డిజిటల్ మార్కెటింగ్‌లలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆయాసంబంధిత కోర్సుల్లో సర్టిఫికెట్లు, ఉద్యోగాల కల్పనకు సంబందించిన ఆఫర్ లెటర్స్‌ను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగారం ప్రీతం, ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ బీ.ఆనంద్ కుమార్‌లు అందజేశారు. ఈ సందర్భంగా నాగారం ప్రీతం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌ను విద్యార్థులు వినియోగించుకొని ఆర్థిక సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఈ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం మరింత మందికి నిరుద్యోగ యువతీ యువకులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమన్ని విజయవంతంగా పూర్తి చేసిన సావిత్రిబాయి పూలే ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ టేకి చైర్మన్ బెల్లం మాధవిని అభినందించారు. మరిన్ని స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులను ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని ఆమెను కోరారు. ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ యు.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్స్ డీ. ఆదినారాయణ, రవి, మమతా రెడ్డి, సెంటర్ మేనేజర్స్ నరేష్, ఎం వీ జై సాయి, ఎం.వి జయరాం, బోర్డ్ ఆఫ్ అడ్వైజర్‌కమిటీ పీ.కమల్, ఆనంద్, అనన్య ఫౌండేషన్ చైర్మన్ నవనీత, జీవనిధి, సావిత్రిబాయి పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యాపక బృందం బీ.భవాని, ఎం.మాధురి, ఎన్ ప్రత్యూష పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**విశ్వంభర,మేడిపల్లి:** శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కమిటీ కార్యవర్గ ఎన్నిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కొత్త కిషోర్ గౌడ్ సమక్షంలో అధ్యక్షులుగా ఆసర్ల బీరప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎస్. మల్లయ్య ఉపాధ్యక్షులుగా ఈ.నర్సింహ్, జీ.బీరయ్య, కోశాధికారి ఎన్.మల్లేష్, సంయుక్త కార్యదర్శులుగా బీ.నరేష్, ఎమ్. సురేష్‌లను కాలనీ సభ్యులు ఏకగ్రీవంగా ఏన్నికున్నారు. అధ్యక్షులు ఆసర్ల బీరప్ప మాట్లాడుతూ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కాలనీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు కాలనీ వాసులను, అధికారులను సమన్వయం పరుచుకుంటూ కాలనీ అభివృద్ధికై కృషి చేస్తామనీ హామీ ఇచ్చారు. అనంతరం కొత్త కిషోర్ గౌడ్ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు. లక్ష్మీ నగర్ కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న తాము ముందుండి పరిష్కరిస్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నగర్ కాలనీవాసులు, సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

# బోనాల సంబురాలు



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండల కేంద్రంలో ఎల్లమ్మ, మారెమ్మ, కనక దుర్గమ్మ బోనాల ఉత్సవాలను స్థానిక మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్విరాజ్ ఘనంగా నిర్వహించారు. బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఎల్లమ్మ, మారెమ్మ కనకదుర్గమ్మలకు నైవేద్యంగా బోనాలను సమర్పించారు. రామన్నపేట పట్టణ ప్రజలను ఆర్థికంగా, సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉంచాలని ఎల్లమ్మ, మారెమ్మ, కనకదుర్గమ్మ తల్లి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు ఆకవరపు మధుబాబు, నకిరేకంటి మొగులయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జినుకల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ వూటుకూరి శోభ నర్సింహా, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్,బెక్కం నిఖిల్ స్వామి, పట్టణ ప్రముఖులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు:** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు మండలంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పొనుగోటి అర్జునరావు ఆధ్వర్యంలో కర్తాల్ మండల కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం జైపాల్ యాదవ్ కేక్ కట్ చేసి పట్టణంలోని సేవాలాల్ కమ్యూనిటీ భవనం దగ్గర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు దశరథ్ నాయక్ అనురాధ పద్య నాయక్ ఖలీల్ మాజీ సర్పంచ్ శీను నాయక్ కౌన్సిలర్ రాధమ్మ వెంకటయ్య, జంతుక శంకర్, గుత్తి బాలస్వామి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన కార్యదర్శిగా సంఘమేశ్వర్



**విశ్వంభర, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా బీసీ యువజన సంఘం నూతనంగా నియామకం చేపట్టారు. వికారాబాద్ జిల్లా బీసీ యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా వడ్ల సంఘమేశ్వర్ ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నియమించారు. ఈ సందర్భంగా సంఘమేస్వర్ మాట్లాడుతూ బీసీ కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. అదే విధంగా జిల్లాలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, మల్లేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన




**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ఎస్సై చక్రపాణి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాళేశ్వరం గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా ప్రజలకు నూతన చట్టాల గురించి, సైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. ఒకవేళ సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేసి రిపోర్ట్ చేయాలని అన్నారు. ప్రజలు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రతి వాహనాదారులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని ప్రజలకు సూచించారు. మహారాష్ట్ర చత్తీస్ ఘడ్ తదితర ప్రాంతాల నుంచి వస్తున్న వారిని ఎస్ఐ ఫింగర్ ప్రింట్ చెకింగ్ ద్వారా అనుమానితులను చెక్ చేసి వదిలివేయడం జరిగింది.

## 10 లీటర్ల గుడుంబా పట్టివేత

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ గ్రామం ఎస్సీ కాలనీలో సొన్నరి రమాదేవి ఇంటి వద్ద 10 లీటర్ల గుడుంబాను మహాదేవపూర్ పోలీసులు పట్టుకున్నారు. మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ మాట్లాడుతూ మహాదేవపూర్ గ్రామంలో నిషేధిత గుడుంబాను అక్రమంగా విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారం రాగా వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో యుక్తంగా మహదేవపూర్ ఎస్సీ కాలనీకి చెందిన సొన్నరి రమాదేవి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 10 లీటర్ల నిషేధిత గుడుంబా కనబడింది. వెంటనే ఇద్దరు పంచుల సమక్షంలో అట్టి గుడుంబాను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి, ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇలా అక్రమంగా మద్యం, గుడుంబా విక్రయించే వారిపై పోలీసుల నిఘా ఉంటుందని, అట్టి వారిపై కఠినమైన చర్యలు, కేసులు తప్పవని మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ హెచ్చరించారు. అలాగే నిషేధ గుడుంబా విక్రయిస్తున్న వారి సమాచారం అందించాలని ప్రజలను ఎస్ఐ కోరారు.

# దళితుల అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

### ఎన్నికల్లో ఇచ్చిన హామీని పట్టించుకోని సీఎం రేవంత్ రెడ్డి

### అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య

**విశ్వంభర, మేడిపల్లి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి 288 ఆదివారాలుగా జ్ఞానమాల సమర్పించే కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ దళిత, గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేస్తామని డిక్లరేషన్ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు పూరైన ప్రభుత్వం నుండి దళితుల అసైన్డ్ భూముల రెగ్యులరైజేషన్ గురించి ఎలాంటి ఉలుకు పలుకు లేదని తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని దళితులకు నాటి ప్రభుత్వాలు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేసి పట్టాలు అందించాలని నత్తి మైసయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, చిల్ల అంజయ్య, ఏ రాజేష్, యేసు రాజ్ పాల్గొన్నారు.



## కంఠమహేశ్వర పోచమ్మ తల్లి బోనాలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో నెలకొన్న పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున మహిళలు ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి బోనాలు సమర్పించారు. టీపీసీసీ సభ్యులు నివాస్ గౌడ్, పాపిశెట్టి రామ్, ఆలయ కమిటీ చైర్మన్ చుక్క అల్లాజిగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగ రవీందర్, ఉపాధ్యక్షుడు పల్లె నారాయణ గౌడ్, బాలకృష్ణ గౌడ్, దూసకంటి యాదయ్య గౌడ్, గజ్జి వెంకటయ్య గౌడ్, చిన్న బాలకృష్ణ, నిరంజన్ గౌడ్, పెద్ద బాలకృష్ణ, సతీష్, గజ్జె రాజు, గుండ్రాతి కుమార్ గౌడ్, శివ గౌడ్, రాఘవేందర్ గౌడ్, కుమార్ గౌడ్, గజ్జె యాదయ్య పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం



**విశ్వంభర, పరిగి:** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలో నూతనంగా ఎన్నికైన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కడుమూరు శ్రీనివాస్ గుప్తా, గౌరవ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, లను అలాగే కమిటీ సభ్యులను ఆదివారం రైస్ మిల్ యజమానులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కడుమూరు శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, ప్రమోద్ రావు,చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి అంజనేయులు గుప్తా, సహాయ కార్యదర్శిలు రమేష్, తులసీరామ్, కోశాధికారి అభిలాష్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యం

### ప్రచార కమిటీ కో కన్వీనర్ శ్రీనివాస్ గుప్త




**విశ్వంభర, ఎల్బీనగర్:** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యం అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. సికింద్రాబాద్ లోని ఆర్ ఆర్ సీ గ్రౌండ్ లో డా. మాక్స్ వెల్ ట్రెవర్ సైక్లింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కిడ్స్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ చాంపియన్ షిప్ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా శ్రీనివాస్ గుప్త హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. పిల్లలకు క్రీడలు అవసరం అని చదువుతో పాటు క్రీడల్లో రాణించి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన పేర్కొన్నారు.టీసీఏ ప్రధాన కార్యదర్శి విజయ్ కాంత్, బిను చందన్, జయ కుమార్, కృష్ణమూర్తి, అధ్యక్షుడు డా.మాక్స్ వెల్, ప్రధాన కార్యదర్శి పాషా, సీ ఎఫ్ఐ కమీషనర్‌జి శ్రీకాంత్, సుధాకర్, పాల్ రోస్ పాల్గొన్నారు.

## విగ్రహాల పున:ప్రతిష్ట మహోత్సవం



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ గాజులరామారంలో శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ రేణుకు ఎల్లమ్మ విగ్రహాల పున:ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ:సంతోషాలతో ఉండాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు మహిళా భక్తులు పాల్గొన్నారు.

# ఫోన్ పోగొట్టుకుంటే

### సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయండి




**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో ఓ వ్యక్తి తన మొబైల్ పోగొట్టుకున్నాడు. సీ ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ వివరాలను నమోదు చేసుకొని, స్థానిక పోచారం పీఎస్ లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులు తీసుకున్న పోలీసులు దీని పై తగిన వివరాలు సేకరించి ఎట్టకేలకు మొబైల్ దొరకపట్టుకొని సదరు వ్యక్తికి అందించినట్లుగా పోలీసులు తెలిపారు. ఫోన్ పోగొట్టుకుంటే సీ ఈ ఐ ఆర్ పోర్టల్లో వివరాలు నమోదు చేసుకోవాలని పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపారు.

## చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



**విశ్వంభర, అచ్చంపేట:** అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెనుకబడిన తరగతుల్లో సామాజిక చైతన్యం రగిలించిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ పోరాట పటిమను యావత్ తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. ఐలమ్మ పోరాటం ఫలితంగానే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ పాలనను దహించివేసిందన్నారు. నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో తెలంగాణ చరిత్ర తిరగరాసిందని, 10లక్షల ఎకరాల భూ పంపిణీకి ఆమె పోరాటమే నాంది పలికిందన్నారు. ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోపత య్య, మండల నాయకులు రజక సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుడు ఆత్మహత్య

**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల:** కాంగ్రెస్ పాలనలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే వర్క్ ఆర్డర్లు నిలిపివేయడం, చేనేత కార్మికులకు ఎలాంటి ప్రోత్సాహం అందించ కపోవడంతో వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. మరమగ్గాలు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవారు చేతిలో పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బం దుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను అటక్కెక్కించడంతో చేనేత రంగం చితికిపోయింది.దీంతో నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా సిరిసిల్లలో మరో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్‌కు చెందిన బోయిని సదానందం (36) అనే నేత కార్మికుడు ఆర్థిక ఇబ్బందులతో నిన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కరీం నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ సదానందం చెందాడు. సదానందం మృతితో కేసీఆర్ నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# రేవంత్ రెడ్డి హైడ్రా పేరుతో

## హైడ్రామా చేస్తున్నారు : ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** ఇచ్చిన హామీలు పక్కన పెట్టి హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైడ్రా కేసు నమోదు చేసినప్పుడు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ముందు మీ పార్టీ నేతల నుంచే కూల్చివేతలు మొదలవుతే మంచిదని, ఆ దమ్ము మీకుందా అని సూటిగా ప్రశ్నించాడు.మీ తమ్ముడు, మంత్రి పొంగులేటిపై కూడా అక్రమ నిర్మాణాలు ఆరోపణాల ఆరోపణలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన పర్మిషన్‌తో కట్టుకుని నష్టపోయిన వారికి ఎలాంటి హామీ ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకరిద్దరు సెలబ్రిటీల నిర్మాణాలు కూల్చి వేసి అలజడి సృష్టించడం కేవలం డైవర్ట్ పాలిటిక్స్ కోసమేనని విమర్శించారు. రాష్టంలో కబ్జా అయిన అసైన్డ్, దేవాదాయ, చెరువు శిఖం భూములపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ డ్రైవర్ సాంబయ్య సస్పెన్షన్..

## మున్సిపల్, రైల్వే తప్పిదాలకు డ్రైవర్‌ను బలి చేశారని విమర్శలు



**విశ్వంభర, నిజామాబాద్:** ఈ నెల 19 న నిజామాబాద్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీళ్లలోకి బస్సును తీసుకెళ్లిన డ్రైవర్ పై వేటు పడింది. ఆర్టీసీ డ్రైవర్‌నుఉన్నతాధికారుల సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం( 19 న) మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. గంటన్నర పాటు పడిన భారీ వర్షానికి ఇందూరు జలమయ మైంది. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరద నీరు నిలిచింది. ఇది గమనించని ఆర్టీసీ డ్రైవర్ ముందుకెళ్లడంతో బస్సు నీళ్లలో చిక్కుకుపోయింది. సగం మేర బస్సు నీటిలో మునిగిపోవ డంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ గడిపారు.ఈత వచ్చినవాళ్లు దూకి బయటకు రాగా, మహిళలు, చిన్నపిల్లలు బస్సులోనే చిక్కుకుపోయారు. స్థానికులు హుటాహుటిన స్పందించి బస్సులోని మహిళలు, చిన్నారులను సురక్షితంగా బయటకు చేర్చారు. కమిషనరే ట్‌కు కూత వేటు దూరంలోనే ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోయినా గంటకు పైగా ఎవరూ స్పందించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపో యింది. ఈ నేపథ్యంలో డ్రైవర్ సాంబయ్యను ఆర్టీసీ అధికారులు సస్పెండ్ చేశారు. అయితే మున్సిపల్, రైల్వే తప్పిదాలకు డ్రైవర్‌ను అన్యాయంగా బలి చేశారని విమర్శలు వస్తున్నాయి.

# జీహెచ్‌ఎంసీని కూల్చేస్తారా..?

## హైడ్రా కూల్చివేతలపై సర్కారుపై మండిపడ్డ అసదుద్దీన్ ఒవైసీ



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలంటూ హైడ్రా కూల్చివేస్తున్నది. సినీ నటుడు నాగార్జునకు చెందిన మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌తో పాటు ప్రొ కబడ్డీ లీగ్ ఓనర్ అనుపమ, కావేరి సీడ్స్ యజమాని భాస్కర్‌రావులతో పాటు పలువురి భవనాలను సైతం కూల్చివేసింది. ఇందులో పలువురు ఎంఐఎం నేతల భవనాలు సైతం ఉన్నాయి. ఈ అంశంపై ఎంఐఎం అధినేత, ఎంపీ అక్బరుద్దీన్ ఒవైసీ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్ నగరంలోని హుస్సేన్ సాగర్ వద్ద నిర్మించి ప్రభుత్వ కార్యాలయాలను సైతం కూల్చివేస్తారా? అంటూ రేవంత్ రెడ్డి సర్కారును ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన భవనాలను భవనాలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు.. ఆ పరిధిలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలను కూలుస్తారా? అంటూ నిలదశారు. నెక్లెస్ రోడ్ సైతం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని, జీహెచ్‌ఎంసీ సైతం నీటికుంటలో నిర్మించిందేనని.. నాలాపై కట్టిన కార్యాలయాన్ని సైతం కూల్చివేస్తారా? అంటూ తీవ్రంగా ప్రశ్నించారు. ప్రభుత్వానికి సంబంధించిన సీసీఎంబి ఆఫీస్ హిమాయత్ సాగర్ వద్దనే ఉందని.. అలాగే, నగర పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఎల్‌టీఎఫ్ పరిధిలోనే ఉన్నాయన్నారు. గోల్కొండలో ఉన్న చెరువులో గోల్ఫ్ కోర్టు ఉందని.. ఆ గోల్ఫ్ కోర్టులో ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు సైతం గోల్ఫ్ ఆడుకుంటారని.. అక్కడికి వెళ్లి చూడాలని.. లేకపోతే ఫొటోలు కావాలంటే తానే ఇస్తానన్నారు. ఎల్‌టీఎఫ్ సమస్యపై నగర మేయర్‌ను కలిశామని.. ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో చూస్తానన్నారు. వక్ఫ్‌బోర్డుకు వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతుందోని.. ముస్లింలను లేకుండా చేయాలని మోదీ ప్రభుత్వం చూస్తుందంటూ మండిపడ్డారు. మజీద్‌లు, దర్గాల లాగే వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వఆస్తులు కావన్న ఆయన.. ఉన్న వక్ఫ్ ఆస్తులకు డీడ్ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మక్కా మసీద్‌కు డీడ్ కావాలంటే ఎక్కడ తేవాలంటూ కేంద్రాన్ని నిలదీశారు.

## తెలంగాణలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తా: చంద్రబాబు



విశ్వంభర, హైదరాబాద్: ఎన్టీఆర్ భవన్ లో పార్టీ నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబు సమావేశమయ్యారు.తెలంగాణలో పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని నాయకులను ఆదేశించారు. పనితీరు బాగున్న వారికే పార్టీలో ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఉన్న అన్ని కమిటీలను అదినేత రద్దు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తెలంగాణలో తెదేపా బలోపేతానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఆన్లైన్లో పార్టీ సభ్యత్వం తీసుకొనే ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు చెప్పారు. 15రోజులకు ఒకసారి రాష్ట్రానికి వచ్చేందుకు ప్రయత్నిస్తానని, అందరినీ కలిసి అభిప్రాయాలు తీసుకుంటానని తెలిపారు.

# డెంగ్యూపై సమీక్ష చేయకుండా..

## విపక్షాలపై కక్ష సాధింపులకు పాల్పడుతున్న ప్రభుత్వం: హరీశ్‌రావు



**హైదరాబాద్:** ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారని, పిట్టల్లాగా ప్రజలు చనిపోతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు (%ఝతీఱంష్ట్ర ఝశీ%) విమర్శించారు. రాష్ట్రంలో డెంగ్యూ కేసులు 36 శాతం పెరిగాయన్నారు. డెంగ్యూ కేసులపై ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క సమీక్ష కూడా చేయలేదని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో మందులు లేవున్నారు. ప్రజారోగ్యం కంటే ఏదైనా ముఖ్యమైనది ఉన్నదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ పరిస్థితి ఉందని చెప్పారు. డెంగ్యూపై సమీక్ష చేయకుండా.. విపక్షాలపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డైవర్షన్ రాజకీయాలకు రేవంత్ సర్కార్ తెరలేపిందన్నారు. హైడ్రా పేరుతో రాష్ట్రంలో హైడ్రామా నడుస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఇంబ్బంది పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చీమకు కూడా హాని చేయని కుటుంబం పల్లా రాజేశ్వర్‌రెడ్డిదన్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత తప్పుంటే కూలగొట్టాలన్నారు. రాజకీయంగా పల్లాను ఎదుర్కోలేక ఆర్థికంగా దెబ్బ కొట్టాలని చూస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో పల్లా భూములు లేవని ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు నివేదికలు ఇచ్చాయి. జిల్లా కలెక్టర్ కూడా ఎన్‌వోసీ జారీచేశారు. హెచ్‌ఎండీఏ అనుమతితోనే కాలేజీ నిర్మాణం చేశారు. రికార్డులు పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకోవాలని సూచించారు.రాజకీయ ప్రేరిత విషయాల్లో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించవద్దని చెప్పారు. విద్యా సంస్థలు, దవాఖానలపై రాజకీయ కక్షలు ఎందుకని ప్రశ్నించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై అక్రమంగా ఆరు కేసులు పెట్టారన్నారు. రాష్ట్రంలోని అన్ని ఇంజినీరింగ్ కాలేజీలకు సీట్లు పెంచారు. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కాలేజీలకు మాత్రం సీట్లు తగ్గించారని వెల్లడించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయంగా కక్ష సాధించడం మంచిదికాదన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఉద్యమ నాయకుడని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో నిక్కచ్చిగా నిజాయితీగా పనిచేసినటువంటి నాయకుడు. ఉద్యమంలో పోరాటం చేసి ఎన్నో కేసులు అయ్యి అరెస్టు అయ్యాడు. ఆనాడు ప్రభుత్వంలోనైనా, ప్రతిపక్షంలోనైనా ప్రజల పక్షాన ఒక నిబద్ధత కలిగిన నిజాయితీ గలిగిన ప్రజా ప్రతినిధిగా ఒక కార్యకర్తగా, ఒక ఉద్యమ నాయకుడిగా పనిచేశారు. కొంతమంది ఎమ్మెల్యేలను టార్గెట్ పెట్టుకొని కండువా కప్పుకోండి లేకపోతే మిమ్మల్ని ఇబ్బంది పెడతాం, మీ మీద అక్రమ కేసులు పెడతాం, మీ ఆస్తులు కూల్చేస్తాం అనే ధోరణితో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తున్నది. పఠాన్ చేరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మీద అక్రమ మైనింగ్ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారు. రూ.300 కోట్ల ఫైన్ కట్టాలి అని నోటిసులు ఇచ్చారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరగానే అన్ని మర్చిపోయారు, కేసులు కూడా ఆటకెక్కాయని చెప్పారు. రుణమాఫీ పేరుతో మంత్రులు రోజుకో మాట మాట్లాడుతున్నారని చెప్పారు. సాంకేతిక కారణాల పేరుతో మంత్రులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రుణ మాఫీపై పెట్టిన గడువలన్నీ జోక్ అయ్యాయని ఎద్దేవా చేశారు. ప్లానింగ్ లేక కుంటిసాకులు చెబుతున్నారని వెల్లడించారు. ఆర్మూర్‌లో రైతులు భారీ ధర్నా చేపట్టారని, తక్షణమే రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పుల విషయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. అప్పుల విషయంలో ఒక్కో మంత్రి ఒక్కో రకంగా మాట్లాడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఆస్తుల కలప్పన చేశామని, అన్ని వర్గాల వారికి సంక్షేమాన్ని అందించామన్నారు. రూ.72 వేల కోట్లు రైతుబంధు ఇచ్చామని తెలిపారు. అప్పుల పేర్లు చెప్పి తప్పించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అలవికాని హామీలు ఇచ్చి గత ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారు. ఎనిమిది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.68 వేల కోట్లు అప్పులు చేసింది. రేవంత్ రెడ్డికి అప్పుల గురించి మాట్లాడే హక్కుందా అని నిలదీశారు. రాష్ట్రం సమస్యల వలయంలో ఉంటే మీరు ఢిల్లీ ప్రయాణాలు చేస్తున్నారు. రాత్రికిరాత్రి వచ్చి ప్రతిపక్షాలపై దాడులు చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు.

# చంద్రబాబును కలిసిన

## మాజీ మంత్రి బాబూమోహన్



**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ మంత్రి బాబూమోహన్ ఆదివారం ఎన్టీఆర్ భవనకు వచ్చి టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. దీంతో ఆయన తెదేపాలో చేరుతారనే ప్రచా రం జరుగుతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్ని కల ముందు వరకు భాజపాలో ఉన్న ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత ప్రజాశాంతి పార్టీలో చేరినప్పటికీ అక్కడ కూడా ఇమడలేక పోయారు. గత కొంతకా లంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న బాబూమోహన్ తాజాగా చంద్రబాబును కలవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం సాయంత్రం పార్టీ నేతలతో తెదేపా అధినేత చంద్రబాబు సమావేశమయ్యారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని నాయకులను ఆదేశించారు. పనితీరు బాగున్న వారికే పార్టీలో ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఉన్న అన్ని కమిటీలను అధినేత రద్దు చేశారు.

# నిడమనూరులో దారుణం..

## తల్లిని చంపిన తనయుడు

**విశ్వంభర, నిడమనూరు :** నల్లగొండ జిల్లా నిడమనూరులో దారుణం చోటు చేసుకుంది. నవ మాసాలు పెంచి పెద్ద చేసిన కన్నతల్లిని కర్కశంగా హత్యచేశాడు తనయుడు. అనంతరం తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిడమనూరుకు చెందిన రావిరాల సాయమ్మ(65)కు కొడుకు శివ(36) ఉన్నాడు.ఏడాది క్రితం శివకు వివాహం జరిగింది. కాగా, శివ భార్య ఇటీవలే విడాకులు తీసుకుంది. ఏమైందో తెలియదు కాని శివ తన తల్లిని కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం అదే కత్తితో తాను గొంతు కోసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అయితే శివ మానసిక స్థితి సరిగా లేదని బంధువులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఒకే తల్లి, కొడుకు మృతి చెందడం నిమనూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# హైదరాబాద్లో భారీ కుంభకోణం!

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో భారీ కుంభకోణానికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు రూ.175 కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు గుర్తించారు. షంషీర్‌గంజ్ ఎస్బీఐలోని ఆరు ఖాతాల్లో నగదు లావాదేవీలపై అనుమానంతో బ్యాంక్ అధికారులు ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా ఆ నకిలీ ఖాతాల్లో భారీగా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు పేదల పేరుతో ఖాతాలు తెరిచి సైబర్ నేరాలకు పాల్పడ్డారు. వివిధ బ్యాంకుల ఖాతాదారుల నుంచి పెద్ద ఎత్తున నకిలీ బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయినట్లు గుర్తించారు. నగదును నిందితులు క్రిప్టో కరెన్సీ ద్వారా దుబాయ్కు తరలించారు. దీనిపై నిందితులను ప్రశ్నిస్తున్న పోలీసులు.. మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.

# చెట్ల నరికివేతపై విద్యుత్ సిబ్బందికి హరీశ్‌రావు మందలింపు..!



**విశ్వంభర, సిద్దిపేట:** జిల్లా కేంద్రంలోని మెదక్ రోడ్డులో రోడ్డు వెంట ఉన్న చెట్లను అకారణంగా నరికివేస్తున్న విద్యుత్ సిబ్బందిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మందలించారు. అటుగా వెళ్తున్న హరీశ్‌రావుకు చెట్లను నరికివేస్తుండడాన్ని గమనించారు. దాంతో సిబ్బంది వద్దకు వెళ్లి చెట్లను ఎందుకు నరికివేస్తున్నారని ప్రశ్నించారు. కరెంట్ తీగలకు చెట్లు అడ్డంగా ఉన్నాయని చెప్పారు. దాంతో ఆయన స్పందిస్తూ.. వైర్లకు అడ్డంగా ఉన్నాయని చెట్లను పూర్తిగా నరికివేయడం సరికాదని.. లైన్లకు అడ్డం వచ్చిన కొమ్మలను మాత్రమే తొలగించాలన్నారు. పూర్తిగా చెట్లను నరికివేస్తూ పర్యావరణానికి ఎందుకు నష్టం చేస్తున్నారంటూ మందలించారు.20 ఏళ్లుగా సిద్దిపేటలో మొక్కలను పిల్లల్లా కాపాడుకుంటూ వచ్చామని.. ఇక్కడి ప్రజలకు చెట్లతో ఉండే అనుబంధాన్ని తొలగిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ముందు చూపులేకుండా, పర్యవేక్షణ లేకుండా గుడ్డిగా కార్మికులను పెట్టి చెట్లను తొలగించడం అధికారుల నిర్లక్ష్యమని అన్నారు. చెట్లను తొలగించడం సులువైన పని కానీ.. వాటిని పెంచడానికి సిద్దిపేట ప్రజలకు 20 సంవత్సరాలు పట్టిందని వాటిని ఎంతో ప్రేమగా పెంచామని అన్నారు. పర్యావరణానికి ఎంతో ఉపయోగపడే చెట్లను విచక్షణారహితంగా తొలగించడం దుర్మార్గమని, తొలగించాలని ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో మరో ఐదురోజుల పాటు వర్షాలు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో వర్షాలు దంచికొడుతున్నాయి. నిన్న సిద్దిపేట జిల్లాలో భారీ వర్షాలు కురవగా.. పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాపాతం రికార్డయ్యింది. మరో వైపు రాగల ఐదురో జుల పాటు తెలంగాణవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చ రించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములు గు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురి సే అవకాశాలున్నాయని చెప్పింది. పలుచోట్ల గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వస్తాయని.. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. సోమ వారం ఆది లాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామా బాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారా బాద్, సంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలుపడే ఛాన్స్ ఉందని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా సిద్ది పేట జిల్లా మిరుదొడ్డిలో 7.5 సెంటీమీటర్లు, సిద్దిపేట అర్బన్‌లో 6.5 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైంది.





## జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు తొలి జాబితా ప్రకటించిన ఆమ్ ఆద్మీ పార్టీ

**ఢిల్లీ:** సెప్టెంబర్ 18 నుంచి మూడు దశల్లో పోలింగ్ జరిగే జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆదివారం ఏడుగురు అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది. పుల్వామా నుంచి ఫయాజ్ అహ్మద్, ముదస్సిర్ హసన్ (రాజ్‌పుర), షేక్ ఫిదా హుస్సేన్ (దేవ్సర్), మోహిసిన్ షఫ్తకత్ మిర్ (దురు), యాసిర్ షఫి మట్టో (దోడా వెస్ట్)ను పార్టీ అభ్యర్థులుగా బరిలో నిలిపింది.ఇక సెప్టెంబర్ 18న తొలి దశ పోలింగ్ జరగనుండా, 25న రెండో దశ పోలింగ్, అక్టోబర్ 1న మూడో దశ పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 4న ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు. ఇక మొత్తం 90 నియోజకవర్గాలకు గాను తొలి దశలో 24 స్థానాలకు పోలింగ్ జరగనుండగా, రెండో దశలో 26, తుది దశ పోలింగ్‌లో 40 స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. కాగా, జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య పొత్తుపై కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సుర్జీవాలా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు పార్టీల పొత్తుపై బీజేపీ ఎందుకు భుజాలు తడుముకుంటున్నదని ఆయన ప్రశ్నించారు.గతంలో బీజేపీ ఏ పార్టీతో కలిసినా తాము వారు ఎందుకు కలిశారని ఎన్నడూ అడగలేదని గుర్తుచేశారు.అలాంటిది ఇప్పుడు తమను బీజేపీ ఎందుకు ప్రశ్నిస్తున్నదని నిలదీశారు. హరియాణలోని కైథల్‌లో సుర్జీవాలా ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. బీజేపీ గతంలో నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలతో పొత్తు పెట్టుకోలేదా అని ఆయన ప్రశ్నించారు. గతంలో వారు పలు పార్టీలతో అంటకాగారని, మీరు గతంలో ఇలా వ్యవహరించి ఇప్పుడు పొత్తుపై తమను బీజేపీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని అన్నారు.

## పొత్తుపై బీజేపీ ప్రశ్నించడం విడ్డూరం

**- కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సుర్జీవాలా**



**శ్రీనగర్:** జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య పొత్తుపై కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సుర్జీవాలా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు పార్టీల పొత్తుపై బీజేపీ ఎందుకు భుజాలు తడుముకుంటున్నదని ఆయన ప్రశ్నించారు. గతంలో బీజేపీ ఏ పార్టీతో కలిసినా తాము వారు ఎందుకు కలిశారని ఎన్నడూ అడగలేదని గుర్తుచేశారు.అలాంటిది ఇప్పుడు తమను బీజేపీ ఎందుకు ప్రశ్నిస్తున్నదని నిలదీశారు. హరియాణలోని కైథల్‌లో సుర్జీవాలా ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. బీజేపీ గతంలో నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలతో పొత్తు పెట్టుకోలేదా అని ఆయన ప్రశ్నించారు. గతంలో వారు పలు పార్టీలతో అంటకాగారని, మీరు గతంలో ఇలా వ్యవహరించి ఇప్పుడు పొత్తుపై తమను బీజేపీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని అన్నారు.
మరోవైపు కాంగ్రెస్ లక్ష్యంగా బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం హామీలు గుప్పించి ఆపై వాటి అమలును విస్మరిస్తుందని ఆరోపించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్నికలకు ముందు ఆ పార్టీ హామీ ఇచ్చిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిందా అని రాహుల్ గాంధీని రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. ఓట్లు దండుకునేందుకు హామీలను ఇచ్చి ఆపై అధికారంలోకి రాగానే వాటిని విస్మరించే కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు.

## లోక్ జనశక్తి పార్టీ చీఫ్‌గా చిరాగ్ పాశ్వాన్ తిరిగి ఎన్నిక



**రాంచీ:** లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) చీఫ్‌గా చిరాగ్ పాశ్వాన్ తిరిగి ఎన్నికయ్యారు. కేంద్ర మంత్రి అయిన ఆయన ఐదేళ్ల పాటు ఆ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఆదివారం ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) చీఫ్‌గా చిరాగ్ పాశ్వాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో ఐదేళ్ల పాటు ఆ పార్టీ అధ్యక్షుడిగా తాను కొనసాగుతానని మీడియాతో ఆయన అన్నారు.కాగా, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి అయిన చిరాగ్ పాశ్వాన్ ఈ సందర్భంగా త్వరలో జరుగనున్న హర్యానా, జార్ఖండ్, జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల గురించి పార్టీ నేతలతో చర్చించారు. జాతీయ కూటమిలో భాగస్వామ్యమైన బీజేపీతో కలిసి లేదా సొంతంగా జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని ఆయన తెలిపారు.

## బీజేపీ గూటికి ఆప్ కౌన్సిలర్లు

**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి ఆదివారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ, ఆ పార్టీ నేత రాంవీర్ సింగ్ బిధూరీల సమక్షంలో పలువురు ఆప్ కౌన్సిలర్లు బీజేపీలో చేరారు. ఆప్ అవినీతిలో కూరుకుపోవడంతో దిక్కుతోచని స్థితిలో కాషాయ పార్టీలో చేరాలని వారు నిర్ణయించుకున్నారని వీరేంద్ర సచ్‌దేవ పేర్కొన్నారు.ఆప్ అవినీతిలో కూరుకుపోవడంతో పాటు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో విసిగిన ఐదుగురు ఆప్ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపడంతో పాటు ప్రతి ఒక్కరూ పురోగమించేలా దశదిశ నిర్దేశించడంతో వారంతా బీజేపీకి ఆకర్షితులయ్యారని చెప్పారు.
ఢిల్లీ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని, ఆప్ నుంచి బీజేపీలో చేరిన వారందరినీ పార్టీలోకి స్వాగతిస్తున్నామని తెలిపారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహా ఆ పార్టీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అగ్రనేతలు ఎక్సైజ్ స్కామ్ సహా పలు అవినీతి, కుంభకోణాల్లో కూరుకుపోయారని అన్నారు.ఢిల్లీలో పాలక ఆప్ అవినీతి పాలన పట్ల ప్రజలు విసిగి వేసారారని అన్నారు.



# ఇస్లామాబాద్ పర్యటనకు ప్రధాని వెళ్తారా..?

## ఎస్‌సీవో సమావేశానికి రావాలని మోదీకి పాక్ ఆహ్వానం..



**ఢిల్లీ:** షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశానికి హాజరయ్యేందుకు పాకిస్తాన్‌కు రావాలని ఆ దేశం ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించింది. ఈ ఏడాది ఇస్లామాబాద్‌లో సమావేశం జరుగనున్నది. ఈ భేటీకి షాంఘై కో ఆపరేటివ్ ఆర్గనైజేషన్ సభ్యదేశాల అధినేతలు భేటీకి హాజరుకానున్నారు. అయితే, భారత్‌పాక్ మధ్య ప్రస్తుత సంబంధాల నేపథ్యంలో ప్రధాని పాక్‌కు వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. ప్రధాని ఇస్లామాబాద్ పర్యటకు వెళ్తారా..? ఆయన తరఫున ఎవరైనా మంత్రులను పంపిస్తారా? అనేదానిపై వేచి చూడాల్సిందే. ఎస్‌సీవో సమావేశం అక్టోబర్ 1516 తేదీల మధ్య జరుగనుండగా.. భేటీకి పాక్ ఆతిథ్యం ఇస్తున్నది. సమావేశానికి ఆతిథ్యం ఇచ్చేందుకు సభ్య దేశాలకు అవకాశం ఉంటుంది. ఇందులో భాగంగా ఈ సారి ఆతిథ్యమిచ్చే బాధ్యత పాక్‌కు దక్కింది. ఇంతకు ముందు కజకిస్థాన్‌లో జరిగిన సమావేశానికి ప్రధాని దూరంగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భేటీకి దూరంగా ఉన్నారు. ఆయన స్థానంలో విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరయ్యారు. పాకిస్థాన్‌లో జరిగే సమావేశంలో నేతలకు వర్చువల్‌గా ప్రసంగించే వెసులుబాటు కల్పిస్తారా? లేదా? అన్న విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎస్‌సీవోలో చైనా, రష్యా, భారత్‌తో పాటు పాక్ సభ్యులు. షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్‌పై చైనా ఆధిపత్యం ఎక్కువగా ఉంటుంది. చైనా తన బీఆర్ఐ ప్రోత్సాహం కోసం ఈ వేదికను ఉపయోగించుకుంటున్నది. ఈ చైనా ప్రాజెక్టుకు భారత్ మద్దతు ఇవ్వడం లేదు. గతేడాది సైతం ఎస్‌సీవో సంయుక్త ప్రకటనలోనూ బీఆర్ఐ ప్రస్తావనకు భారత్ అనుమతించలేదు. అయితే, భారతదేశంపాకిస్తాన్ కలిసి పనిచేసే ఏకైక బహుపాక్షిక సంస్థ ఎస్‌సీవో. ఇది శాశ్వత ప్రభుత్వ అంతర్జాతీయ సంస్థ. ఈ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని కొనసాగించడం దీని లక్ష్యం. 2001 సంవత్సరంలో ఎస్‌సీవో ఏర్పాటు కాగా.. 2003లో అమలులోకి వచ్చింది. ఈ సంస్థ లక్ష్యం సభ్య దేశాల మధ్య పరస్పర విశ్వాసం, సద్భావనను బలోపేతం చేయడం. రాజకీయాలు, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, పరిశోధన, సాంకేతికత, సంస్కృతి రంగంలో సమర్థవంతమైన సహకారాన్ని ప్రోత్సహించడం. విద్య, ఇంధనం, రవాణా, పర్యాటకం, పర్యావరణ పరిరక్షణ మొదలైన రంగాల్లో సంబంధాలను మెరుగుపరచడం. సంబంధిత ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని నిర్ధారించడం. ఇందులో చైనా, రష్యా, భారతదేశం, పాకిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్, కజకిస్తాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.

## రెండుగా విడిపోయిన రైలు..

# తప్పిన పెను ప్రమాదం..!



**ఫిరోజ్‌పూర్ :** వరుస రైలు ప్రమాదాలు ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. పలుచోట్ల పట్టాలు తప్పగా.. పలు ఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయాలపాలయ్యాడు. తాజాగా మరో ఘటన చోటు చేసుకున్నది. రన్నింగ్‌లో ఉన్న రైలు రెండుగా విడిపోయింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటు చేసుకున్నది. ఫిరోజ్‌పూర్ నుంచి ధన్‌బాద్ వెళ్తున్న కిసాన్ ఎక్స్‌ప్రెస్ రైలు సియోహరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయ్‌పూర్ రైల్వేగేట్ సమీపంలో రెండుభాగాలుగా విడిపోయింది. రైలులో మొత్తం 21 కోచ్‌లు ఉండగా.. ఇందులో ఎనిమిది కోచ్‌లు విడిపోయాయి. ఆ తర్వాత గమనించిన అధికారులు మిగతా కోచ్‌లను సియోహరా రైల్వేస్టేషన్‌కు తరలించారు. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. అదే మార్గంలో మరో రైలు వచ్చి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదోనని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకున్నది.
వేకువ జామున 3.36 గంటల ప్రాంతంలో రైలు ధాంపూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. 3.45 గంటలకు సర్కడ చక్రజామల్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరిన అనంతరం రాయ్‌పూర్ రైల్వేగేట్ సమీపానికి రాగానే రైలు రెండుభాగాలు విడిపోయింది. ఎనిమిది కోచ్‌లు విడిపోగా.. మిగతా రైలు సియోహరా స్టేషన్‌కు చేరగా.. రాయ్‌పూర్ సమీపంలో ఎనిమిది కోచ్‌లు నిలిచిపోయాయి. ఈ ఘటనపై గార్డ్ సమాచారం అందించడంతో అధికారులు షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత ఎస్పీ ధరమ్ సింగ్, పోలీస్ సర్కిల్ సర్వం కుమార్, కొత్వాల్ కిషన్ అవరాత్ బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం కోచ్‌లను రైలుకు అనుసంధానించారు. రైలులో ఉన్న ప్రయాణికుల్లో ఎక్కువగా పోలీస్ ఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులే ఉన్నారు. ఈ ఘటన అనంతరం రైల్వేగేట్ వద్ద అధికారులు బస్‌లను ఆపి.. అభ్యర్థులను గమ్యస్థానాలకు పంపారు. ఈ రైలు ఘటనతో పలు రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ధాంపూర్ రైల్వే స్టేషన్‌లో పంజాబ్ మెయిల్ దాదాపు 2 గంటల పాటు నిలిచిపోయింది. ధాంపూర్‌లో స్టాపే లేని జననాయక్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లపై తీవ్ర ప్రభావంపడింది.

## హర్యానా ఎన్నికలు రేపే నిర్వహించండి..

**మా పార్టీ సిద్ధంగా ఉంది: బీజేపీ నేత అనిల్ విజ్**



**చండీగఢ్:** హర్యానా అసెంబ్లీ ఎన్నికలను రేపే నిర్వహించాలని ఆ రాష్ట్ర మాజీ హోం మంత్రి, బీజేపీ సీనియర్ నేత అనిల్ విజ్ అన్నారు. తమ పార్టీ ఎన్నికలకు సిద్ధంగా ఉందని తెలిపారు. వరుస సెలవుల నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయాలని ఈసీని బీజేపీ కోరింది. దీనిపై కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఈ నేపథ్యంలో అనిల్ విజ్ ఆదివారం స్పందించారు. ప్రకటించిన ఎన్నికల తేదీ వరుస సెలవుల తర్వాత ఉండటంతో ఓటర్ల సంఖ్యను తగ్గిస్తుందని మీడియాతో అన్నారు. 'కాంగ్రెస్ ఈ రోజు స్పందించింది. కానీ ఎన్నికల పొడిగింపు కోసం మేం అడగడం లేదు. సుదీర్ఘ సెలవు కాలాన్ని నివారించడానికి ఎన్నికల తేదీని కొన్ని రోజులు వెనక్కి జరుపాలని మేం సూచిస్తున్నాం. ఎన్నికలకు మేం సిద్ధంగా ఉన్నాం. రేపు నిర్వహించినా మా పార్టీ సిద్ధంగా ఉంది' అని అన్నారు.కాగా, బీజేపీ ఇటీవల రెండు రోజుల పాటు మారథాన్ సమావేశాన్ని నిర్వహించిందని అనిల్ విజ్ తెలిపారు. 90 అసెంబ్లీ స్థానాల్లో పోటీ కోసం ప్రతి స్థానం నుంచి ముగ్గురు లేదా నలుగురు అభ్యర్థుల పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపినట్లు చెప్పారు. రేపే ఎన్నికలు జరిగినా తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. మరోవైపు హర్యానాలో ఒకే దశలో అక్టోబర్ 1న పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 4న ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు.

## గందర్బాల్ నుంచి ఒమర్ అబ్దుల్లా పోటీ



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా యూ టర్న్ తీసుకున్నారు. జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన నిర్ణయించారు. గందర్బాల్ నియోజకవర్గం నుంచి ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తారని ఆయన పార్టీ ప్రకటించింది. ఎన్సీ ఎంపీ సయ్యద్ రుహుల్లా మెహదీ, ఆ పార్టీ ప్రావిన్షియల్ ప్రెసిడెంట్ నాసిర్ అస్లాం వనీ ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించారు. గందర్బాల్ జిల్లాలోని నునేర్ గ్రామానికి ఒమర్ అబ్దుల్లా ఆదివారం చేరుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన రాజకీయ నేత సయీమ్ ముస్తఫా ఎన్సీలో చేరారు. ఈ సందర్భంగా గందర్బాల్ నియోజకవర్గం నుంచి ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తారని ఎన్సీ నేతలు సయ్యద్ రుహుల్లా మెహదీ, నాసిర్ అస్లాం వనీ వెల్లడించారు.కాగా, జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నంత వరకు తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. ఆయన తండ్రి, ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని అన్నారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా దక్కిన తర్వాత తాను రాజీనామా చేస్తానని, అప్పుడు తన కుమారుడు ఒమర్ అబ్దుల్లా ఆ సీటు నుంచి పోటీ చేస్తారని చెప్పారు. అయితే తన ప్రకటన నుంచి యూ టర్న్ తీసుకున్న ఒమర్ అబ్దుల్లా జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు.



**పూరీ నగరాన్ని అత్యాధునిక ఆధ్యాత్మిక నగరంగా**

## అభివృద్ధి చేస్తాం

**కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

**భువనేశ్వర్:** పూరీ నగరాన్ని అత్యాధునిక ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సొంత రాష్ట్రానికి విచ్చేసిన ఆయన.. ఆదివారం పూరీ జగన్నాథుడిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ, ఇద్దరు డిప్యూటీ సీఎంలు ప్రధాని నరేంద్ర మోదీని ఈ పథకం ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారని తెలిపారు. అందుకు మోదీ అంగీకారం తెలిపారని వెల్లడించారు.పూరీ జగన్నాథుడి ఆలయంలోని రత్నభాండాగారం నిర్వహణ, అందులో ఖజానాను ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI) ఉన్నత స్థాయి బృందం త్వరలోనే తనిఖీ చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు.. ఒడిశా ప్రభుత్వం రత్నభాండాగారంలో ఉంచిన ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు జాబితాను తయారు చేస్తుందన్నారు. తాజా జాబితాను మునుపటి జాబితాతో పోల్చి చూస్తుందని తెలిపారు."మహిళలకు సాధికారత కల్పించేందుకు ప్రతి మహిళకు రూ.50వేలు చొప్పున ఇస్తామని ఇటీవల ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఒడిశా ప్రజలు మాపై విశ్వాసం ఉంచారు. అందువల్ల మోహన్ మాఝీ సారథ్యంలోని ఏర్పాటైన భాజపా ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలను ఇప్పటికే ఖరారు చేసింది. 26 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన దాదాపు కోటి మంది అర్హులైన పేద మహిళలకు ఏడాదికి రూ.10వేలు చొప్పున మొత్తం ఐదేళ్లలో రూ.50వేలు అందిస్తాం" అని మంత్రి తెలిపారు.ఒడిశాలో భాజపా ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సుభద్ర యోజన' పథకం ప్రారంభోత్సవానికి సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉందన్నారు.

## 243 స్థానాల్లో జన్ సూరజ్ పార్టీ పోటీ

**- ప్రశాంత్ కిశోర్**

**పాట్నా:** ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఇప్పటికే జన్ సూరజ్ పేరుతో రాజకీయ పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 2న పార్టీని ప్రారంభించనున్నారు. జన్ సూరజ్ పార్టీ 2025లో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. 243 స్థానాల్లో పోటీ చేస్తుందని.. కనీసం 40 మంది మహిళా అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. 2030 నాటికి 70 నుంచి 80 మంది మహిళా నేతలను జన్ సూరజ్ నాయకురాళ్లుగా తీర్చిదిద్దుతామని ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రకటించారు. మహిళా సెల్ సమావేశంపై ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ.. ఇది మహిళా సెల్ సమావేశం కాదని.. ఇది నిజమైన అర్థం మహిళా నాయకులను చేసే ప్రయత్నమన్నారు. మహిళలు జీవనోపాధికి నాలుగుశాతం గ్యారంటీతో రుణాలు పొందాలని.. అందుకే మహిళలను గెలిపించి అసెంబ్లీకి పంపుతామనేది జన్ సూరజ్ ప్రచారమన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం కొలువుదీరితే 1012వేల ఉద్యోగాల కోసం బిహార్‌ను విడిచిపెట్టమిన ఎవరూ బలవంతం చేయరని.. ఇందుకోసం పూర్తిగా బ్లూప్రింట్‌ని సిద్ధం చేశామన్నారు. బిహార్ అభివృద్ధిపై ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ కులం, దోపిడీ, మద్యం మాఫీయా, నేరాలపై తేజస్వీ యాదవ్ కామెంట్స్ చేయవచ్చని.. అభివృద్ధిపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న ఆయనకు జీడీపీ, జీడీపీ వృద్ధి అంటే ఏమిటో తెలియదని విమర్శించారు. ఆరు నెలల కిందట తేజస్వీ యాదవ్ డిప్యూటీ సీఎంగా ఉన్న సమయంలో బీహార్ అభివృద్ధి కథ గురించి ఆయన మాట్లాడుతున్నారు. మహాఘటబంధన్‌లో నితీశ్ కుమార్ ఉండి ఉంటే.. బిహార్‌లో ఆయనకు అంతా మంచే కనిపించేదంటూ సెటైర్లు వేశారు.



# వైజాగ్ బీచ్‌లో వెనక్కి వెళ్లిన సముద్రం

- తీరంలో బయటపడ్డ రాళ్లపై టూరిస్టుల సందడి

**విశ్వంభర, విశాఖపట్నం :** విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో శనివారం సాయంత్రం అరుదైన సన్నివేశం కనిపించింది. సముద్రం దాదాపుగా 400 మీటర్లు దూరం వెనక్కి వెళ్లింది. సాధారణంగా ఆర్కే బీచ్ వద్ద అలలు ఎగసిపడుతూ పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తుంటాయి. అలా ఉప్పొంగి వచ్చే అలలను ఆస్వాదిస్తూ.. సందర్శకులు సేదదీరుతూ ఉంటారు. ఒక్కొక్కసారి అలలు ఉధృతికి సముద్రం తీరం దగ్గరకి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతుంటారు. కానీ శనివారం సాయంత్రం ఇందుకు భిన్నమైన వాతావరణం ఏర్పడింది. సముద్రం 400 మీటర్లు వెనక్కి వెళ్లింది. దీంతో సముద్రం లోపల ఉండే శిలలు బయటపడ్డాయి. దీంతో బీచ్ చూడ్డానికి వచ్చిన పర్యాటకులు.. వాటిపై నిలబడి సెల్ఫీలు దిగారు. అయితే విశాఖపట్నంలో సముద్రం ఇలా వెనక్కి వెళ్లడం ఇదేమీ కొత్త కాదు. ఈ ఏడాది ప్రారంభంలో జనవరిలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. అప్పుడు కూడా సముద్రం వెనక్కి వెళ్లింది. మరోవైపు సముద్రం ఇలా వెనక్కి వెళ్లడానికి అనేక కారణాలు ఉంటాయని నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా అలలు కూడా ఇందుకు కారణంగా చెప్తున్నారు. చంద్రుడు, సూర్యుని గురుత్వాకర్షణ శక్తి కారణంగా ఆటుపోట్లు ఏర్పడుతాయని వివరిస్తున్నారు. ఆటుపోట్ల సమయంలో సముద్ర జలాల్లో పెరుగుదల, తగ్గుదల ఉంటుందని చెప్తున్నారు.

ఇక సూర్యుడితో పోలిస్తే చంద్రుడి గురుత్వాకర్షణశక్తి అధికంగా ఉంటుందని.. భూమికి దగ్గరగా ఉండటమే ఇందుకు కారణమంటున్నారు. అందుకే ఆటుపోట్లకు ప్రధాన కారణం చంద్రుడని వివరిస్తున్నారు. మరోవైపు కొన్నిసార్లు సముద్రం లోపల జరిగే అనేక పరిణామాలు వలన కూడా తీరాలపై ప్రభావం పడుతుందంటున్నారు. మరోవైపు సముద్రం ఉపరితలంపై నీటికణం పైకి చేరినప్పుడు కాస్త నెమ్మదిస్తుంది.. ఇదే సమయంలో గురుత్వాకర్షణ శక్తి దానిని వెనక్కి లాగుతుంది. దీంతో పైకి వచ్చి నీటి కణం తిరిగి దాని అసలు స్థానానికి చేరుకుంటుంది. ఈ కారణంగానే



సముద్రపు నీరు ఒడ్డుకు వచ్చి.. ఆ తర్వాత వెనక్కి నెట్టబడుతుందని మరికొంతమంది నిపుణులు చెప్తున్నారు. ఫలితంగానే సముద్రం ఇలా వెనక్కి వెళ్లే ఘటనలు జరుగుతూ ఉంటాయని చెప్తున్నారు. అయితే సముద్రం ఇలా వెనక్కి వెళ్లిన సమయంలో సముద్రపు కదలికలు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



## శ్రీశైలంలో కుమారస్వామికి విశేష అభిషేకం

**విశ్వంభర, శ్రీశైలం :** భ్రమరాంబ మల్లికార్జున స్వామి కొలువుదీరిన శ్రీశైలం దేవస్థానంలో సుబ్రహ్మణ్యస్వామి వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రతి మంగళవారం, కృత్తికా నక్షత్రం, షష్ఠితిథుల్లో కుమారస్వామి విశేష అభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలను దేవస్థానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. అభిషేకానికి ముందుగా అర్చకులు దేశంలో శాంతిసౌభాగ్యాలు విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని సంకల్పం పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి వారికి పంచామృతాలతో పాటు పలురకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అర్చన అనంతరం సుబ్రహ్మణ్య స్తోత్రాన్ని పారాయణం చేశారు.

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ



**విశ్వంభర, తిరుమల :** వారాంతపు సెలవు దినాల కారణంగా తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారి దర్శనానికి 31 కంపార్టుమెంట్లు నిండిపోయి బాట గంగమ్మ ఆలయం వరకు భక్తులు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. నిన్న స్వామివారిని 79,521 మంది భక్తులు దర్శించుకోగా 40,152 మంది భక్తులు తలనీలాలు సమర్పించు కున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.87 ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

## మూడు నెలల్లోనే 13 వేల కోట్ల అప్పులు



**విశ్వంభర, కడప :** ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలకు ప్రజల నుండి స్పందన శూన్యం. కొందరు పదవులు లేకపోయినా పచ్చ కండువాలు వేసుకుని గ్రామసభల్లో పెత్తనం చెలాయిస్తున్నారు అని కడప వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 13 వేల కోట్ల రూపాయల అప్పులు చేశారు. ప్రతి మంగళవారం అప్పుల రోజుగా ప్రభుత్వం ముందుకు పోతోంది అని అన్నారు. అలాగే ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా టీడీపీ నేరవేర్చలేదు. ఖరీఫ్ సీజన్ అయిపోతున్నా ఇంత వరకు రైతు భరోసా ఇవ్వలేదు. ఎందుకు చంద్రబాబు ను ముఖ్యమంత్రి చేసుకున్నమా అని ప్రజలు బాధ పడుతున్నారు. గత ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు మద్దతు పలికిన వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని తెలిపారు. అలాగే రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేయాలి. లేకుంటే ప్రజల పక్షాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటాలు చేసేందుకు సిద్ధం అని రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు.

## పేదల చదువుకు సహకారమందిస్తా

**- ఎమ్మెల్యే కృష్ణారావు**

**విశ్వంభర, కేపీహెచ్‌బీ కాలనీ:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కష్టపడి చదివితే..బంగారు భవిష్యత్ ఉంటుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీని చెందిన ఆలీవ్ మిఠాయి సంస్థ అధినేత దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన అకాడమిక్ ఎక్సలెన్సీ అవార్డు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత యేడాది పదో తరగతి వార్షిక పరీక్షలలో 10/10 జీపీఏ పాయింట్స్ సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లక్ష రూపాయల నగదు బహుమతి, ప్రశంస పత్రాలను ఎమ్మెల్యే కృష్ణారావు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించినట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రతి యేటా 10వేల మంది విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్, నోట్‌బుక్స్, పెన్నులు, డిక్షనరీతో కూడిన పాఠశాల కిట్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. సొంతంగా, మిత్రులు సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు వివరించారు. చదువుకు మించినది ఏది లేదని, విద్యార్థులకు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం ఎల్లప్పుడు సహకారాన్ని అందిస్తానని తెలిపారు.



## 25 ఏళ్లకే ఎమ్మెల్యే కావడానికి ఎన్టీఆరే కారణం

**అయ్యన్నపాత్రుడు**



**విశ్వంభర, గుంటూరు:** తాను 25 ఏళ్లకే ఎమ్మెల్యే కావడానికి ఎన్టీఆరే కారణమని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆదివారం గుంటూరులోని ఎన్టీఆర్ కల్చరల్ అసోషియేషన్ 55 వసంతాల వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.." ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తున్నారంటే ఎంతోమంది విమర్శించారు. కానీ, ఆయన రాజకీయాల్లో రాణిస్తారని 25 ఏళ్ల వయసులోనే నేను నమ్మాను. నాకు రాజకీయ భిక్ష పెట్టిన వ్యక్తి ఎన్టీఆర్. చిన్న వయసులోనే మంత్రిని అయ్యే అవకాశమిచ్చారు. కుటుంబ విలువలు చాటి చెబుతూ అనేక సినిమాలు తీశారు. మహిళలంటే ఆయనకు ఎంతో గౌరవం. మహిళలకు ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన గొప్ప వ్యక్తి.

వరకట్నం, ఉమ్మడి కుటుంబం, లవకుశ లాంటి చక్కటి చిత్రాలతో మెప్పించారు. రకరకాల పాత్రల్లో ఎన్టీఆర్ని చూశాం. అశ్వనీదత్ రామారావుగారిని విభిన్న పాత్రల్లో చూపించారు. 'ఎదురులేని మనిషి' సినిమా తీసి మంచి విజయం సొంతం చేసుకున్నారు. యుగపురుషుడు అనే టైటిల్తో సినిమా తీశారు. నిజంగా ఎన్టీఆర్ యుగపురుషుడు. రాముడు, కృష్ణుడు, రావణాసురుడు, దుర్యోధనుడు ఇలా ఎన్నో పాత్రలు వేశారు. ప్రపంచంలో ఇన్ని రకాల పాత్రలు వేసి మెప్పించిన వారు లేరు. దివిసీమ తుపాను వచ్చినప్పుడు బాధితులను ఆదుకునేందుకు ఎన్టీఆర్ ముందుకొచ్చారు. ఈ తరం వారికి ఎన్టీఆర్ గొప్పతనం గురించి చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది.

ప్రఖ్యాత ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ అంటే జాతీయవాదం, తెలుగు, రసస్ఫూర్తి కలయిక. ఆయనకు దైవ భక్తి ఎంతో ఉంది.. దేశ భక్తి అంతకంటే ఎక్కువే ఉంది. పాలకుడిగా పథకాలకు తెలుగుపేరు పెట్టిన గొప్ప వ్యక్తి. ఎన్టీఆర్ లాంటి నటుడిని మనం చూడలేం. ఎలాంటి పాత్రలోనైనా రసస్ఫూర్తిని ప్రదర్శించిన ఏకైక నటుడు" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అశ్వనీదత్, దర్శకులు వైవీఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం అభినందనీయం

**మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



**విశ్వంభర, కేపీహెచ్‌బీ కాలనీ:** పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో బాలాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్, యశోధ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ..కాలనీలు, బస్తీలలో నివసించే పేద ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సకాలంలో రోగాన్ని గుర్తించడం వల్ల సకాంలో వైద్యసేవలు పొందవచ్చన్నారు. గుర్తించం ఆలస్యమైతే...రోగ తీవ్రత పెరుగుతందని తద్వారా చికిత్స పొందడం ఇబ్బంది అవుతుందన్నారు. మారుతున్న వాతవరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు ముందస్తూ ఆరోగ్య పరీక్షలు చేసుకుని, ఆరోగ్యవంతులుగా జీవించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పగుడాల శిరీష, ముద్దం నర్సింహాయాదవ్, మాజీ కార్పొరేటర్ పి.బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేశ్‌చౌదరి, డాక్టర్ వెంకట్‌రావు, కె.నాగరాజు, రవీందర్‌రెడ్డి, అంజిరెడ్డి, సుభాష్‌గౌడ్, సురేశ్‌గౌడ్, పృధ్విరాజ్, కల్యాణి, శారద తదితరులు పాల్గొన్నారు.

## వ్యవస్థల్ని సక్రమంగా నడిపేది ప్రజా ఉద్యమాలే

- న్యాయ వ్యవస్థా దానిలో భాగమే..
- ప్రజాస్వామ్య, పౌరహక్కుల సంరక్షణ కోసం పోరాటాలే శరణ్యం
- దానికోసం చివరివరకు నిలబడతాం
- మీట్ ది ప్రెస్‌లో మానవ హక్కుల కార్యకర్త ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా



విశ్వంభర, హైదరాబాద్: ప్రజా ఉద్యమాలే వ్యవస్థల్ని సక్రమంగా నడుపగలుగుతాయనీ, దీనిలో న్యాయ వ్యవస్థకు ఎలాంటి మినహాయింపు లేదని మానవ హక్కుల కార్యకర్త, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య, పౌరహక్కుల సంరక్షణ కోసం పోరాటాలే శరణ్యమనీ, దానికోసం చివరి వరకు నిలబడతామని తేల్చిచెప్పారు. తెలంగాణ స్టేట్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో శుక్రవారంనాడిక్కడి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ సాయిబాబాతో మీట్ ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సాయిబాబా సమాధానాలు చెప్పారు. తొమ్మిదేండ్ల నాగపూర్ జైలు జీవిత కష్టాలనూ పంచుకున్నారు. తన తల్లి చనిపోతే అంత్యక్రియలకు కూడా తనకు పెరోల్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కోర్టుకు మరో కోర్టుకు మధ్య విచారణల్లో చాలా వ్యత్యాసాలున్నాయనీ, వ్యక్తుల్ని బట్టి విచారణలు జరుగుతున్నాయేమో అనే సందేహాలు తనకు అనేకసార్లు వచ్చాయని చెప్పారు. ఇదే విషయాన్ని జైలులోని నిరక్షర ఖైదీలు తనవద్ద ప్రస్తావిస్తే ఆశ్చర్యపోయానన్నారు.

ఫలానా బెంచ్ అయితే బెయిల్ రాదనీ, వాదనలు కూడా అనవసరమని తనకు సలహాలు సూచనలు చేశారని చెప్పారు. తాను జైలులో ఉన్న సమయంలో ఘోరమైన నేరాలు చేసిన నేరస్తులకు స్వల్ప వ్యవధిలోనే బెయిల్లు రావడం తాను కళ్లారా చూసాననీ, మానవ హక్కుల కోసం గళం ఎత్తితే తొమ్మిదేండ్లకు పైగా జైలులో పెట్టి నిర్బంధం విధించారని అన్నారు. వ్యవస్థలన్నీ సక్రమంగా నడవాలంటే ప్రజా ఉద్యమాలే శరణ్యమనీ, దానిలో న్యాయవ్యవస్థకు మినహాయింపు ఏమీ లేదన్నారు. తన తరఫున వాదించిన న్యాయవాది హనీబాబుపై కూడా అనేక నిర్బంధ సెక్షన్ల కింద కేసులు పెట్టారని గుర్తుచేశారు. తనలాంటి చదువుకున్న, ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సమాజంలో హక్కుల కోసం గళమెత్తే వ్యక్తిని నిర్బంధంలో ఉంచితే, సామాన్యులు భయంతో బిక్కచచ్చి, మౌనంగా ఉండిపోతారని రాజ్యం భావించిందనీ, కానీ అందుకు భిన్నంగా కొత్త గొంతులు పుట్టుకొచ్చాయని వివరించారు. సమాజంలో మార్పునకు సాహిత్యం దోహదపడుతుందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. హక్కులు ఎప్పుడూ స్థిరంగా ఉండవనీ, కొత్త హక్కులు పుట్టుకొస్తూనే ఉంటాయని విశ్లేషించారు. ప్రజాస్వామ్య, ఆదివాసీ హక్కుల సాధన కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని చెప్పారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పాక్షిక విజయమేననీ, ప్రజాస్వామ్య తెలంగాణ సాధనే అంతిమ విజయం అని స్పష్టం చేశారు. దేశంలో వివిధ ప్రాజెక్టులు నిర్మించేటప్పుడు దాదాపు రెండు కోట్ల మంది ఆదివాసీ, గిరిజనులు అదృశ్యం అయ్యారనీ, వారికి సంబంధించిన ఎలాంటి సమాచారం ప్రభుత్వం వద్ద లేదని తెలిపారు. కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు చెప్తున్న అభివృద్ధి ప్రకృతి విధ్వంసంతో కూడుకున్నదనీ, అడవులు, కొండల్ని తవ్వేసి, అక్కడ సంపదను కొల్లగొట్టడమే వారు అభివృద్ధి అని చెప్తున్నారని వివరించారు. కానీ, ఆదివాసీలకు అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందనీ, అది పాలకులకు అర్థం కావట్లేదని చెప్పారు. దేశంలో ఖనిజ సంపద దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసీలు స్వచ్ఛందంగా పోరాటాలు చేస్తున్నారనీ, వాటిని విద్యావేత్తలు, పౌరసమాజం నుంచి ఆశించిన మద్దతు లభించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కులవ్యవస్థను నిర్మూలించాలనుకొనేవారి సంఖ్య ఎక్కువగానే ఉందనీ, వారందరినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాల్లోనే లోపాలు ఉన్నాయని విశ్లేషించారు.

కేవలం ప్రభుత్వాలను మార్చడం వల్ల సమాజంలో మార్పు రాదనీ, ప్రజాఉద్యమాలు వస్తేనే సంపద పంపిణీకి సమాన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తెలంగాణ ప్రజల నుంచి తాను సామాజిక విజ్ఞానం నేర్చుకున్నాననీ, ప్రజాసామ్య పరిరక్షణ కోసం మానవ హక్కుల కార్యకర్తగానే కొనసాగుతానని అన్నారు. అయితే దీన్ని రాజ్యం, వ్యవస్థలు భిన్న కోణాల్లో విశ్లేషించి, వక్రీకరించుకుంటే తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రొఫెసర్ హరగోపాల్ అధ్యక్షత వహించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి వీ యాదగిరి వందన సమర్పణ చేశారు.



## మద్దతు ధరకే పంటల కొనుగోలు

**కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కీలక ప్రకటన..**

**ఢిల్లీ:** రాష్ట్ర మార్కెట్‌లలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదని.. పంటకు సరైన ధర లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆవేదన వ్యక్తంచేశారు. అలాంటి రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. కేంద్రం పప్పుధాన్యాలు, పొద్దుతిరుగుడు పంటలను మద్దతు ధర పథకం కింద కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. మద్దతు ధర పథకం కింద పెసలు క్వింటాల్‌కు రూ. 8682 (ఎంఎస్‌పి) చొప్పున కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందన్నారు. కర్ణాటక రాష్ట్ర మార్కెట్‌లో పెసలు, పొద్దుతిరుగుడు ధర పడిపోయిందని.. పండించిన పంటలకు సరైన ధర లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వారిని ఆదుకునేందుకు కేంద్రం సాయం అందిస్తుందని సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ వేదికగా షేర్ చేశారు.

ఎమ్ఎస్‌పి కింద పంటను కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. క్వింటాల్‌కు రూ.8682 చొప్పున 2215 మెట్రిక్‌టన్నుల పెసలును కొనుగోలు చేసేందుకు కేంద్రం అనుమతిచ్చిందని ప్రహ్లాద్ జోషి తెలిపారు. అదేవిధంగా 13,210 మెట్రిక్ టన్నుల పొద్దుతిరుగుడు పంటను మద్దతు ధర పథకం కింద కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపిందన్నారు.కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి లేఖ అందిన వెంటనే.. తాను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చవాన్‌ను కలుసుకుని రాష్ట్రంలో పెసలు, పొద్దుతిరుగుడు పంటలను కొనుగోలు చేయాలని అభ్యర్థించినట్లు వెల్లడించారు. వెంటనే కేంద్రమంత్రి అధికారులతో చర్చించి వెంటనే అనుమతి ఇవ్వాలని సూచించారన్నారు. దీని ప్రకారం, కేంద్ర ప్రభుత్వం లేఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇచ్చిందని తెలిపారు.

## విద్యార్థినులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

## పోక్సో చట్టం కింద కేసు నమోదు

**విశ్వంభర, కంకిపాడు:** కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలంలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈడుపుగల్లు గ్రామంలోని ఓ పాఠశాలలో పనిచేసే మండవ వెంకట శ్రీనివాస్ గత కొంతకాలంగా విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని బాధిత విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు కంకిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ మురళీ కృష్ణ. ఎస్ఐ సందీప్ లు విచారణ జరిపి నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

## కూల్చివేతలు ఇలాగే కొనసాగాలి

**- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. మాదాపూర్లో ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేసిన ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. "పేదలు గజం స్థలం ఆక్రమిస్తేనే నానా రాద్ధాంతం చేస్తారు. నాగార్జున బిగ్ బాస్కే బాస్. చెరువుని ఆక్రమించుకుని కబ్జాలు చేశారు. ఆయనేం సత్యహరిశ్చంద్రుడు కాదు. ఎన్ కన్వెన్షన్ మీద రోజుకు రూ. లక్షల ఆదాయం వస్తోంది. చాలా డబ్బులు ఉన్నాయి.. ఆయనకు ఇదంతా లెక్క కాదు. సినిమా డైలాగ్లు పనికిరావు. ఒక్కడే కూర్చుని వందమందిని కొట్టేస్తే కుదరదు. రోజుకు ఎంత సంపాదించాడో కక్కించాలి. మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెరువులో కాలేజీలు కట్టారు. వారంతా కబ్జాకోరులు. ఫిరంగి నాలాను కబ్జా చేశారు. చెరువులు, నాలాలు కబ్జా అయితే ఊర్లు మునిగిపోతాయి. ఆరంభ శూరత్వం కాదు.. ఎక్కడ కబ్జా జరిగినా ఖాళీ చేయించాలి. పెద్దలు కబ్జాలు చేసినా, దొంగపట్టాలు పొందినా వారి ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. రాజకీయ కక్ష సాధింపు అవసరం లేదు. ఒకే పార్టీ, ఒకే వర్గం మీద కక్ష సాధింపు మంచిది కాదు. ఎవరు ఆక్రమించినా వారిపై హైడ్రా కూల్చివేతలు చేపట్టాలి. ఈ కూల్చివేతలు ఇలాగే కొనసాగాలి. ఎంఐఎం వారివి కూడా తొలగించాలి. అక్రమ నిర్మాణాలకు ఎవరు అనుమతిచ్చారో వారిపై కూడా చర్యలు తీసుకోవాలి. మేం మొదటి నుంచి భూ సమస్యలపై పోరాటం చేస్తూనే ఉన్నాం" అని నారాయణ అన్నారు.





### ఒక్క సంవత్సరంలోనే

# 8 మంది స్టార్ ప్లేయర్ల రిటైర్మెంట్

**విశ్వంభర, క్రీడావిభాగం:** టీమిండియా ఆటగాడు శిఖర్ ధావన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గత కొంతకాలంగా ఆటకు దూరంగా ఉన్న ఈ డ్యాషింగ్ ప్లేయర్ అంతర్జాతీయ క్రికెట్ తో పాటు దేశవాళీ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు ఆదివారం (ఆగస్టు 25) తెలిపాడు. కాగా శిఖర్ ధావన్ తో 2024లో రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా ఆటగాళ్ల సంఖ్య 8కి చేరింది. వీరిలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజాలు టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు మాత్రమే వీడ్కోలు పలికారు. మిగతా ఐదుగురు అన్ని రకాల క్రికెట్ ఫార్మాట్లకు గుడ్ బై చెప్పారు. టీమిండియా లెఫ్టార్మ్ ఓపెనర్ శిఖర్ ధావన్ ఆగస్టు 24న రిటైర్మెంట్ ప్రకటించాడు. సోషల్ మీడియా ద్వారా మూడు రకాల క్రికెట్ కు గుడ్ బై చెబుతున్నట్లు శిఖర్ ధావన్ తెలిపాడు. టీ20 ప్రపంచకప్ ఫైనల్ తర్వాత విరాట్ కోహ్లీ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అయితే అతను టెస్టు, వన్డే క్రికెట్‌లో కొనసాగనున్నాడు. టీ20 ప్రపంచకప్ ముగిసిన తర్వాత భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం వన్డే, టెస్టు జట్టులో కొనసాగుతున్న హిట్‌మన్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ తర్వాత అన్ని రకాల క్రికెట్‌లకు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. వికెట్ కీపర్ అండ్ బ్యాటర్ దినేష్ కార్తీక్ కూడా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2004లో భారత్ తరఫున అరంగేట్రం చేసి అంతర్జాతీయ కెరీర్‌ను ప్రారంభించిన డీకే మూడు ఫార్మాట్ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఐపీఎల్‌కు గుడ్‌బై కూడా చెప్పాడు. భారత్ తరఫున 73 వన్డే మ్యాచ్‌లు ఆడిన కేదార్ జాదవ్ అంతర్జాతీయ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలికాడు. దీంతో పదేళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు తెరపడింది. భారత్ తరఫున 3 వన్డేలు ఆడిన ఎడమచేతి వాటం బ్యాటర్ సౌరభ్ తివారీ కూడా ఈ ఏడాది అన్ని రకాల క్రికెట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. తద్వారా తన 17 ఏళ్ల క్రికెట్ కెరీర్‌కు స్వస్తి చెప్పాడీ ప్లేయర్. టీమిండియా పేసర్ వరోన్ ఆరోన్ కూడా అన్ని రకాల క్రికెట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆరోన్ భారత్ తరఫున 9 వన్డేలు, 9 టెస్టులు ఆడాడు. టీ20 ప్రపంచకప్ తర్వాత టీమ్ ఇండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా కూడా టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అయితే జడేజా టెస్టు, వన్డే క్రికెట్‌లో కొనసాగుతున్నాడు.






# పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించి చరిత్ర సృష్టించిన బంగ్లా

### తొలి టెస్ట్‌లో బంగ్లా సూపర్ విక్టరీ

**విశ్వంభ ర, క్రీడావిభాగం:** పాకిస్థాన్‌కు బంగ్లాదేశ్ గట్టి షాకిచ్చింది. టెస్టుల్లో తొలిసారి పాక్‌ను ఓడించి చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. రావల్పిండి వేదికగా జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ 10 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. అంతేకాకుండా సొంతగడ్డపై పాకిస్థాన్‌ను పది వికెట్ల తేడాతో ఓడించిన తొలి జట్టుగానూ బంగ్లాదేశ్ రికార్డు సృష్టించింది. ఓవర్‌నైట్ స్కోరు 23/1తో ఐదో రోజు, ఆదివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాకిస్థాన్ 146 పరుగులకే (55.5 ఓవర్లలో) ఆలౌటైంది. 30 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 6.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఇక తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 448/6 వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బంగ్లాదేశ్ బ్యాటుతో అదరగొట్టి 565 పరుగులకు ఆలౌటైంది.

రెండో ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లలో ఓపెనర్ అబ్దుల్లా షఫిక్ (37), వికెట్‌కీపర్ మహ్మద్ రిజ్వాన్ (51) మాత్రమే రాణించారు. బాబర్ అజామ్ (22), షాన్ మసూద్ (14) పరుగులు ఇచ్చారు. ఆయూబ్ (1), షౌద్ షకీల్ (0), ఆఘా సల్మాన్ (0) వచ్చిన వెంటనే పెవిలియన్‌కు వెళ్లిపోయారు. మెహదీ హసన్ మిరాజ్ (4/21), షకీబ్ అల్ హసన్ (3/44) పాక్‌ను వికెట్లతో దెబ్బకొట్టారు. షోరిపుల్ ఇస్లామ్, హసన్ మహమూద్, నిహిద్ రాణా చెరో వికెట్ పడగొట్టారు.

**తొలి ఇన్నింగ్స్‌లో..**

ఇక తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ భారీ స్కోరు చేయడంలో ముష్ఫికర్ రహీమ్ (191; 341 బంతుల్లో) కీలకపాత్ర పోషించాడు. షాద్మాన్ ఇస్లాం 93 పరుగులు చేసి, త్రుటిలో సెంచరీని మిస్ చేసుకున్నాడు. మోమినుల్ హక్ (50), లిటన్ దాస్ (56), మెహదీ హసన్ (77) అర్ధ శతకాలు బాదారు. అంతకుముందు మొదటి ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లు సౌద్ షకీల్ (141), మహ్మద్ రిజ్వాన్ (171) భారీ శతకాలు సాధించారు. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇక ఆగస్టు 30 నుంచి రావల్పిండి వేదికగానే రెండో టెస్టు ప్రారంభం కానుంది.

**అదరగొట్టి ముష్ఫికర్...**

191 పరుగుల భారీ ఇన్నింగ్స్‌తో విదేశీ గడ్డపై బంగ్లాదేశ్ తరఫున అత్యధిక టెస్టు సెంచరీలు (5) సాధించిన బ్యాటర్‌గా, విదేశీ గడ్డపై అత్యధిక టెస్టు పరుగులు సాధించిన బంగ్లా బ్యాటర్‌గా ముష్ఫికర్ రహీమ్ నిలిచాడు. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 341 బంతులు ఎదుర్కొన్న అతడు 22 ఫోర్లు బాదాడు. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. వికెట్ కీపర్-బ్యాటర్ లిట్టన్ దాస్‌తో 114 పరుగులు, మెహిదీతో కలిసి ఏడవ వికెట్‌కు 196 పరుగుల భాగస్వామ్యాలను ముష్ఫికర్ నెలకొల్పాడు. స్వదేశంలో బంగ్లాదేశ్ చేతిలో పాకిస్థాన్ ఓడిపోవడం అవమానకరమంటూ ఆ దేశ క్రికెట్ ఫ్యాన్స్ విమర్శలు గుప్పిస్తున్నారు.

# కేఎల్ రాహుల్ రిటైర్మెంట్?



**విశ్వంభర, క్రీడావిభాగం:** భారత స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ సొగసైన ఆటకు కేరాఫ్. టీమిండియా తరఫున ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్‌స్‌లు ఆడిన రాహుల్ దులీప్ ట్రోఫీకి సన్నద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలో అతడి గురించిన ఓ న్యూస్ వైరల్ అవుతోంది. రాహుల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ అందరినీ షాక్‌కు గురి చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ స్టార్ ప్లేయర్ సిగ్నేచర్ స్టయిల్ సెలబ్రేషన్ ఫొటోతో పాటు సుదీర్ఘ పోస్ట్ ఉంది. దాంతో, ఆ పోస్ట్ చూసిన అభిమానులంతా షాకయ్యారు.

అయితే తన రిటైర్మెంట్ పై వస్తున్న వార్తలన్నీ ఫేక్ అని కేఎల్ రాహుల్ కొట్టి పారేశాడు. ఎవరు ఇలాంటివి షేర్ చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నాడు. నిఖిల్ కామత్ అనే యూట్యూబర్‌తో మాట్లాడిన రాహుల్.. తన రిటైర్మెంట్ వార్తలకు ఫుల్ స్టాప్ పెట్టాడు. అసలే శిఖర్ ధావన్ రిటైర్మెంట్ పై జనం షాక్ నుంచి కోలుకోలేదు. అలాంటిది ఒకేరోజు ఇద్దరు ప్రముఖ క్రికెటర్లు రిటైర్మెంట్ అనేసరికి అభిమానుల గుండెలు పగిలాయి. మొత్తానికి కేఎల్ రాహుల్ స్పందించాడు. అసలు విషయం చెప్పాడు. నేనేమీ రిటైర్మెంట్ ప్రకటించలేదు, వచ్చిన వార్తలన్నీ ఫేక్ అని కొట్టి పారేశాడు. ఈ సందర్భంగా ఒక సంఘటన గుర్తు చేసుకున్నాడు. ఈ రిటైర్మెంట్ కూడా అలాంటి భయాన్నే కల్పించిదని అన్నాడు. ఇంతకీ ఏమిటా సంఘటన అంటే.. 2019లో కాఫీ విత్ కరణ్ ప్రోగ్రాంకి హార్దిక్ పాండ్యాతో కలిసి రాహుల్ కూడా వెళ్లాడు.

తన జీవితంలో ఎప్పుడూ సస్పెండ్ కాలేదు. అంటే స్కూల్, కాలేజ్ ఇలా ఎక్కడా కూడా కానీ బీసీసీఐ సస్పెండ్ చేసేసరికి తట్టుకోలేకపోయాను అని కేఎల్ రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఇంటర్వ్యూ వల్ల భారత జట్టులో స్థానం కోల్పోయానని అప్పుడు మానసికంగా ఎంతో ఇబ్బంది పడ్డానని తెలిపాడు. మళ్లీ ఆ రోజులు ఇప్పుడు గుర్తొచ్చాయని అన్నాడు.

అయితే.. యోగా లాంటివి సాధన చేశాను. అలా నెగిటివ్ ను పాజిటివ్ గా తీసుకోవడం అలవాటు చేసుకున్నాను. అప్పటి నుంచి వివాదాలకు చాలా దూరంగా ఉంటున్నాను. కానీ ట్రోలింగ్ లు మాత్రం ఆగలేదని అన్నాడు. త్వరలో జరగబోయే దులీప్ ట్రోఫీలో పరుగులు చేసి, తనేమిటో నిరూపించుకోవాలని నెట్స్ లో కఠిన సాధన చేస్తున్నాడు.

# పాంటింగ్ ప్లేస్‌లో యువరాజ్ సింగ్

**విశ్వంభర, క్రీడావిభాగం:** ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు అన్ని ఫ్రాంచైజీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. ప్లేయర్లతో పాటు తమ సపోర్టింగ్ స్టాఫ్‌లోనూ భారీ మార్పులు చేపడుతున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఇప్పటికే తమ జట్టు హెడ్ కోచ్ రికీ పాంటింగ్ పై వేటు వేసింది. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా కప్పు కొట్టని ఢిల్లీ ఈ సారి ఎలాగైనా ఐపీఎల్ విజేతగా నిలవాలని ఆరాటపడుతోంది. అటు గుజరాత్ టైటాన్స్ జట్టు సైతం తమ హెడ్ కోచ్ ఆశిష్ నెహ్రాను తప్పించనుందనే వార్తలు వస్తున్నాయి. అతడి స్థానంలో టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ను తీసుకోనున్నారని టాక్ కొన్నాళ్లుగా నడుస్తోంది. అయితే.. తాజాగా స్పోర్ట్‌స్టార్ వెల్లడించిన ఓ కథనం మేరకు యువీ ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా నియమితుడు కానున్నాడని పేర్కొంది. ఇందుకు సంబంధించి యువీతో డీసీ యాజమాన్యం చర్చలు మొదలుపెట్టిందని చెప్పింది. అయితే.. ఇంకా ఫైనల్ కాలేదని పేర్కొంది. కాగా.. దీనిపై అటు యువరాజ్ సింగ్ నుంచి గానీ, ఇటు ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కాగా.. యువరాజ్ సింగ్ కు ఇప్పటి వరకు హెడ్ కోచ్‌గా పని చేసిన



అనుభవం లేదు. అయినప్పటికి యువ క్రికెటర్లను తీర్చిదిద్దడంలో యువీ కీలక పాత్ర పోషించాడు. శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ వంటి వారు యువీ వద్ద శిక్షణ పొందిన వారే కావడం గమనార్హం. ఐపీఎల్ 2025 ముందు మెగా వేలం జరగనుంది. ఈ ఏడాది చివరిలో వేలాన్ని నిర్వహించేందుకు బీసీసీఐ సన్నాహకాలు చేస్తోంది. ఇందుకోసం ఇటీవల ముంబైలోని ప్రధాన కార్యాలయంలో అన్ని ఫ్రాంచైజీల యాజమానులతో బీసీసీఐ అధికారులు సమావేశం అయ్యారు. రిటెన్షన్ పాలసీ, ఇంపాక్ట్ రూల్ వంటి వాటిపై చర్చించినట్లుగా తెలుస్తోంది.

# అతను నా పనిని ఈజీ చేసేవాడు

### రోహిత్ శర్మ ఎమోషనల్ పోస్ట్

**విశ్వంభర, క్రీడావిభాగం:** అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన శిఖర్ ధావన్ భారత్‌కు ఆడిన గొప్ప ఓపెనర్లలో ఒకడు. మైదానంలో తను హుషారుతనంతో సహచరులను నవ్వించే గబ్బర్ అంటే అందరికీ అభిమానమే. అందుకనే అతడి రిటైర్మెంట్ ప్రకటన రాగానే అంతా తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు. తాజాగా భారత కెప్టెన్ రోహిత్ శర్మ వెటరన్ ధావన్‌తో తన ప్రత్యేక బంధాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించాడు. 'గదులు పంచుకోవడంతో పాటు మైదానంలో జీవితకాల జ్ఞాపకాలను పంచుకున్నాం. అవతలి ఎండ్‌లో ఉండి నువ్వు నా పనిని ప్రతిసారి తేలిక చేసేవాడివి. నువ్వొక అల్టిమేట్ జాట్' అని హిట్‌మ్యాన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు. ఐసీసీ టోర్నీల హీరోగా పేరొందిన ధావన్ టీమిండియాకు దొరికిన ఓ ఆణిముత్యం. తన దూకుడైన ఆటతో గబ్బర్ విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడుతూ ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేవాడు. అందుకే భారత జట్టుకు ఆడిన అత్యుత్తమ ఓపెనర్లలో ఒకడిగా ధావన్ పేరు సంపాదించాడు. రోహిత్ శర్మతో కలిసి ఈ లెఫ్ట్ హ్యాండర్ 2013 నుంచి 2022 వరకూ ఇన్నింగ్స్ ఆరంభించాడు.




వీళ్లిద్దరూ 115 ఇన్నింగ్స్‌లో 5,148 పరుగులు సాధించారు. దాంతో, టీమిండియా తరఫున అత్యధిక రన్స్ చేసిన రెండో ఓపెనింగ్ జోడీగా రికార్డు నెలకొల్పారు. లెజెండరీ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, సౌరభ్ గంగూలీలు వీళ్లకంటే ముందున్నారు. మైదానంలో తన సూపర్ ఆటతో అదరగొట్టిన ధావన్ వైవాహిక జీవితంలో మాత్రం ఫ్లాప్ అయ్యాడు. అతడు అయేషా ముఖర్జీను 2012 అక్టోబర్‌లో పెండ్లి చేసుకున్నాడు. అప్పటికే ఆమెకు మొదటి భర్తతో ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2021లో అయేషా సోషల్ మీడియా పోస్ట్ ద్వారా ధావన్‌తో విడాకుల విషయాన్ని వెల్లడించింది. ఈమధ్యే ఫ్యామిలీ కోర్టు ఇద్దరికీ విడాకులు మంజూరు చేసింది. ప్రస్తుతం అయేషా ఆస్ట్రేలియాలో ఉంటోంది. జొరావర్ కూడా ఆమెతో పాటు అక్కడే ఉంటున్నాడు.




# జియోకు పోటీగా బీఎస్ఎన్ఎల్

**విశ్వంభర, బిజినెస్:** ఇటీవల కాలంలో రిలయన్స్ జియో టారిఫ్ ధరలు విపరీతంగా పెరిగాయి. దాంతో చాలామంది యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాంతో ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎ-స్ఎన్ఎల్ వైపు చాలామంది యూజర్లు మొగ్గుచూపుతున్నారు. ఇదే క్రమంలో బీఎస్ఎన్ఎల్ సైతం తక్కువ ధరకే వివిధ రకాల టారిఫ్‌లను అందుబాటులోకి తీసుకువస్తున్నది. జియోతో పాటు పలు టెలికం సంస్థల యూజర్లను తన వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు ప్లాన్స్‌ను ప్రకటించిన బీఎస్ఎన్ఎల్ తాజాగా మరో జియో తరహాలోనే మరో ప్యాక్‌ని తీసుకువచ్చింది. అదే బీఎస్ఎన్ఎల్ 336 ప్లాన్. ఇది రూ.1499 లాంగ్ వ్యాలిడిటీ రీచార్జ్ ప్లాన్. ఇందులో 366 రోజులు అన్‌లిమిటెడ్ కాలింగ్ ఉంటుంది. అదనంగా ఎంటీఎన్ఎల్‌తో ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక 24 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా పొందేందుకు అవకాశం ఉంటుంది. అదే జియో 336 ప్లాన్‌ని రూ.1899తో రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. 366 రోజుల ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ ఫ్రీ కాలింగ్ అందిస్తుంది. 24 జీబీ డేటా, 3600 ఎస్ఎంఎస్‌లు, జియోటీవీ, జియో సినిమా, జియో క్లౌడ్ అదనంగా వస్తాయి. ఇక రూ.448 ప్రిపెయిడ్ ప్లాన్‌లో ప్రతిరోజు 2జీబీ హైస్పీడ్ డేటా 28 రోజులు, అన్‌లిమిటెడ్ కాలింగ్ డైలీ లిమిట్, వంద ఎస్ఎంఎస్ వస్తాయి. అదనంగా సోనీలైవ్, జీ5, జియో సినిమా ప్రీమియం, లయన్స్ గేట్ ప్లే, డిస్కవరీ ప్లస్, సన్ నెక్ట్స్, కంచ్చ లన్నక, ప్లానెట్ మరాఠి, చౌపాల్, హోయ్‌చాయ్, ఫ్యాన్‌కోడ్, జియో టీవీ, జియో క్లౌడ్ సర్వీసులు అందుతాయి. రూ. 449 ప్రిపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ ద్వారా 3 జీబీ హై స్పీడ్ డేటా 28 రోజులు, అన్‌లిమిటెడ్ కాలింగ్, వంద ఎస్ఎంఎస్‌లు.. అలాగే జియో టీవీ, జియో సినిమా, జియో క్లౌడ్ సబ్‌స్క్రిప్షన్ సైతం వస్తాయి.

# యూపీఐతో కొత్త స్కాం

**విశ్వంభర, బిజినెస్:** ప్రతి నెలా అన్ని బిల్లులు, పేమెంట్ల తేదీలను గుర్తుంచుకోవడం కష్టమే. కొన్నిసార్లు గడువు తేదీని మరిచిపోతుంటాం. సకాలంలో పేమెంట్లు చేయకపోతే.. అదనపు రుసుములను చెల్లించాల్సి వస్తుంది. వీటన్నింటిని చెక్ పెట్టేందుకు అన్ని బ్యాంకింగ్ యాప్‌లు, డిజిటల్ పేమెంట్ యాప్స్.. ఆటో పే ఆప్షన్ అందిస్తున్నాయి. ఈ ఫీచర్‌ను ఒక్కసారి సెట్ చేసుకుంటే ప్రతిసారి మ్యానువల్‌గా పే మెంట్స్ చేయనవసరం లేదు. ఆటోమెటిక్‌గా మనం సెట్ చేసుకున్న సమయానికి పేమెంట్స్ జరిగిపోతాయి. ప్రస్తుతం చాలా మంది ఈ ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకుని ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్లు మరో తరహా మోసానికి తెర తీశారు. ఆటోపే ఆప్షన్ ఉపయోగించి అకౌంట్లను ఖాళీ చేస్తున్నారు. ఒక్కసారి ఆ లింక్ క్లిక్ చేశామా.. ఇక అంతే సంగతులు! క్షణాల్లోనే ఖాతా ఖాళీ అయిపోతుంది. ఇంతకీ ఈ కొత్తరకం స్కామ్ ఎలా జరుగుతోంది ? దీని బారిన పడకూడదంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

**స్కామ్ ఎలా చేస్తారంటే?:** చాలా మంది ఓటీటీలు, డిజిటల్ చెల్లింపుల యాప్‌లు, ఇ-కామర్స్ వెబ్‌సైట్లకు సంబంధించి.. నెలనెలా చెల్లింపుల కోసం ఆటోపే ఆప్షన్




ఉపయోగిస్తుంటారు. అయితే, ఇలాంటివారికి ఈ నెల ఆటోపే ఆప్షన్ ద్వారా డబ్బులు చెల్లించండని మోసగాళ్లు తప్పుడు మెసేజ్‌లను పంపిస్తున్నారు. ఉదాహరణకు మీరు ఒక ప్రముఖ ఓటీటీ యాప్‌ను వాడుతున్నారనుకుందాం. దానికి ప్రతినెల బిల్లును ఆటోపే ద్వారా చెల్లిస్తున్నారు. మీకు మోసగాళ్లు బిల్లు చెల్లించమని సందేశం పంపిస్తుంటారు. ఇప్పటికే మీరు ఆటోపే చేస్తున్నారు కాబట్టి, అనుమానం రాదు. నిజమే అనుకొని, దాన్ని ఆమోదిస్తారు. అంతే ఆ అమౌంట్ మొత్తం మోసగాడి చేతికి వెళ్లిపోతుంది.

**ఇప్పుడే ఎందుకు?:** సైబర్ మోసాలను అరికట్టేందుకు డిజిటల్ చెల్లింపు సేవలను అందించే సంస్థలతో పాటు, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. కానీ, సైబర్ నేరగాళ్లు టెక్నాలజీ సహాయంతో రోజుకో కొత్త తరహా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇటీవల కాలంలో చాలా మంది ఆటోపే ఆప్షన్ వినియోగించడంతో ఈ తరహా మోసాలు వెలుగు చూస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

**మనమే అవకాశం ఇస్తున్నాం!:** ఎక్కువ మంది తమ ఫోన్ నంబర్లను యూపీఐ ఐడీలుగా ఉంచుకుంటున్నారు. అయితే ఇలాంటి వారందరిని చాలా సులభంగా మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటారని.. తద్వారా మన ఫోన్ నంబరున్న యూపీఐ ఐడీకి వివిధ రకాల మెసేజ్ లు పంపిస్తుంటారని చెబుతున్నారు. ఇందులో తెలియకుండా ఏ లింక్ క్లిక్ చేసినా.. అంతే సంగతులు.

**ఇలా సురక్షితం**

నివేదికల ప్రకారం.. ఎక్కువ మంది సీనియర్ సిటిజన్లే ఆటోపే మోసాల బారిన పడుతున్నారు. కాబట్టి, పెద్దలు డిజిటల్ చెల్లింపుల యాప్‌లను వాడేటప్పుడు అలర్ట్‌గా ఉండాలని సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లో పేమెంట్ చేస్తున్నప్పుడు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని చెల్లింపులు చేయాలని వివరిస్తున్నారు. మీ ప్రైమరీ బ్యాంకు ఖాతాకు యూ పీ ఐని లింక్ చేయకపోవడం మంచిది. పేమెంట్స్ కోసం తక్కువ డబ్బులు నిల్వ ఉండే అకౌంట్ వాడటం మంచిదని చెబుతున్నారు. తక్కువ మొత్తంతో వ్యాలెట్లను ఉపయోగించడం వల్ల ఈ మోసాల నుంచి కాపాడుకోవచ్చని.. యూపీఐ ఆటోపే ఆప్షన్ వచ్చినప్పుడు, దానికి స్పందించక పోవడమే మంచిదంటున్నారు.

ముఖ్యం గా యూపీఐ ఐడీలుగా మొబైల్ నంబర్లను ఉపయోగించడం మానేయాలి. కొత్త యూపీఐ ఐడీలను క్రియేట్ చేసుకోవాలి. ఆటోపే ఆప్షన్ రాకుండా అవసరమైన సెట్టింగులను మార్చుకోవాలి. నాలుగంకెల యూపీఐ పిన్ బదులు ఆరు అంకెలను ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



## తండ్రి అయిన పాప్ స్టార్ జస్టిన్ బీబర్

**విశ్వంభర, సినిమా :** అమెరికాకు చెందిన ప్రఖ్యాత పాప్ సింగర్ జస్టిన్ బీబర్ తండ్రి అయ్యాడు. ఆయన భార్య హైలీ ఈ ఉదయం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని బీబర్ ఇన్స్టాగ్రామ్ వేదికగా తెలియజేశారు. వెల్కమ్ హోమ్ అంటూ చిన్నారి పాదాల ఫొటోను షేర్ చేశారు. చిన్నారికి జాక్ బ్లూస్ బీబర్ అని పేరు పెట్టారు. తాము తల్లిదండ్రులం కాబోతున్నట్టు ఈ ఏడాది ప్రారంభంలోనే బీజర్ దంపతులు ప్రకటించారు. 2018లో బీబర్, హైలీ న్యూయార్క్ లోని కోర్ట్ హౌస్ లో తొలుత పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత దక్షిణ కరోలినాలోని బ్లఫ్టన్ లో తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో మరోసారి వివాహం చేసుకున్నారు.



## ప్రియుడితో కలిసి రజినీకాంత్ ఇంటికి వెళ్లిన మేఘా ఆకాష్

**విశ్వంభర, సినిమా :** మేఘా ఆకాశ్.. చెన్నైకు చెందిన ఈ బ్యూటీ టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచయమే. 2017లో వచ్చిన నితిన్ 'లై' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. అయితే చెన్నై భామ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కనుంది. ఇప్పటికే పెళ్లి పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఇటీవల తన ప్రియుడు సాయి విష్ణుతో నిశ్చితార్థం చేసుకుంది. తాజాగా కాబోయే భర్త, కుటుంబ సభ్యులతో కలిసి సూపర్ స్టార్ రజినీకాంత్ ఇంటికి వెళ్లి ఆయన ఆశీర్వాదం తీసుకుంది. తన పెళ్లికి రావాలని కోరుతూ తలైవాకు ఆహ్వానం ఇచ్చింది. ఇక మేఘా ఆకాశ్‌కు రజినీకాంత్ అంటే చాలా ఇష్టమని పలు ఇంటర్వ్యూలలో చెప్పింది. తాజాగా కుటుంబ సభ్యులతో వెళ్లి మరీ రజినీకాంత్‌ను కలిసింది. అందుకు సంబంధించిన ఫొటోలను కూడా షేర్ చేసింది. 'అభిమానంతో తలైవాను ఆహ్వానించాం' అంటూ ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసింది. అయితే, ఫొటోలో ఎక్కడ శుభలేఖ కనిపించలేదు. కానీ పెళ్లికి



ఆహ్వానించేందుకే వెళ్లినట్లు తెలుస్తోంది.ఇక మేఘా ఆకాశ్-సాయి విష్ణు గత ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నారు. సాయి విష్ణు ఓ పొలిటీషియన్ కొడుకు అని సమచారం. అయితే మేఘా పెళ్లి గురించి పలుమార్లు రూమర్స్ కూడా వచ్చాయి. కానీ, ఈసారి వాటిన్నింటికీ చెక్ పెడుతూ తన ప్రియుడి సాయి విష్ణును నిశ్చితార్థం చేసుకుంది. కేరళలో జరిగిన ఈ కార్యక్రమం ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కోస్టార్లు, ఇండస్ట్రీ ప్రముఖులు, సన్నిహితులు, ఫాలోవర్లు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

తాజాగా విజయ్ ఆంటోనీ నంటిన 'తుఫాన్'(తెలుగు) సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తెలుగులో చివరిగా 'మను చరిత్ర' సినిమాలో నటిచింది. కాగా, 'లై', 'చల్ మోహన రంగ', 'గుర్తుందా శీతాకాలం', 'రావణాసుర' వంటి సినిమాల్లో నటించిన మేఘకు హీరోయిన్‌గా పెద్ద గుర్తింపు రాలేదు. 'రావణాసుర'లో చేసిన నెగటివ్ క్యారెక్టర్ కూడా మేఘ కెరీర్‌కు పెద్దగా ఉపయోగపడలేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేతిలో రెండు తెలుగు సినిమాలు ఉన్నాయి. 'వికటకవి', 'సహకుటుంబం' సినిమాల్లో నటిస్తోంది. మరి వివాహం తర్వాత కొనసాగిస్తుందో లేదో చూడాలి.

## ఆదుకోవడానికి ఆలోచించని హీరో బాలకృష్ణ
### నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్

**విశ్వంభర, సినిమా :** శివలెంక కృష్ణప్రసాద్ .. తెలుగు ఇండస్ట్రీలో సీనియర్ ప్రొడ్యూసర్. చాలా చిన్న వయసులోనే ఆయన నిర్మాణ రంగం వైపు అడుగువేశారు. 1988లో 'చిన్నోడు పెద్దోడు' సినిమాతో, నిర్మాతగా ఆయన ప్రయాణం మొదలైంది. నానీతో 'జెంటిల్ మెన్' .. సుధీర్ బాబు 'సమ్మోహనం' .. సమంతతో 'యశోద' వంటి విజయవంతమైన సినిమాలను నిర్మించినది ఆయనే. తాజాగా తెలుగు వన్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ .. 'ఆదిత్య 369' సినిమాకి నేను నిర్మాతగా ఉండటానికి కారకులు ఎస్పీ బాలుగారు. సింగితం గారి దగ్గర మంచి కథ ఉందని చెప్పి .. నన్ను వెళ్లి కలవమన్నారు. ఆ సినిమాతో బాలకృష్ణగారితో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత ఆయనతో 'వంశానికొక్కడు' సినిమా చేశాను. అది కూడా 100 డేస్ ఆడింది" అన్నారు.



" ఆ తరువాత నేను ఒకటి రెండు సినిమాలు నిర్మించి దెబ్బతిన్నాను. అలాగే ఒకటి రెండు సినిమాలకు సంబంధించిన హక్కులను తీసుకుని నష్టపోయాను. అలాంటి సమయంలో నేను బాలయ్యను కలుసుకుని .. ఇలా ఇబ్బందుల్లో ఉన్నాను ఒక సినిమా చేసి పెట్టమని అడిగాను. ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా 'చేస్తున్నాం' అన్నారు. "బాలయ్య ఎంతమాత్రం ఆలోచించకుండా నాకు మాటిచ్చిన ఆ క్షణాలను నేను ఎప్పటికీ మరిచిపోలేను. 'భలే వాడివి బాసూ' మాత్రమే కాదు, ఆ తరువాత 'మిత్రుడు' సినిమాను కూడా నాకు చేసి పెట్టారు. అయితే ఆ రెండు ప్రాజెక్టుల విషయంలో ఆయన నాకు ఇచ్చిన ఫ్రీడమ్ ను నేను ఉపయోగించుకోలేకపోయాను" అంటూ చెప్పారు.

## ప్రియాంక మోహన్ కోరిక తీరేనా?

**విశ్వంభర, సినిమా :** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన బిగ్గెస్ట్ హిట్ మూవీస్‌లో ఖుషి ఒకటి. ఈకల్ట్ క్లాసిక్ మూవీకి దర్శకుడు ఎస్ జే సూర్య. తమిళంలో విడుదలైన చిత్రానికి రీమేక్. కానీ తమిళం మించి ఈ మూవీ తెలుగులో పెద్ద హిట్ అయ్యింది. పవన్ కళ్యాణ్ నటించడమే ఈ సినిమా ప్రత్యేకత. అంతటి విజయానికి కారణమని చెప్పొచ్చు. పవన్ చేసిన మ్యాజిక్ అంతగా వర్కౌట్ అయ్యింది. దీంతో థియేటర్లలో రచ్చ చేసింది. అప్పట్లో ఇది ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఇదిలా ఉంటే ఈ మూవీకి సీక్వెల్ ప్రస్తావన వచ్చింది. ఖుషి 2 కోసం డిమాండ్ పెరిగింది. హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్ తన మనసులోని మాట బయటపెట్టింది. ఖుషి2 సినిమా చేయాలని ఎస్ జే సూర్యని కోరింది. నాని హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో సరిపోదా శనివారం సినిమా రూపొందిన విషయం తెలిసిందే. ఇందులో ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించగా, ఎస్ జేసూర్య నెగటివ్ రోల్ చేశారు. ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. తాజాగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు.

ఇందులో ప్రియాంక మోహన్ మాట్లాడుతూ, సినిమాకి పనిచేసిన అనుభావాన్ని పంచుకున్నారు. నానితో రెండో సారి పనిచేయడం చాలా ఆనందంగా ఉందని, అలాగే ఎస్‌జేసూర్యతోనూ రెండోసారి వర్క్ చేసినట్టు తెలిపింది. ఈసినిమాకి ఆయన ద్వారా చాలా నేర్చుకున్నట్టు తెలిపింది. ఈ క్రమంలో ఖుషి2 ఎప్పుడు సర్ అని అడిగింది. ఖుషి2 సినిమా చేయాలని, పవన్ సర్ తోనే చేయాలని ఆమె డిమాండ్ చేయడం విశేషం. దీనిపై స్పందించాలని కూడా ఆమె అడిగింది.

అనంతరం ఎస్ జేసూర్య స్టేజ్ పైకి వచ్చి మాట్లాడారు. అయితే సూర్య మాట్లాడుతుంటే ఫ్యాన్స్ అరుస్తున్నారు. ఖుషి2 చేయాలని, అప్ డేట్ ఇవ్వాలని తెలిపారు. ఈ క్రమంలో చాలా సేపు సూర్యని మాట్లాడనివ్వలేదు. దీంతో ఇబ్బంది పడ్డ ఎస్ జే సూర్య.. హింట్ ఇచ్చే ప్రయత్నంచేశాడు. కానీ ఏం చెప్పలేదు. సీన్ డైవర్ట్ అవుతుందనే ఉద్దేశ్యంతో ఆయన లవ్ కే పరిమితమయ్యాడు. ఖుషి2 అప్ డేట్ ఇవ్వలేదు. మరి ఇంతకి ఆయనకు ఆ ఆలోచన ఉందా? లేదా అనేది క్లారిటీ లేదు. మరి ప్రియాంక డిమాండ్‌ని ఎస్ జే సూర్య నెరవేరుస్తాడా? అనేది చూడాలి.

ఇదిలా ఉంటే ప్రస్తుతం ప్రియాంక మోహన్.. పవన్ తో కలిసి నటిస్తుంది. ఓజీ`లో ఆమె హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ నేపథ్యంలో పవన్‌తో `ఖుషి 2 చేయాలనే డిమాండ్ చేయడం ఆసక్తిని క్రియేట్ చేస్తుంది. `ఓజీ`కి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి విలన్‌గా కనిపించబోతున్నాడు. ప్రస్తుతం పవన్ రాజకీయాల్లో బిజీగా ఉన్నాడు. కానీ త్వరలోనే ఈ సినిమాలు పూర్తి చేసే అవకాశం ఉందని తెలుస్తుంది.

## ఇవి తింటే క్యాన్సర్‌కు స్వాగతం చెప్పినట్టే..

**విశ్వంభర, ఫీచర్ :** ప్రాసెస్డ్ మీట్ తినేవారికి క్యాన్సర్ తప్పక వస్తుందని నిపుణులు హెచ్చరిస్తు న్నారు. సాసేజ్‌లు, హాట్‌డాగ్, బర్గర్స్, బేకన్ వంటి ప్రాసెస్ చేసిన మాంసాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయని నిపుణులు చెబుతున్నారు. ప్రాసెస్ చేసిన మాంసాహారాలలో నైట్రేట్లు అధికంగా ఉంటాయని.. ఇవి నైట్రోసమైన్‌లు అని పిలువబడే కార్సినోజెనిక్ సమ్మేళనాలను ఏర్పరుస్తాయని అంటున్నారు. క్యాన్సర్‌కు కారణమైన వాటిల్లో ఇది ఒకటి. ప్రాసెస్ చేసిన మాంసాన్ని ఎక్కువగా తినడం పెద్ద పేగు క్యాన్సర్‌కు దారితీస్తుందని చాలా అధ్యయనాలు వెల్లడించాయి.



**రెడ్ మీట్స్:** అధిక ఉష్ణోగ్రతల వద్ద రెడ్ మీట్ ఉడికించ డం వల్ల హెటెరోసైక్లిక్ అమైన్‌లు (హెచ్‌సిఎలు), హైడ్రోకార్బన్‌లు (పిఎహెచ్‌లు) వం టి క్యాన్సర్ కారకాలు ఉత్పత్తి అవుతాయి. ఇది పెద్దపేగు, ప్రొస్టేట్, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయని చెబుతున్నారు.

**చక్కెర పానీయాలు:** సోడాలు, ఎనర్జీ డ్రింక్స్, జ్యూసులు వంటి చక్కెర పానీయాలు ఊబకాయానికి దారితీస్తాయని.. అలాగే ఇన్సులిన్ నిరోధకతకు దోహదం చేస్తాయని నిపుణులు అంటున్నారు. ఇవి రొమ్ము, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో సహా అనేక రకాల క్యాన్సర్లకు దారితీస్తాయని చెబుతున్నారు. అధిక చక్కెర వినియోగం శరీరంలో మంట,ఆక్సీకరణ ఒత్తిడిని కూడా ప్రోత్సహిస్తుందని హెచ్చరిస్తున్నారు. 2012లో "బ్రిటిష్ జర్నల్ ఆఫ్ క్యాన్సర్"లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. చక్కెర అధికంగా తీసుకోవడం వల్ల ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ రిస్క్ పెరుగుతుందని కనుగొన్నారు. ఈ పరిశోధనలో స్వీడన్‌లోని కరోలిన్స్కా ఇన్‌స్టిట్యూట్‌లో న్యూట్రిషన్ ఎపిడెమియాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుసన్నా సి.లార్సన్ పాల్గొన్నారు.

**శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు:** వైట్ బ్రెడ్, పేస్ట్రీలు, చక్కెర తృణధాన్యాలు వంటి శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు బరువు పెరగడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తాయని నిపుణులు అంటున్నారు. వీటిని ఎక్కువగా తినడం వల్ల ముఖ్యంగా రొమ్ము, కొలొరెక్టల్ క్యాన్సర్ల ప్రమాదానికి దోహదం చేస్తుందని హెచ్చరిస్తున్నారు.

**వేయించిన ఆహారాలు:** అధిక ఉష్ణోగ్రత వద్ద వేయించిన ఫ్రెంచ్ ఫ్రైస్, ఫ్రైడ్ చికెన్, డోనట్స్‌లు అక్రిలమైడ్ అనే రసాయనాన్ని కలిగి ఉంటాయి. ఇది కూడా వివిధ రకాల క్యాన్సర్ రిస్క్‌లను పెంచుతుందని అంటున్నారు.

**కృత్రిమ స్వీటెనర్లు:** ఆర్టిఫీషియల్ స్వీటెనర్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయని నిపుణులు అం టున్నారు. కొన్ని ఆర్టిఫిషియల్ స్వీ టె నర్లు జీర్ణమయ్యేటప్పుడు పలు రసా యనాలను విడుదల చేస్తాయని.. ఇవి క ణాలకు హాని కలిగించే అవకాశం ఉందని అంటున్నారు.

**హైలీ ప్రాసెస్డ్ ఫుడ్స్:** ప్యాకేజ్డ్ ఫుడ్స్ వంటి అధికంగా ప్రాసెస్ చే యబడిన ఆహారాలు అనారోగ్యకరమైన కొవ్వులు, అధిక చక్కెరలు కలిగి ఉంటాయి. ఈ ఆహారాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఊబకాయానికి దారితీస్తుందని.. తద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని వివరిస్తున్నారు.

**అధిక సోడియం ఆహారాలు:** ఇన్‌స్టంట్ సూప్‌లు, ఉప్పగా ఉండే స్నాక్స్ వంటి అధిక సోడియం ఆహారాలు.. అధిక రక్తపోటు, మూ త్రపిండాలు దెబ్బతినడానికి దోహదం చేస్తాయని నిపుణులు అంటున్నారు. ఎక్కువ కాలం సోడియం తీసుకోవడం వల్ల కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

**మద్యం:** ఆల్కహాల్ డైలీ తాగడం వల్ల రొమ్ము, కాలేయం, అన్నవాహిక క్యాన్సర్‌తో సహా అనేక క్యాన్సర్‌ల ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ఆల్కహాల్‌లో క్రియాశీలక భాగం అయిన ఇథనాల్.. సెల్యులార్ డ్యామేజ్‌ని కలిగిస్తుందని.. పోషకాల శోషణకు ఆటంకం కలిగిస్తుందని అంటున్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు మరో 8 ప్రథమ చికిత్స కేంద్రాల ఏర్పాటు: టీటీడీ

**విశ్వంభర, తిరుమల :** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ మరో 8 ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని టీటీడీ అధికారులు వివరించారు. ఇప్పటికే తిరుమల , తిరుపతిలలో శాశ్వతంగా ఆరు డిస్పెన్సరీలు, ఆరు ప్రథమ చికిత్స కేంద్రాలలో భక్తులు, ఉద్యోగులు, స్థానికులకు టీటీడీ వైద్య సేవలు అందిస్తోందని అన్నారు. తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో రెండు, రాంబగీచ అతిథి గృహాలు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రము, శిలా తోరణం, బాట గంగమ్మ ఆలయము, పాపానాశనం, 7వ మైలు వద్ద ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, మందులు, అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్ లు సిద్ధం చేసుకుంటున్నామని వెల్లడించారు.



రిపోర్టర్స్ కావలెను V3 NEWS విశ్వంభర తెలుగు దినపత్రిక
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com